

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 43

శుక్రవారం 5-5-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




సింగిల్ పీస్ డ్రెస్ ఎంపికలో లేయర్స్ ఉన్న ఫ్రాక్స్, స్కర్ట్స్‌కు ప్రాముఖ్యం ఇవ్వచ్చు. లేయర్స్ కాంట్రాస్ట్ కలర్స్‌లో ఉండటం వల్ల స్టైలిష్‌గానూ కనిపిస్తాయి. ఫొటోలకు కలర్‌ఫుల్‌గానూ ఉంటుంది.

బ్యూటిప్స్

మృదువైన చేతులు పాదాల కోసం...

- టేబుల్ స్పూన్ శనగపిండిలో చిటికెడు పసుపు వేసి అందులో తగిన మోతాదులో పాలు లేదా పెరుగు వేసి మరీ గట్టిగా కాకుండా ఒకింత జారుడుగా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ని చేతులకు, పాదాలకు పట్టించి పదిహేను – ఇరవై నిమిషాల పాటు ఉంచాలి. ఆ తరవాత వేళ్లతో వలయాకారంగా మర్దన చేస్తూ చర్మం నుంచి శనగపిండి ప్యాక్‌ను వదిలించిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే చేతులు, పాదాల చర్మం మృదువుగా మారుతుంది.
- రెండు స్పూన్‌ల నిమ్మరసం లేదా కమలాపండు రసంలో టీ స్పూన్ తేనె, టీ స్పూన్ గ్లిజరిన్, టీ స్పూన్ పన్నీరు కలిపి ఈ మిశ్రమాన్ని చేతులకు, పాదాలకు పట్టించాలి. ఇది రెగ్యులర్ ప్యాక్. చలికాలంలో రోజూ వేసుకోవచ్చు. ఎండాకాలంలో వారంలో రెండుసార్లు సరిపోతుంది.
- చేతి వేళ్లు, పాదాలు ఆకర్షణీయంగా కనిపించాలంటే... కలబంద గుజ్జులో రెండు చుక్కల బాదం నూనె లేదా గ్లిజరిన్ కలిపి రాత్రి పడుకునే ముందు చేతులకు, పాదాలకు రాసుకోవాలి. అలాగే టీ స్పూన్ టొమాటో రసం, అదే మోతాదులో గ్లిజరిన్, నిమ్మరసం కలిపి రాసినా కూడా మంచి ఫలితం ఉంటుంది.

హోమ్ మేడ్ ఫుట్ స్క్రబ్

- మూడు నిమ్మకాయలు, టేబుల్ స్పూన్ చక్కెర, టీ స్పూన్ బాదం నూనె, పది నుంచి పదిహేను పుదీన ఆకులు తీసుకోవాలి. నిమ్మకాయలను ముక్కలు చేయాలి. పుదీన ఆకులు, నిమ్మకాయ ముక్కలను (తొక్కతో సహా) మిక్సీలో గ్రైండ్ చేయాలి. అందులో చక్కెర, బాదం నూనె కలిపితే పాదాలకు స్క్రబ్ రెడీ. దీనిని పాదాలు, మడమలు, వేళ్ల మధ్య పట్టించి ఆరిన తర్వాత చేత్తో ఐదు నుంచి పది నిమషాల సేపు వలయాకారంగా మర్దన చేసి గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ఇది అన్ని కాలాల్లోనూ అవసరమే. వర్షాకాలంలో పాదాలు నాని ఇన్ఫెక్షన్‌లు సోకకుండా ఉండడానికి ఈ స్క్రబ్‌లో చిటికెడు పసుపు కలుపుకోవాలి.

స్క్రబ్ తయారు చేసుకునే సౌకర్యం లేనప్పుడు... అర బకెట్ వేడి నీటిలో అరకప్పు ఉప్పు (కల్లు ఉప్పు), నిమ్మరసం, పుదీన ఆకులు, నాలుగు చుక్కల కొబ్బరి నూనె వేసి ఆ నీటిలో పాదాలను ఉంచాలి. పది హేను నిమిషాల తర్వాత బాత్ బ్రష్ లేదా చిన్న నూలు వస్త్రంతో పాదాలను రుద్ది కడగాలి.





టాప్ టు బాటమ్ ఒకే కలర్ లేదా కాంట్రాస్ట్‌లో ఉన్న పలాజో–టాప్స్ కంఫర్ట్‌కు, స్టైల్‌కు పర్‌ఫెక్ట్ ఎంపిక అవుతుంది.



కాటన్ లాంగ్ టాప్స్, ఫ్రాక్ స్టైల్ కుర్తీలు బెస్ట్ ఆప్షన్‌గా నిలుస్తాయి. వీటికి బాటమ్‌గా పలాజో లేదా ధోతీ ప్యాంట్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. లేదంటే ఫ్రాక్ మాదిరిగా ఈ టాప్స్‌ను ధరిస్తే చాలు.

టూర్ స్టైల్

వేసవిలో ఎండవేడిమి అనే భయం ఉంటుంది. కానీ, సెలవుల్లో టూర్లు.. ఊర్లు తిరగచ్చనే ఆనందమూ ఉంటుంది. టూర్లకు వెళ్లినప్పుడు అనుకూలమైన డ్రెస్సులను ఎంపిక చేసుకుంటే ఆ ఆనందం రెట్టింపు అవుతుంది. కలర్‌ఫుల్‌గా, కంఫర్టబుల్‌గా, స్టైలిష్‌గా, వెరైటీగా ఉండాలని కోరుకునేవారు సులభంగా ఇలాంటి డ్రెస్సులను ఎంపిక చేసుకోవచ్చు. లైట్‌వెయిట్ డ్రెస్సింగ్‌తో ఈ వెకేషన్ టూర్లను మరింతగా ఆస్వాదించవచ్చు.



మిడ్ స్కర్ట్స్‌లో ప్రింటెడ్స్ మనసును ఆహ్లాదంగా మార్చేస్తాయి. వీటికి స్లీవ్‌లెస్ లేదా షర్ట్ టైప్ టాప్స్ సౌకర్యాన్ని బట్టి ఏ వయసు వారైనా ఎంచుకోవచ్చు.

టూర్లు వెళ్లేవారు రెగ్యులర్ డ్రెస్సులు కాకుండా వెళ్లబోయే ప్రాంత వాతావరణాన్ని బట్టి ఎంపిక చేసుకుంటారు. ఇక అక్కడి జ్ఞాపకాలను ఫొటోలలో భద్ర పరుచుకుంటారు కాబట్టి అందమైన డ్రెస్సులు ఉండాలనుకుంటారు. అందుకే, లైట్‌వెయిట్, సింగిల్ పీస్ డ్రెస్‌లకు అధిక ప్రాముఖ్యత ఉంటుంది. టూర్లలో వెంట తీసుకెళ్లే డ్రెస్‌లలో ఇవి ఎంచుకుంటే చాలు, స్టైలిష్ లుక్‌తో మెరిసిపోతారు. వెళ్లినచోట కంఫర్ట్‌ని ఎంజాయ్ చేస్తారు.



టై అండ్ డై, స్ట్రైప్స్ డ్రెస్సులు టూర్స్‌కి మంచి లుక్‌నిస్తాయి. వీటిలో లైట్ కలర్స్ ఎంచుకోవడం మేలు. మ్యాక్సీ స్కర్ట్స్ ఇలా ఎంచుకోవచ్చు.

ఆటలు ఆడు కన్నా

హెల్దీ టాయ్స్

చీప్ ప్లాస్టిక్. చైనా ప్లాస్టిక్. ఇవాళ పిల్లల బొమ్మలు వీటితోనే దొరుకుతున్నాయి. కళాత్మకమైన దేశీయమైన చెక్కతో తయారైన బొమ్మలు పిల్లలకు ఉండాలి అని బొమ్మల కేంద్రం ప్రారంభించింది మీతా శర్మ. హార్వర్డ్‌లో చదువుకున్నా తన ఇద్దరు పిల్లలు ఆడుతున్న బొమ్మలను చూశాక ఆమె ఈ పని మొదలెట్టింది. ఇవాళ నెలకు వెయ్యి అర్డర్లు వస్తున్నాయి. 100 మంది బొమ్మల కళాకారులు ఉపాధి పొందుతున్నారు. పిల్లలు ఆమె బొమ్మలతో చక్కగా ఆడుకుంటున్నారు.

ఈసప్ కథల్లో 'కాకి దప్పిక' కథ పిల్లలందరికీ చెబుతారు. దప్పిక గొన్న కాకి కుండలో నీళ్లను తాగడానికి ప్రయత్నించి, అవి అందక పోతే నాలుగు రాళ్లు జారవిడిచి, నీళ్లు పైకి తేలాక తాగుతుంది. ఆ విధంగా ఆ కథ అవసరం అయినప్పుడు యుక్తిని ఎలా పాటించాలో పిల్లలకు చెబుతుంది. ఈ కథ యూట్యూబ్‌లో వీడియోగా సులభంగా దొరుకుతుంది. కాని మీతా శర్మ తయారు చేసే బొమ్మల్లో ఇదే కథ మొత్తం బుజ్జి బుజ్జి చెక్క బొమ్మల సెట్టుగా దొరుకుతుంది. పిల్లలను ఉద్రేక పరిచే ఆటబొమ్మల కంటే ఇలాంటి బొమ్మలే అవసరం అంటుంది 'షుమి' అనే బొమ్మల సంస్థను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహిస్తున్న మీతా శర్మ.



మీతా శర్మ

కంప్యూటర్ ఇంజనీర్

మీతా శర్మది ఢిల్లీ. అక్కడే ఐఐటీ లో బిటెక్ చేసింది. ఆ తర్వాత హార్వర్డ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసింది. వివాహం అయ్యాక అమెరికాలోనే జీవితం మొదలెట్టింది. 'మా పెద్దాడు పుట్టాక అమెరికాలో క్వాలిటీ బొమ్మలు కొనిచ్చాను ఆడుకోవడానికి. అవన్నీ ఎకో ఫ్రెండ్లీ కొయ్యబొమ్మలు. పాడు కావు. హాని చేయవు. 2012 లో అమెరికా వద్దనుకుని ఇండియా వచ్చాక నాకు సమస్య ఎదురైంది. అప్పటికి నా రెండో కొడుక్కి రెండేళ్లు. ఇక్కడ వాడికి ఇద్దామంటే మంచి బొమ్మలే లేవు. అన్నీ ప్లాస్టిక్‌వి లేదా గాడ్జెట్స్, అమెరికన్ కామిక్స్‌లో ఉన్న కేరెక్టర్... ఇవే ఉన్నాయి. ఆ ప్లాస్టిక్ పిల్లలు నోటిలో పెట్టుకుంటే ప్రమాదం. మన చిన్నప్పుడు చెక్కతో తయారు చేసిన బుజ్జి బుజ్జి బొమ్మలు ఎంతో బాగుండేవి. అలాంటి బొమ్మల కోసం ఎంత వెతికినా దొరకడం లేదు. కొన్నిచోట్ల సంప్రదాయ బొమ్మలు ఉన్నాయి కాని వాటి మార్కెటింగ్ సరిగా లేదు. అందుకని నాకే ఒక బొమ్మల తయారీ సంస్థ ఎందుకు మొదలెట్టకూడదు అనిపించింది. 2016లో షుమి సంస్థను స్థాపించాను' అని తెలిపింది మీతా శర్మ.

వేప, మామిడి కలపతో

'నిజానికి సంస్థ స్థాపించడానికి పెట్టుబడి దొరకలేదు. ఎందుకంటే ఆ రోజుల్లో అందరూ పిల్లల గేమ్స్ తయారు చేసే సంస్థలనే ప్రోత్సహించేవి. నా దారేమో సంప్రదాయ కలప బొమ్మల దారి. అందుకే సొంత పెట్టుబడితో సంస్థను స్థాపించాను. బొమ్మలు చేసే కళాకారులను సంప్రదించి కేవలం వేప, మామిడి కలపతో ముద్దొచ్చే బొమ్మలను ముఖ్యంగా రెండేళ్ల వయసున్న పిల్లల కోసం ఎక్కువ గా ఆ తర్వాత పదేళ్ల లోపున్న పిల్లలకోసం బొమ్మలను తయారు చేయించాను. వాటికి ఉపయోగించే రంగులు కూడా రసాయనాలు లేనివే' అంది మీతా శర్మ.

ఢిల్లీలో తన సంస్థను స్థాపించాక రకరకాల కొయ్యగుర్రాలను, మూడు చక్రాల తోపుడు బండ్లను, బుజ్జి గుడారాలను, పిల్లలు ఆడే వంట సామగ్రిని, వారికి కొద్దిపాటి లెక్కలు నేర్పే ఆట వస్తువులను, కథలను బొమ్మల్లో చెప్పే సెట్లను ఇలా తయారు చేయించింది.'ఆన్‌లైన్‌లో మాకు ఆర్డర్లు వచ్చేవి. చాలామంది తల్లులు ఆ బొమ్మలతో ఐడెంటిఫై అయ్యారు. ఎందుకంటే వారంతా బాల్యంలో అలాంటి బొమ్మలతోనే ఆడారు కనుక. తమ పిల్లలకు సరిగ్గా అలాంటివే దొరకడంతో వారి ఆనందానికి హద్దులు లేవు' అని చెప్పిందామె.



ఇప్పుడు మీతా తయారు చేయిస్తున్న బొమ్మలు అమెరికా, యు.కె, సింగపూర్‌కు కూడా రవాణా అవుతున్నాయి. నెలలో 8000 ఆన్లైన్ ఆర్డర్లు వస్తున్నాయి. 100 మంది కళాకారులు చేతి నిండా పనితో ఉపాధి పొందుతున్నారు.

ఆటే పరిశోధన

'పిల్లల అసలైన పరిశోధన వారు ఆడే ఆటలతోనే మొదలవుతుందని పిల్లల మనస్తత్వ నిపుణులు తెలుపుతారు. పిల్లల్ని పిల్లల్లా ఉంచే ఆటబొమ్మలతో వారిని ఆడనివ్వాలి. హింసాత్మకమైన బొమ్మల నుంచి వారిని దూరం పెట్టాలి. హింసను ప్రేరేపించే గేమ్స్ నుంచి కూడా. పిల్లలు బొమ్మలతో స్నేహం చేసి వాటిని పక్కన పెట్టుకుని భయం లేకుండా నిద్రపోతారు. వారికి బాల్యం నుంచి అలాంటి నిశ్చింతనిచ్చే బొమ్మల వైపుకు నడిపించాలి' అని సలహా ఇస్తోంది మీతా.

ఒక ఉద్యోగిగా కంటే తల్లిగా ప్రయోజనాత్మక అంట్రప్రెన్యూర్‌గా ఆమె ఎక్కువ సంతృప్తిని, గౌరవాన్ని, ఆదాయాన్ని పొందుతోంది. అదీ విజయమేగా.

వంటిల్లు

మ్యాంగో ఫీస్ట్

సీజనల్ ఫ్రూట్స్ తింటాం... మరి! సీజనల్ ఐస్‌క్రీమ్ ఎందుకు తినకూడదు? అదే చేత్తో... సీజనల్ కుల్ఫీ... కేక్... కూడా ట్రై చేద్దాం. ఈ మ్యాంగో సీజన్‌లో పుణె వారి మస్తానీ కూడా! ఈ వారం మన 'వంటిల్లు'లో మ్యాంగో ఫీస్ట్ చేద్దాం.



మ్యాంగో ఐస్‌క్రీమ్

కావలసినవి: మామిడి పండ్లు – 3 ; కండెన్స్‌డ్ మిల్క్– 400 మి.లీ; తాజా క్రీమ్ – 3 కప్పులు; వెనిలా ఎసెన్స్– అర టీ స్పూన్.

తయారీ: ● వెడల్పు పాత్రలో క్రీమ్ వేసి బీటర్‌తో చిలకాలి. సమంగా కలిసి మృదువుగా రావాలంటే దాదాపు పదినిమిషాల సేపు చిలకాల్సి ఉంటుంది. చిలికిన తర్వాత ఓ గంటసేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. ● మామిడిపండ్లను శుభ్రంగా కడిగి చెక్కు, టెంక వేరు చేసి ముక్కలు చేయాలి. ఆ ముక్కలను జ్యూస్ బ్లెండర్‌లో వేసి గుజ్జు చేయాలి. దాదాపు రెండు కప్పుల గుజ్జు వస్తుంది. అందులోనే కండెన్స్‌డ్ మిల్క్ వేసి మరోసారి బ్లెండ్ చేయాలి. ● క్రీమ్ పాత్రను ఫ్రిజ్‌లో నుంచి తీసి అందులో మామిడి గుజ్జు–కండెన్స్‌డ్ మిల్క్ మిశ్రమాన్ని, వెనిలా ఎసెన్స్ వేసి బీటర్‌తో సమంగా కలిసేవరకు చిలకాలి. ఇందుకు ఎలక్ట్రిక్ బీటర్ ఉంటే మంచిది. అది లేకపోతే బ్లెండర్‌లోనే సమంగా కలిసేటట్లు కొద్ది సేపు బ్లెండ్ చేయాలి. ● ఈ మిశ్రమాన్ని ఒక పాత్రలో వేసి స్పూన్‌తో సమంగా సర్ది పైన అల్యూమినియం ఫాయిల్‌తో కవర్ చేసి అంచులను అతికించి ఆరుగంటల సేపు ఫ్రీజర్‌లో పెట్టాలి. మ్యాంగో ఐస్‌క్రీమ్ రెడీ. ● ఫ్రీజర్‌లో నుంచి తీసిన వెంటనే కప్పులో వేయడానికి సాధ్యం కాదు. గట్టిగా ఉంటుంది. కాబట్టి తినడానికి పదినిమిషాల ముందు ఫ్రీజర్‌లో నుంచి తీసి మామూలు ఉష్ణోగ్రతలో ఉంచాలి. **గమనిక:** ఎవరి ఇష్టాన్ని బట్టి వారు చెర్రీ, నట్స్‌తో అలంకరించుకోవచ్చు.



మ్యాంగో కేక్ (ఎగ్‌లెస్)

కావలసినవి: మామిడి పండు ముక్కలు – 300 గ్రాములు ; కండెన్స్‌డ్ మిల్క్ – 400 ఎం.ఎల్ ; **గోధుమ పిండి**– 300 గ్రా ; **చక్కెర** – 3 లేదా 4 టేబుల్ స్పూన్‌లు (మామిడి ముక్కల తియ్యదనాన్ని బట్టి) ; **బేకింగ్ పౌడర్**– టీ స్పూన్ ; **బేకింగ్ సోడా**– అర టీ స్పూన్ ; **వెనిలా ఎసెన్స్** – టీ స్పూన్ ; **వెన్న**– 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● గోధుమ పిండి, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడాలను కలిపి జల్లించి పక్కన పెట్టాలి. ● మామిడి ముక్కలు, చక్కెర కలిపి బ్లెండర్‌లో మెత్తగా చేస్తే మ్యాంగో ప్యూరీ రెడీ. ● అవెన్‌ను 180 డిగ్రీల సెల్సియస్‌తో ప్రీ హీట్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలి. ● ట్రేకి కొద్దిగా వెన్న రాసి సిద్ధం చేసుకోవాలి. ● మిగిలిన వెన్నను పెనంలో వేడి చేసి అందులో కండెన్స్‌డ్ మిల్క్ కలిపి మిశ్రమం మృదువుగా వచ్చే వరకు చిలకాలి. అందులో మ్యాంగో ప్యూరీ, వెనిలా ఎసెన్స్ వేసి బాగా కలిసే వరకు చిలకాలి. ఇప్పుడు ముందుగా జల్లించి సిద్ధంగా ఉంచిన గోధుమ పిండి మిశ్రమాన్ని వేసి సమంగా కలిసే వరకు గరిటెతో కలపాలి. ఇది చపాతీల పిండిలా గట్టిగా ఉండకూడదు. అలాగని దోశెల పిండిలా జారుడుగానూ ఉండరాదు. అవసరాన్ని బట్టి కొద్దిగా పాలు వేసి కలుపుకోవచ్చు. ● ఈ మిశ్రమాన్ని వెన్న రాసిన ట్రేలో పోసి ట్రేని ఒకసారి అటూఇటూ కదిలిస్తే ఒకే మందంలో సమంగా సర్దుకుంటుంది. 180 డిగ్రీల ఉష్ణోగ్రతలో 45 నిమిషాల పాటు బేక్ చేయాలి. టూత్ పిక్‌ను గుచ్చి చూసుకుని తేమ లేకుండా లోపల అంతా బేక్ అయిందీ లేనిదీ చెక్ చేసుకోవాలి. అవసరమైతే మరో పది నిమిషాల సేపు బేక్ చేసుకోవాలి. ● అవెన్ నుంచి తీసిన తర్వాత వెడల్పాటి ప్లేట్‌కి వెన్న రాసి లేదా అల్యూమినియం ఫాయిల్ పరిచి అవెన్ బౌల్‌ని బోర్లించి ముక్కలుగా కట్ చేయాలి.



మ్యాంగో మస్తానీ

కావలసినవి: మామిడి పండు ముక్కలు – అర కేజీ ; **పాలు** – పావు లీటరు (కాచి చల్లార్చాలి) ; **చక్కెర** – 2 లేదా 3 టేబుల్ స్పూన్‌లు (మామిడి తియ్యదనాన్ని బట్టి) ; **పిస్తా** – టేబుల్ స్పూన్ ; **బాదం** – పది (సన్నగా తరగాలి) ; **జీడి పప్పు** – 20 (వేయించుకోవచ్చు లేదా పచ్చిగానే వేసుకోవచ్చు) ; **చెర్రీలు** –5 ; **వెనిల్లా ఐస్ క్రీమ్** – 4 స్కూప్‌లు.

తయారీ: ● రెండు టేబుల్ స్పూన్ల మామిడి ముక్కలను విడిగా తీసుకుని మిగిలిన ముక్కలను జ్యూస్ బ్లెండర్‌లో మెత్తగా గుజ్జు చేసుకోవాలి. అందులో పాలు, చక్కెర వేసి మరోసారి బ్లెండ్ చేయాలి. ● ఈ మిశ్రమాన్ని గ్లాసులో పోసి ఐస్ క్రీమ్ అర స్పూన్ వేయాలి. పైన బాదం, పిస్తా, జీడిపప్పు, చెర్రీలు, ముందుగా తీసి పక్కన ఉంచిన మామిడి ముక్కలను చిన్న ముక్కలుగా తరిగి అలంకరించాలి.

గమనిక: మ్యాంగో మస్తానీ చిక్కగా కావాలంటే మామిడి ముక్కలను ఓ గంట సేపు ఫ్రిజ్‌లో పెట్టి బ్లెండ్ చేసుకోవచ్చు లేదా పాలు, చక్కెర కలిపి బ్లెండ్ చేసిన తర్వాత సర్వ్ చేసే లోపు ఓ గంట సేపు ఫ్రిజ్ లో పెట్టవచ్చు. టైమ్ లేనప్పుడు గ్లాసులో ముప్పావు వంతు మ్యాంగో మస్తానీతో నింపి మూడు ఐస్ క్యూబ్‌లు వేసుకోవచ్చు.



మ్యాంగో కుల్ఫీ

కావలసినవి: మామిడి పండ్లు – 3 (పెద్దవి) ; **వెన్నతీయని పాలు** – 300 ఎం.ఎల్ ; **కండెన్స్‌డ్ మిల్క్** – 200 ఎం.ఎల్ ; **తాజా క్రీమ్**– అర కప్పు ; **యాలకుల పొడి**– అర టీ స్పూన్ ; **కుంకుమ పువ్వు**– పది రేకలు.

తయారీ: ● మామిడి పండ్లను కడిగి చెక్కు, టెంక తొలగించి ముక్కలు చేయాలి. ● పాలను కాచి మీగడ తేలనివ్వకుండా తిరగబోస్తూ వెంటనే చల్లార్చాలి. ● క్రీమ్‌ని విడిగా చిలికి పక్కన పెట్టుకోవాలి. ● పాలు, మామిడి పండు ముక్కలు, కండెన్స్‌డ్ మిల్క్ కలిపి బ్లెండ్ చేయాలి. అందులో యాలకుల పొడి, కుంకుమ పువ్వు, చిలికిన క్రీమ్ వేసి మరోసారి తిప్పాలి. ● ఈ మిశ్రమాన్ని కుల్ఫీ మౌల్డ్‌లలో పోసి, మూత పెట్టి ఫ్రీజర్ పెట్టాలి. ఎనిమిది గంటలకు కుల్ఫీ సెట్ అవుతుంది. ● తినడానికి పది నిమిషాల ముందు ఫ్రీజర్‌లో నుంచి బయటకు తీయాలి. వెంటనే తినాలంటే నీటి ధార కింద కుల్ఫీ మౌల్డ్‌ను ఉంచితే మౌల్డ్ నుంచి కుల్ఫీ విడివడుతుంది. ఒక ప్లేట్‌లోకి తీసుకుని చాకుతో స్లైస్‌లుగా కట్ చేసి సర్వ్ చేయాలి. ఇష్టమైతే కుల్ఫీ స్లైస్‌ల మీద మరికొంత యాలకుల పొడి, కుంకుమ పువ్వు చల్లుకోవచ్చు.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 43

శుక్రవారం 5-5-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



రెజ్లర్ల దీక్షా శిబిరం వద్ద ఉద్రిక్తత


పురుష పోలీసులు అనుచితంగా ప్రవర్తించారంటూ కన్నీరు పెట్టుకున్న మహిళా రెజ్లర్లు

6లో

కేసు ముగిస్తున్నాం: సుప్రీం

రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిపై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో ఈ నిర్ణయం.

12లో



దేశవ్యాప్తంగా 100 'ఫుడ్ స్ట్రీట్'లు

దేశవ్యాప్తంగా 100 'ఫుడ్ స్ట్రీట్'లకు ఆర్థికసాయం చేస్తామని కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రకటించారు.

- వివరాలు 6లో



'సరిహద్దు' పరిష్కారానికే పెద్ద పీట

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి సరిహద్దు సమస్యల్ని పరిష్కరించుకోవడం ముఖ్యమని జైశంకర్ చైనాకు స్పష్టం చేశారు.

- వివరాలు 6లో



జెలెన్‌స్కీని అంతం చేయక తప్పదు

జెలెన్‌స్కీని భౌతికంగా అంతం చేయడం మినహా తమకు మరో గత్యంతరం లేదని రష్యా మాజీ అధ్యక్షుడు మెద్వెదేవ్ తేల్చిచెప్పారు.

- వివరాలు 6లో



కర్ణాటక 'సెంట్రల్' ఎవరివైపు..!

ఐదుగురు సీఎంలను ఇచ్చిన సెంట్రల్ కర్ణాటకలో అధిక సీట్లు సాధించేందుకు బీజేపీ, కాంగ్రెస్ తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

- వివరాలు 6లో

ఏది నిజం?

గంతలు కట్టేందుకే కట్టుకథలు

- ఇటు.. భోగాపురం ఎయిర్‌పోర్ట్, అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన
- అటు.. చంద్రబాబు సర్కారు అవినీతిపై సిట్ దర్యాప్తునకు సుప్రీం అనుమతి
- వాటి నుంచి దృష్టి మళ్లించేందుకే వివేకా హత్యపై ఎల్లో గ్యాంగ్ దుష్ప్రచారం
- 10 రోజుల క్రితమే సీబీఐ అఫిడవిట్.. కౌంటర్ కూడా దాఖలు చేసిన ఎంపీ అవినాశ్‌రెడ్డి
- పాత చింతకాయ పచ్చడినే తాజాగా వడ్డించేందుకు బాబు ఆపసోపాలు
- 2019 కడప ఎంపీ టికెట్‌పై పచ్చ మీడియా అవాస్తవ కథనాలు
- గూగుల్ టేక్ అవుట్ పేరిట ఫేక్ సమాచారం.. ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలకు అది పూర్తి విరుద్ధం
- వివేకా హత్య కేసులో సీబీఐ విస్మరిస్తున్న కీలక అంశాలెన్నో

- వివరాలు 4లో



రెక్కల కష్టం కరిగిపోరాదని..

భూమిపై ఇంద్రధనుస్సు పరుచుకున్నట్లు కనిపిస్తున్న ఈ చిత్రం వెనుక ఎందరో కార్మికుల రెక్కల కష్టం దాగి ఉంది. అకాల వర్షాలతో పంట నష్టం, ధాన్యం తడిసిపోవడమే కాదు.. ఇటుకల పరిశ్రమకూ ముప్పు పొంచి ఉంది. అందుకే తమ కష్టార్జితం వర్షానికి కొట్టుకుపోకుండా బట్టీల యజమానులు ఇటుకలపై ఇలా కవర్లు కప్పి కాపాడుకుంటున్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ శివారులో కనిపించిందీ దృశ్యం.

- మర్రి సతీష్‌రెడ్డి, సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



అధ్యక్షుడి చాంబర్‌లో బాధ్యతలు స్వీకరిస్తూ సంతకం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో కౌశిక్ రెడ్డి, మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, రవిచంద్ర, లింగయ్య యాదవ్, కేకే, మల్లారెడ్డి, నామా, కేటీఆర్, సంతోష్, కొత్త ప్రభాకర్‌రెడ్డి

హస్తినలో గులాబీ అడ్డా

ఢిల్లీలోని వసంత్ విహార్‌లో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

- పార్టీ జెండా ఆవిష్కరించి.. రిబ్బన్ కట్ చేసిన సీఎం కేసీఆర్
- తన చాంబర్‌లో బాధ్యతల స్వీకారం.. హాజరైన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- గంటపాటు కార్యాలయంలో గడిపిన కేసీఆర్..

సాక్షి, న్యూఢిల్లీ: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం టీఆర్ఎస్‌గా ఆవిర్భవించి.. రెండు దశాబ్దాల తర్వాత మరో ప్రస్థానం మొదలుపెట్టిన బీఆర్ఎస్ పార్టీ దేశ రాజధాని ఢిల్లీలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించుకుంది. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమైంది. ఢిల్లీలోని వసంత్ విహార్ ప్రాంతంలో నిర్మించిన

మిగతా 2వ పేజీలో ▶

వానతో వర్రీ లేదు ✦ గింజ రాలదు ✦ నేలకొరగదు ✦ చలికి వెరవదు..

వెన్ను విరగని వరి!

వడగళ్లు, ఈదురుగాలులనూ తట్టుకునే వంగడాలు

దేశీ రకాలను అభివృద్ధి చేసి సిద్ధం చేస్తున్న వ్యవసాయ వర్సిటీ

ఇప్పటికే అందుబాటులోకి జేజీఎల్-24423 వంగడం

- ఇటీవలి వడగళ్ల వానలను దీటుగా తట్టుకున్న వరి రకం
- కాండం దృఢంగా ఉండటంతో నేలవాలని తీరు
- అభివృద్ధి దశలో ఇలాంటి మరో ఏడు వంగడాలు
- వచ్చే ఏడాది నాలుగు, ఆ తర్వాత ఏడాది మూడు..
- సీజన్ ముందుగానే ముగించేలా తక్కువ కాల పంట
- సాధారణ, హైబ్రిడ్ రకాలతో పోలిస్తే దిగుబడి ఎక్కువ
- వానాకాలం, యాసంగి రెండు సీజన్లకూ అనుకూలం



జేజీఎల్-24423 వరి రకం

నీళ్లు అందుబాటులో ఉండటంతో వరి ఏపుగా పెరిగింది.. నిండా గింజలతో కళకళలాడుతోంది.. కానీ ఒక్కసారిగా ఈదురుగాలులు, వడగళ్లు, భారీ వర్షం.. అయినా వరి పెద్దగా దెబ్బతినలేదు. గింజలు నేల రాలలేదు.. నేలవాలిన మొక్కలు కూడా రెండు, మూడు రోజుల్లోనే తిరిగి నిలబడ్డాయి. మామూలుగా అయితే వరి నేలకొరిగి, ధాన్యం రాలిపోయి రైతు నిండా మునిగిపోయేవాడే. కానీ ఇది దేశీ రకాల వంగడం కావడంతో ప్రకృతి వైపరీత్యాన్ని తట్టుకుని నిలబడింది. అకాల వర్షాలు-పంట నష్టం సమస్యపై చర్చ జరుగుతున్న క్రమంలో.. వ్యవసాయ యూనివర్సిటీ దీనికి పరిష్కారంగా అభివృద్ధి చేసిన వరి వంగడాలు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయి.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో దాదాపు నెల రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఈదురుగాలులు, వడగళ్ల ధాటికి లక్షల ఎకరాల్లో వరి నేల వాలింది. గింజలు రాలిపోయాయి. దీనిపై సమీక్ష చేసిన సీఎం కేసీఆర్.. వ్యవసాయ సీజన్లను ముందుకు జరిపే అంశాన్ని పరిశీలించాలని, అకాల వర్షాలు మొదలయ్యే లోపే పంట కోతలు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కానీ రాష్ట్రంలో పరిస్థితులు

మిగతా 5వ పేజీలో ▶



రాజకీయాలు ఇష్టముంటే బీజేపీలో చేరండి

గవర్నర్‌ను ఉద్దేశించి మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు

రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా పని చేస్తున్న తమిళిసై

- తెలంగాణకు వెన్నుపోటు పొడిచేలా ప్రవర్తన
- ప్రతిపక్ష నాయకురాలి రీతిలో వ్యవహరిస్తున్నారని విమర్శ

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా పని చేస్తున్నారని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. నా ప్రభుత్వం అంటూనే తెలంగాణకు వెన్నుపోటు పొడిచేలా ఆమె వ్యాఖ్యలు, ప్రవర్తన ఉంటున్నాయని, ప్రతిపక్ష నాయకురాలి రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ రాజకీయాలు మాట్లాడకూడదని, రాజకీయాలు ఇష్టముంటే బీజేపీలో చేరి పోటీ చేయాలని అన్నారు. తమిళిసై బీజేపీ కనుసన్నల్లో పని చేస్తున్నట్టుగా ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు. గురువారం బీఆర్ఎస్ శాసనసభా పక్ష కార్యాలయంలో మంత్రి మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు.

తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యాఖ్యలు..: 'మహిళా గవర్నర్‌గా తమిళిసై సౌందరరాజన్ పట్ల మాకు గౌరవం ఉంది. కానీ గవర్నర్‌కు రాజ్యాంగం పరిధిలో కొన్ని పరిమితులు ఉంటాయి. కానీ ఇక్కడ గవర్నర్ వ్యవస్థ రాజ్యాంగ వ్యవస్థకు తూట్లు పొడిచే విధంగా తయారైంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుపై తమిళిసై చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయి. బుధవారం జరిగిన సీ-20 సదస్సులో రాష్ట్రాన్ని గొప్పగా పొగడాల్సిన తమిళిసై తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడారు. సీఎం కేసీఆర్ మామూలు వ్యక్తి కాదు.. ప్రజల మనిషి. నాలుగు

మిగతా 11వ పేజీలో ▶

న్యూస్‌రీల్

యాజమాన్యం వాటా నుంచే.. ఈపీఎస్‌కు అదనపు చెల్లింపు



ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) అధిక పెన్షన్ చందాదారులకు ఊరటనిచ్చింది. వేతన పరిమితి దాటిన ఉద్యోగులకు సంబంధించి అదనంగా చెల్లించాల్సిన ఈపీఎస్ మొత్తాన్ని యాజమాన్యాలే భరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రత్యేకంగా నోటిఫికేషన్ జారీ చేసింది.

- వివరాలు 10లో

కేటీఆర్‌కు ప్రపంచ ఆర్థిక వేదిక ఆహ్వానం



ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) 14వ వార్షిక సదస్సుకు హాజరుకావాల్సిందిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. జాతీయ అభివృద్ధి, సంస్కరణల కమిషన్, చైనా భాగస్వామ్యంతో ఈ ఏడాది జూన్ 27 నుంచి 29వ తేదీ వరకు చైనాలోని తియాన్జిన్‌లో ఈ సదస్సు జరగనుంది.

- వివరాలు 2లో

ఓఆర్ఆర్ టెండర్లను రద్దు చేయాలి

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డిమాండ్

- లక్ష కోట్ల విలువైన ఓఆర్ఆర్‌ను 7వేల కోట్లకు అమ్ముతారా?
- దీనిపై కేటీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారు
- టెండర్‌లో అక్రమాలపై విచారణ సంస్థలకు ఫిర్యాదు చేస్తామని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్‌రోడ్ (ఓఆర్ఆర్) టెండర్లలో నూటికి నూరు శాతం అక్రమాలు చోటు చేసుకున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఓఆర్ఆర్‌ను 30 ఏళ్ల పాటు ప్రైవేటు సంస్థకు లీజుకిచ్చే టెండర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఇంత రాద్ధాంతం జరుగుతుంటే మంత్రి కేటీఆర్ వివరణ ఇవ్వకుండా మొహం చాటేసి, అర్వింద్‌కుమార్‌తో మాట్లాడించారన్నారు. గురువారం రేవంత్ హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఓఆర్ఆర్‌పై టోల్‌ట్యాక్స్ రూపంలో ఏటా రూ.700 కోట్ల ఆదాయం వస్తోందని, పెరిగే వాహనాలు, టోల్‌ట్యాక్స్‌లతో సంబంధం లేకుండా ఇప్పటి ఆదాయంతో లెక్కకట్టినా 30 ఏళ్లలో ప్రభుత్వానికి

మిగతా 11వ పేజీలో ▶

శాశ్వత అంగవైకల్యం ఉంటేనే

రిజర్వేషన్లు



'తాత్కాలిక వైకల్యం'కు ప్రయోజనాలు నిలిపివేత

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు అనుమతించరు
- వికలాంగుల హక్కుల చట్టం -2016 మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు
- ఇందుకు అనుగుణంగా రాష్ట్ర సర్కారు ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, పదోన్నతులకు సంబంధించి వికలాంగ (దివ్యాంగ) రిజర్వేషన్ల అమలులో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శాశ్వత అంగవైకల్యం ఉన్న వారికి మాత్రమే దివ్యాంగ రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఇదివరకు తాత్కాలిక వైకల్య ధ్రువీకరణ(టెంపరరీ డిజేబుల్డ్ సర్టిఫికెట్)తో ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో, పదోన్నతుల్లో అవకాశం

మిగతా 2వ పేజీలో ▶



పొంగులేటి, జూపల్లితో భేటీ అయిన ఈటల. చిత్రంలో రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర రెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, ఏలేటి మహేశ్వరరెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి

కేసీఆర్‌ను పంపించడమే ఏకైక ఎజెండా

మాజీ ఎంపీ పొంగులేటి స్పష్టీకరణ

- అవసరమైతే నాలుగు మెట్లు కిందకు దిగుతాం..
- బీజేపీతో చర్చలు ప్రాథమిక దశలోనే ఉన్నాయి
- కాంగ్రెస్‌తో పాటు కమ్యూనిస్టులు కూడా వచ్చి మమ్మల్ని అడగొచ్చు
- పొంగులేటి, జూపల్లితో ఈటల తదితర బీజేపీ నేతల భేటీ
- వారిని బీజేపీలోకి ఆహ్వానించామన్న ఈటల


సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఇంటికి పంపించడమే తమ ఏకైక ఎజెండా అని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తానైనా, జూపల్లి అయినా ఏ సీటులో నిలబడాలి, ఎవరికి ఎన్ని సీట్లు కావాలనేది ప్రధానం కాదని.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న వారంతా ఒకే వేదికపైకి రావాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వబోమని, రెండు, మూడు మెట్లు కాదు.. అవసరమైతే నాలుగు మెట్లు కిందకు దిగుతామని

మిగతా 11వ పేజీలో ▶

‘ధరణి’తో సమస్యలు పెరిగాయి

చాలా ఇబ్బందులకు పరిష్కారమే లేదు: హైకోర్టు

- ఎవరిని అడగాలో తెలియని పరిస్థితిలో ప్రజలు
- 'ధరణి' పిటిషన్ల విచారణ ఉత్తర్వుల్లో వ్యాఖ్య
- నాలుగు వారాల్లో పరిష్కరిస్తామన్న సీసీఎల్ఏ నవీన్ మిత్తల్



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ భూ సమస్యల పరిష్కారం, నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన ధరణి పోర్టల్ ఆశించిన మేర ఫలితాలు ఇవ్వడం లేదని హైకోర్టు అభిప్రాయపడింది. దీంతో రైతుల సమస్యలు పెరిగాయని, ఎక్కడికి పోయి వీటిని పరిష్కరించుకోవాలో తెలియని సందిగ్ధ పరిస్థితి నెలకొందని పేర్కొంది. పొరపాట్లను సరిచేసుకునే ఆప్షన్లు లేక ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెప్పింది. బ్రోకర్లకే లబ్ధి అనేలా ధరణి పోర్టల్ తయారైందని.. ఇన్నేళ్లయినా సమస్యలు పరిష్కరించకపోవడం ప్రజల హక్కులను కాలరాయడమే అవుతుందని సర్కార్‌ను మందలించింది. ధరణి పోర్టల్‌లో తలెత్తుతున్న సమస్యలపై దాఖలైన పలు పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ జరిపారు. ఈ సందర్భంగా భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)ను కోర్టుకు పిలిపించి వివరణ తీసుకున్నారు. సీసీఎల్ఏ నవీన్ మిత్తల్ వ్యక్తిగతంగా హైకోర్టుకు హాజరై 4 వారాల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జస్టిస్ కె.లక్ష్మణ్ ఆర్డర్ కాపీలో ధరణిలోని పలు సమస్యలను ప్రస్తావించారు.

ధరణిలో హైకోర్టు పేర్కొన్న ప్రధాన సమస్యలు

1. డేటా సవరణ కోసం పెట్టుకున్న ఆన్‌లైన్ అర్జీలను పరిష్కరించకపోవడం
2. నిర్ణీత సమయంలో ఈ-పట్టాదార్ పాస్ పుస్తకాలను

మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



• మణిపూర్

మణిపూర్‌లో భీకర హింస



ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో హింస ప్రజ్వరిల్లింది. తమకు షెడ్యూల్డ్ కులాల(ఎస్టీ) హోదా కల్పించాలని రాష్ట్ర జనాభాలో 53 శాతం ఉన్న మైతీ వర్గం డిమాండ్ చేయడం అగ్గి రాజేసింది. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఇళ్లు, దుకాణాలు, వాహనాలకు గిరిజనులు నిప్పుపెట్టారు. ఈ హింసాకాండలో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఘర్షణలను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం 'కనిపిస్తే కాల్చివేత' ఉత్తర్వులు జారీ చేసింది.

6లో

• మహారాష్ట్ర

ఎన్సీపీ అధినేత ఎవరవుతారో?



నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) తదుపరి జాతీయ అధ్యక్షుడు ఎవరన్నది శుక్రవారం తేలిపోనుంది. పార్టీ అధినేతగా తన వారసుడిని ఎంపిక చేసేందుకు శరద్ పవార్ ఒక కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ శుక్రవారం సమావేశం కానుందని ఎన్సీపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. సుప్రియా సూలే లేదా అజిత్ పవార్ ఎన్సీపీ అధినేతగా పగ్గాలు చేపట్టే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

6లో

• ఉత్తరప్రదేశ్

యూపీలో మరో గ్యాంగ్‌స్టర్ హతం



ఉత్తరప్రదేశ్‌లో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరో గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. యూపీ, ఢిల్లీల్లో 18 హత్య కేసులు సహా మొత్తం 60 కేసుల్లో నిందితుడైన గ్యాంగ్‌స్టర్ అనిల్ దుజానా పోలీసుల వాంటెడ్ లిస్ట్‌లో ఉన్నాడు. గురువారం మధ్యాహ్నం ఎస్టీఎఫ్ పోలీసులు మీరట్ సమీపంలోని ఓ గ్రామంలో అతడున్న ప్రాంతాన్ని చుట్టుముట్టి పట్టుకునేందుకు ప్రయత్నించారు. తప్పించుకునే క్రమంలో కాల్పులు జరుపుతూ ఎదురు కాల్పుల్లో దుజానా మృతి చెందాడని ఎస్టీఎఫ్ అదనపు డీజీ తెలిపారు.

6లో

రాష్ట్రంలో పెరగనున్న ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగనున్నాయి. వారంరోజులుగా వాతావరణంలో నెలకొన్న మార్పులు, అకాల వర్షాల కారణంగా ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. ప్రస్తుతం పొడి వాతావరణం ఏర్పడుతుండటంతో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణశాఖ సూచించింది. ఈ నెల 6న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది క్రమంగా బలపడి 8వ తేదీ నాటికి వాయుగుండంగా కేంద్రీకృతం కానుందని అంచనా వేసింది. దీంతో రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు మారుతాయని, పొడి వాతావరణం ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని సూచించింది. గురువారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత హైదరాబాద్‌లో 35.7 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత నల్లగొండలో 20.4 డిగ్రీ సెల్సియస్‌గా నమోదయ్యాయి.

తెలంగాణలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
హైదరాబాద్	35.7	22.8
భద్రాచలం	35.6	25.0
ఖమ్మం	35.6	24.6
నల్లగొండ	35.5	20.4
ఆదిలాబాద్	35.0	22.5
రామగుండం	34.2	24.9
మహబూబ్‌నగర్	34.0	23.9
నిజామాబాద్	33.9	20.5
మెదక్	33.2	21.0
హనుమకొండ	33.0	23.0
హకీంపేట్	32.5	22.7
దుండిగల్	32.3	21.9

క్లుప్తంగా...

సీడబ్ల్యూసీకి 'వార్ధా' డీపీఆర్ సమర్పించండి

అధికారులకు రజత్‌కుమార్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: వార్ధా బ్యారేజీ డీపీఆర్‌కు అనుమతుల కోసం నాలుగు రోజుల్లో కేంద్ర జలవనరుల సంఘాని (సీడబ్ల్యూసీ)కి సమర్పించాలని నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్.. అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జలసౌధలో ప్రాజెక్టులపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రూ.4,874 కోట్లతో వార్ధా బ్యారేజీ నిర్మాణం చేపట్టనున్న విషయం విదితమే. ఈ సందర్భంగా రజత్‌కుమార్ మాట్లాడుతూ, వానాకాలం వచ్చేలోపు వివిధ ప్రాజెక్టులకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం) కింద మంజూరు చేసిన పనులన్నీ పూర్తి చేయాలని, పనులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోపే అన్ని ఎత్తి పోతల పథకాల పంపులన్నీ సిద్ధం చేయాలని ఆదేశించారు. దీని కోసం నాలుగు రోజులకోసారి సమీక్ష నిర్వహించాలని ఈఎన్సీని ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో మైనర్, ఫీల్డ్ చానల్స్‌ను మరమ్మతు చేయాలన్నారు. డ్యామ్‌సేఫ్టీ చట్టం ప్రకారం గుర్తించిన భారీ ఆనకట్టల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, దీనికి పూర్తి బాధ్యత చీఫ్ ఇంజనీర్లదేనని స్పష్టం చేశారు.

వెలిగొండ ప్రాజెక్టు పనులను అడ్డుకోవాలి

కేఆర్‌ఎంబీ చైర్మన్‌కు తెలంగాణ లేఖ

సాక్షి, హైదరాబాద్: వెలిగొండ టన్నెల్ ప్రాజెక్టు పనులను అడ్డుకోవాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు గురువారం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు తెలంగాణ ఈఎన్సీ సి.మురళీధర్ లేఖ రాశారు. శ్రీశైలం జలాశయం నుంచి నల్లమల్లసాగర్‌కు నీటిని తరలించడానికి వీలుగా ఏపీ ప్రభుత్వం ఒక టన్నెల్‌ను పూర్తి చేసిందని, మరో టన్నెల్ పనులు శరవేగంగా చేపడుతోందని గుర్తు చేసింది. వరద జలాలపై చేపట్టే ప్రాజెక్టులు తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతీసేలా ఉన్నాయని, బేసిన్ లోపల ఉన్న కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలపై వీటి ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. నాగార్జునసాగర్ ఆయకట్టుతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలపై దీని ప్రభావం ఉంటుందని పేర్కొంది.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అవినీతిపై సీబీఐతో విచారణ చేయించాలంటూ కాంగ్రెస్ సీనియర్ నేత నాగం జనార్దన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. ఈ పిటిషన్ గురువారం జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది పాస్ ఓవర్ చేయాలని కోరగా.. కేసు పూర్తిస్థాయిలో విచారణ జరపాల్సి ఉందని, మరోతేదీకి వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ కోరారు. దీంతో తదుపరి విచారణ సెప్టెంబర్‌కు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

కలబురిగిలో నువ్వా.. నేనా

హైదరాబాద్ కన్నడనాట అధికార బీజేపీ, కాంగ్రెస్ నడుమ తీవ్ర పోటీ

చిట్టాపూర్, సేడంలలో బలంగా ఉన్న జేడీఎస్

ఈ ప్రాంతంలో ఈసారి కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు రావొచ్చని అంచనా

కలబురిగి (గుల్బర్గా) నుంచి
కల్వల మల్లికార్జున్‌రెడ్డి



హైదరాబాద్ కర్ణాటకలో అతిపెద్ద జిల్లా కలబురిగి (గుల్బర్గా)లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారపర్వం జోరందుకుంది. ఈ నెల 10న ఎన్నికలు జరగనుండగా బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్ పోటాపోటీగా ప్రచారం చేస్తున్నాయి. కర్ణాటకకు గతంలో ఇద్దరు సీఎంలు వీరేంద్ర పాటిల్, ధరమ్‌సింగ్‌ను అందించిన కాంగ్రెస్ కలబురిగి జిల్లాపై పట్టు సాధించేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే (కాంగ్రెస్–చిట్టాపూర్), దివంగత మాజీ సీఎం ధరమ్‌సింగ్ కుమారుడు అజయ్‌సింగ్ (కాంగ్రెస్–జీవర్గి), గుల్బర్గా ఎంపీ ఉమేశ్ జాదవ్ కుమారుడు అవినాశ్ జాదవ్ (బీజేపీ–చించోలి), బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలికయ్య గుత్తేదార్ (బీజేపీ–అఫ్జల్‌పూర్) తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. గత ఎన్నికల్లో కలబురిగిపై బీజేపీ కాస్త పట్టు సాధించగా ఈసారి కాంగ్రెస్ మెజారిటీ సీట్లు సాధించొచ్చని చెబుతున్నారు. అభ్యర్థుల గుణగణాలు, సామాజిక వర్గ సమీకరణాలు, ధన ప్రవాహం కూడా ఎన్నికల్లో గణనీయ ప్రభావం చూపుతాయని 'సాక్షి'క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. ఆయా నియోజకవర్గాల్లో పార్టీల పరిస్థితి ఇలా...

• అఫ్జల్‌పూర్..

కాంగ్రెస్ కంచుకోటగా పేరొందిన అఫ్జల్‌పూర్ నియోజకవర్గంలో దిగ్గజ నేతలు ఎంవై పాటిల్ (కాంగ్రెస్), మాలికయ్య గుత్తేదార్ (బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు) పోటీ పడుతున్నారు. బీజేపీ నుంచి టికెట్ ఆశించిన మాలికయ్య గుత్తేదార్ సొంత సోదరుడు నితిన్ గుత్తేదార్‌కు అధిష్టానం మొండిచేయి చూపడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి కాంగ్రెస్, బీజేపీకి తీవ్ర పోటీనిస్తున్నారు. 1978లో జనతా, 2004లో జేడీ(ఎస్), 2018లో కాంగ్రెస్ తరపున ఎన్నికైన ఎంవై పాటిల్ మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. 1985 నుంచి 2013 వరకు ఆరుసార్లు కాంగ్రెస్ నుంచి గెలిచిన మాలికయ్య గుత్తేదార్ 2018లో బీజేపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. జేడీఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శివకుమార్ నటికర్ ప్రచారం ఇంకా పుంజుకోలేదు.

• జీవర్గి..

కాంగ్రెస్‌కు కంచుకోటగా పేరొందిన జీవర్గిలో ప్రాతినిధ్యం కోసం బీజేపీ ప్రయత్నిస్తోంది. 1972 నుంచి 2004 వరకు వరుసగా ఎనిమిదిసార్లు కాంగ్రెస్ నుంచి ధరమ్‌సింగ్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2013, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ధరమ్ సింగ్ చిన్న కుమారుడు డాక్టర్ అజయ్ సింగ్ మూడోసారి పోటీ చేస్తున్నారు. 2008లో ధరమ్ సింగ్‌పై గెలిచిన బీజేపీ నేత 'దొడ్డప్పగౌడ శివలింగప్పగౌడ్ పాటిల్ నారిబోల్‌కు టికెట్ నిరాకరించడంతో జేడీ(ఎస్) తరపున పోటీ చేస్తున్నారు.

• చిట్టాపూర్ (ఎస్సీ)..

మల్లికార్జున ఖర్గే కుమారుడు, మాజీ మంత్రి ప్రియాంక్ ఖర్గే వరుసగా నాలుగోసారి కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్నారు. 2009 ఉప ఎన్నికలో ఓడిన ప్రియాంక్ తిరిగి 2013, 2018లో గెలిచి మంత్రిగా కూడా పనిచేశారు. బీజేపీ తరఫున మణికంఠ రాథోడ్ పోటీ చేస్తుండగా, సుభాష్ చంద్ర రాథోడ్ జేడీ(ఎస్) నుంచి బరిలో ఉన్నారు. కరోనా వేళ సామాజిక సేవలో నిమగ్నమైన జేడీ (ఎస్) అభ్యర్థి సుభాష్ చంద్ర రాథోడ్‌పై సానుకూలత ఉంది.

• సేడం..

తెలంగాణ సరిహద్దులో ఉన్న సేడంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రాజ్‌కుమార్ పాటిల్ మళ్లీ బరిలో నిలవగా గతంలో మూడుమార్లు ఎమ్మెల్యేగా పనిచేసి 2018 ఎన్నికలో ఓడిన శరణ్ ప్రకాశ్ పాటిల్ వరుసగా ఐదోసారి కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగారు. రాజ్‌కుమార్ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. సేవా కార్యక్రమాలతో నియోజకవర్గంలో పర్యటిస్తున్న జేడీ(ఎస్) అభ్యర్థి బాలరాజు గుత్తేదార్ బలమైన అభ్యర్థిగా తెరమీదకు వచ్చారు. గాలి జనార్దన్ రెడ్డి మేనల్లుడు, కల్యాణ రాజ్య ప్రగతిపక్ష అభ్యర్థి జి.లల్లేశ్ రెడ్డి కూడా విస్తృత ప్రచారం చేస్తున్నారు.

• చించోలి (ఎస్సీ)..

గుల్బర్గా బీజేపీ ఎంపీ డాక్టర్ ఉమేశ్ జాదవ్ కుమారుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే అవినాశ్ జాదవ్ మళ్లీ పోటీ చేస్తున్నారు. గతంలో మల్లికార్జున ఖర్గేకు అనుచరుడైన ఉమేశ్ జాదవ్ 2018లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసి 2019లో గుల్బర్గా స్థానం నుంచి ఖర్గేపై బీజేపీ ఎంపీగా గెలుపొందారు. చించోలి నియోజకవర్గం బీదర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఉండటంతో ఉమేశ్ జాదవ్ దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. దీంతో అవినాశ్ జాదవ్‌కు కాంగ్రెస్ అభ్యర్థి సుభాష్ వి. రాథోడ్ గట్టిపోటీనిస్తున్నారు.

• గుల్బర్గా రూరల్ (ఎస్సీ)..

బీజేపీ ఎమ్మెల్యే బస్వరాజ్ మత్తిమూడ్, కాంగ్రెస్ అభ్యర్థి రేవు నాయక్ బెలమాగి నడుమ పోటీ సాగుతోంది. ఇక్కడ జేడీ (ఎస్) ఎన్నికల అవగాహనలో భాగంగా సీపీఎంకు మద్దతిస్తోంది. సీపీఎం తరపున పాండురంగ్ మావింకర్ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రేవు నాయక్ 2008లో బీజేపీ, 2018లో జేడీ(ఎస్), ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్నారు. తరచూ పార్టీలు మారడంతో ఆయనకు కొంత ప్రతికూలత కనిపిస్తోంది.

• అలంద్..

సిట్టింగ్ ఎమ్మెల్యే సుభాష్ గుత్తేదార్ బీజేపీ నుంచి, మాజీ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. జేడీ(ఎస్) మహిళా అభ్యర్థి మహేశ్వరి వలేను బరిలోకి దింపింది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులిద్దరూ పాతవారే కావడంతో రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు.

• గుల్బర్గా దక్షిణ..

తన తండ్రి చంద్రశేఖర్ పాటిల్ (2008 బీజేపీ), తల్లి అరుణా పాటిల్ (జేడీఎస్) రాజకీయ వారసత్వాన్ని పుచ్చుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యే దత్తాత్రేయ పాటిల్ (అప్పు గౌడ) వరుసగా మూడోసారి బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో దత్తాత్రేయ పాటిల్‌పై ఓటమి పాలైన అల్లంప్రభు పాటిల్ మళ్లీ కాంగ్రెస్ నుంచి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అల్లంప్రభు పాటిల్ వరుస ఓటములపై ప్రజల్లో కొంత మేర సానుభూతి కనిపిస్తోంది.

• గుల్బర్గా ఉత్తర..

మైనారిటీ ఓటర్లు అధికంగా ఉండే గుల్బర్గా ఉత్తరలో మైనారిటీలు 60 శాతం మేర ఓటు బ్యాంకు కలిగి ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కనీజ్ ఫాతిమా కాంగ్రెస్ నుంచి హ్యాట్రిక్ గెలుపును ఆశిస్తున్నారు. బీజేపీ నుంచి చంద్రకాంత్ పాటిల్, జేడీఎస్ నుంచి నాసిర్ హుస్సేన్ ఉస్తాద్ పోటీ చేస్తున్నారు. జేడీఎస్ ఓట్ల చీలిక బీజేపీకి అనుకూలించకూడదనే అభిప్రాయం మైనారిటీ ఓటర్లలో నెలకొంది. వరుస విజయాలు సాధించిన కాంగ్రెస్ అభ్యర్థిపై కొంత ప్రతికూలత కనిపిస్తోంది.

తెలంగాణకు 7.64 ఎకరాలు.. ఏపీకి 12.09 ఎకరాలు

ఏపీ భవన్ విభజనపై ఇరు రాష్ట్రాలతో భేటీలో కేంద్రం ప్రతిపాదన



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని ఏపీ భవన్ విభజనపై కేంద్రం తాజా ప్రతిపాదనతో ముందుకొచ్చింది. మొత్తం 19.73 ఎకరాల్లో ఏపీకి 12.09 ఎకరాలను, తెలంగాణకు 7.64 ఎకరాలను కేటాయించేలా ప్రతిపాదించింది. కేంద్రం ప్రతిపాదన ఆచరణయోగ్యంగా ఉందని ఏపీ స్వాగతించింది. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి (ఇంటర్ స్టేట్) ఆధ్వర్యంలో ఏప్రిల్ 26న ఇరు రాష్ట్రాలతో నిర్వహించిన సమావేశం మినిట్స్‌ను కేంద్రం గురువారం విడుదల చేసింది. ఈ మినిట్స్ ప్రకారం ఏపీ భవన్ విభజనకు మూడు ఆప్షన్లు ఉన్నాయని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం స్పందిస్తే తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. అయితే తమకు రెండు ఆప్షన్లు ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వం తరపున ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వివరించారు. ఆప్షన్–డీలో భాగంగా పటౌడీ హౌస్ భూమి 7.64 ఎకరాలు మినహా ఇప్పటికే ఉన్న భవనాలు 12.09 ఎకరాలతోపాటు గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్‌తో కూడిన మొత్తం భూమిని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. జనాభా నిష్పత్తి ప్రకారం ఈ ప్రతిపాదన ఎక్కువగా ఉంటుంది కాబట్టి అదనపు భూమి కోసం ఏపీకి 2/3 విలువతో కూడిన ఆర్థిక సర్దుబాటు చేస్తామన్నారు. ఆప్షన్–సీని గతంలోనే వ్యక్తపరిచామన్నారు. అయితే తెలంగాణ తాజా ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోవడానికి ముందుకెళ్తామని ఏపీ ప్రభుత్వం తెలిపింది. తదనంతరం కేంద్ర సంయుక్త కార్యదర్శి ఆప్షన్–ఈతో ముందుకొచ్చారు. ఇది ఆప్షన్ డీకి వ్యతిరేకమని పేర్కొన్నారు. పటౌడీ హౌస్ మొత్తం 7.64 ఎకరాలను తెలంగాణకు ఇచ్చి, గోదావరి, శబరి బ్లాకులున్న భూమి సహా నర్సింగ్ హాస్టల్ 12.09 ఎకరాలను ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తామని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆచరణీయంగా ఉందని తెలిపారు. ఆప్షన్ సీ, డీ, ఈలను పరిశీలించి ఇరు రాష్ట్రాలు వీలైనంత త్వరగా అభిప్రాయాలు తెలపాలని కేంద్రం కోరింది. సమావేశంలో కేంద్ర సంయుక్త కార్యదర్శులు సంజీవ్ కుమార్ జిందాల్, జి.పార్థసారథి, ఏపీ ప్రభుత్వం తరపున కార్యదర్శి ఎల్.ప్రేమచంద్రారెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, రెసిడెంట్ కమిషనర్ ఆదిత్యనాథ్ దాస్, అదనపు రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్, తెలంగాణ తరపున ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్షన్లు ఇలా...

ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించినవి...

- ఆప్షన్–ఏ: తెలంగాణకు శబరి బ్లాకు సహా పటౌడీ హౌస్‌లో సగభాగం.. ఏపీకి గోదావరి బ్లాకు, నర్సింగ్ హాస్టల్ బ్లాకు, పటౌడీ హౌస్‌లో సగభాగం
- ఆప్షన్–బీ: ఏపీకి పటౌడీ హౌస్ మొత్తం, శబరి బ్లాకు.... తెలంగాణకు గోదావరి బ్లాకు, నర్సింగ్ హాస్టల్

తెలంగాణ ప్రతిపాదించినవి...

- ఆప్షన్–సీ: తెలంగాణకు శబరి, గోదావరి బ్లాకులు, ఆంధ్రప్రదేశ్‌కు నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్
- ఆప్షన్–డీ: తెలంగాణకు శబరి, గోదావరి నర్సింగ్ హాస్టల్ 12.09 ఎకరాలు ... ఏపీకి పటౌడీ హౌస్

కేంద్రం ప్రతిపాదన

ఆప్షన్–ఈ: ఏపీకి శబరి, గోదావరి బ్లాకులు, నర్సింగ్ హాస్టల్ సహా 12.09 ఎకరాలు.. తెలంగాణకు పటౌడీ హౌస్ 7.64 ఎకరాలు.

'ధరణి'తో సమస్యలు పెరిగాయి

▶ మొదటి పేజీ తరువాయి

జారీ చేయకపోవడం

- సర్వే కోసం ఎఫ్–లైన్ దరఖాస్తులు పెట్టుకున్నా పట్టించుకోకపోవడం.. కాలవ్యవధి పాటించకపోవడం
- వేలంలో కొనుగోలు చేసిన వారికి బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు జారీ చేసిన కొనుగోలు డాక్యుమెంట్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడం
- ఏ కారణాలు చెప్పకుండా ఆన్‌లైన్/ఎఫ్–లైన్ దరఖాస్తులను తిరస్కరించడం
- సెక్షన్ 7కు లిమిటేషన్ పీరియడ్ వివరంగా చెప్పలేదు. ఎప్పటినుంచి న్యాయస్థానం డిక్రీలు పరిగణనలోకి తీసుకుని మార్పు చేస్తారో చెప్పలేదు.
- అమ్మకం, కొనుగోలు లావాదేవీలను సకాలంలో పూర్తి చేయడానికి ధరణిలో అప్‌లోడ్ చేసిన జనరల్, స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీలను పట్టించుకోకపోవడం.
- ఆర్వోఆర్ చట్టం సెక్షన్ 7లో పేర్కొన్న 'కోర్టు డిక్రీ' అనే దానిలో స్పష్టత లేదు.
- కోర్టు కేసులు, స్టే, ఇంజెంక్షన్ ఆదేశాల్లో వివాదం ఉన్న భూమి మాత్రమే కాకుండా.. సదరు సర్వే నంబర్‌లోని భూములన్నింటినీ నిషేధిత జాబితాలో పెడుతున్నారు.
- కొత్త ఆర్వోఆర్ యాక్ట్ రాకముందు పాత ఆర్వోఆర్ చట్టం–1971లోని సెక్షన్ 5(బీ), 5(5), 9 కింద రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఆదేశాలపై అప్పీల్ లేదా రివిజన్‌కు అవకాశం కల్పించే ప్రొవిజన్లు లేవు. దీంతో కొత్త చట్టం రాకముందు అధికారులిచ్చిన ఆదేశాలను సవాల్ చేయడానికి తెలంగాణ జనరల్ క్లాజెస్ చట్టం–1891 కింద అప్పీల్‌కు అవకాశం ఇవ్వాలని కొందరు పిటిషన్లు వేస్తున్నారు.
- పాత ఆర్వోఆర్ చట్టం ప్రకారం రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఆదేశాలపై అప్పీళ్లు, రివిజన్ పిటిషన్‌లను కొత్త ఆర్వోఆర్ చట్టం ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక ట్రిబ్యునళ్లకు పంపాల్సి ఉంటుంది. అలాంటి అప్పీళ్లను ఇప్పటికీ ప్రత్యేక ట్రిబ్యునళ్లకు పంపలేదు.
- అగ్రికల్చర్ నుంచి నాన్ అగ్రికల్చర్‌కు మారిన భూమి మాత్రమే కాకుండా మొత్తం ఆ సర్వే నంబర్‌ను 'నాలా' జాబితాలో చూపిస్తున్నారు.
- రీసర్వే సెటిల్‌మెంట్ రిజిస్టర్ (ఆర్‌ఎస్‌ఆర్)లో నమోదైన భూమిలో కొంత భాగాన్ని మార్చడానికి ఎటువంటి ఆప్షన్ అందుబాటులో లేదు.
- పొరపాటున ఏదైనా సర్వే నంబర్ నిషేధిత జాబితాలో చేరినా.. ప్రభుత్వ భూమి అని నమోదైనా దానిని మార్చడానికి ఆప్షన్ అందుబాటులో లేదు.
- మ్యుటేషన్ చేయాలని కోరుతున్న వ్యక్తికి ఉన్న టైటిల్‌ను తనిఖీ చేయడం అధికారులకు కష్టమైన పనిగా మారింది. మ్యుటేషన్ చేయాలని కోరుతున్న భూమి లింక్ డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసేలా ఆప్షన్ ఉండాలి.
- ఉమ్మడిగా కొనుగోలు చేసిన భూమి లేదా ఉమ్మడి పట్టాదారుల మధ్య ఉన్న భూమిని హక్కుదారుల మధ్య విభజించడానికి ఎలాంటి ఆప్షన్ లేదు.
- చనిపోయిన విక్రయదారు వారసుల నుంచి పట్టా పొందే వీలు లేదు.
- మిస్సింగ్ సర్వే నంబర్లు మళ్లీ చేర్చడానికి, తప్పుడు ఎంట్రీలు మార్చే ఆప్షన్ లేదు.
- భూ యజమాని నుంచి ప్రభుత్వం భూమి సేకరించిన తర్వాత ఆ భూమిని డిలీట్ చేయడానికి ఆప్షన్ ఇవ్వలేదు.
- అలాగే ప్రభుత్వం అసైన్ చేసిన భూముల వివరాలు కూడా ధరణిలో కనిపించడం లేదు.

ఇవికాక కోర్టు దృష్టికి రాని ఎన్నో సమస్యలు ఉన్నాయని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కేటీఆర్‌కు ప్రపంచ ఆర్థిక వేదిక ఆహ్వానం

చైనాలో జూన్ 27 నుంచి జరిగే సదస్సులో పాల్గొనాలని విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) 14వ వార్షిక సదస్సుకు హాజరుకావాల్సిందిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. జాతీయ అభివృద్ధి, సంస్కరణల కమిషన్(ఎన్‌డీఆర్‌సీ), చైనా భాగస్వామ్యంతో ఈ ఏడాది జూన్ 27 నుంచి 29వ తేదీ వరకు చైనాలోని తియాన్జిన్‌లో ఈ సదస్సు జరగనుంది. ఆవిష్కరణలు, ఎమర్జింగ్ టెక్నాలజీలో తెలంగాణను దిక్సూచిగా మార్చడంలో కేటీఆర్ చేసిన కృషిని ప్రపంచ ఆర్థిక వేదిక అధ్యక్షుడు బ్రెజ్ బ్రెండే ఆహ్వానపత్రంలో ప్రశంసించారు. స్టార్టప్‌లు, ఆవిష్కరణల వ్యవస్థలను ప్రోత్సహించేందుకు టీహబ్ వంటి సంస్థల ఏర్పాటులో భారతదేశంలో తెలంగాణ అగ్రభాగాన ఉందని కొనియాడారు. ఎంట్రప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్, డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించడంలో కేటీఆర్ అభిప్రాయాలను సదస్సు తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు బ్రెజ్ బ్రెండే పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రతినిధులు, వ్యాపార, వాణిజ్య రంగాలు, అంతర్జాతీయ సంస్థలకు చెందిన సుమారు 1,500 మంది ఈ సదస్సుకు హాజరవుతారు.

విదేశాల్లో ఉద్యోగావకాశాలకు 'ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్'

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో ఉద్యోగావకాశాలకు సంబంధించి ప్రతి శనివారం మల్లేపల్లిలోని టామ్‌కామ్ కార్యాలయంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు టామ్‌కామ్ సీఈఓ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ దేశాలతోపాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగరీ, యూకే తదితర దేశాల్లో నైపుణ్య ఉద్యోగాలు, సాంకేతిక సహాయకులకు సంబంధించిన కేటగిరీల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వివరాలు నమోదు చేసుకోవాలని, లేదా టామ్‌కామ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలని సూచించారు.

హస్తినలో గులాబీ అడ్డా!

▶ మొదటి పేజీ తరువాయి

బీఆర్‌ఎస్ భవన్‌ను పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం ప్రారంభించారు. మధ్యాహ్నం 12:54 గంటలకు బీఆర్‌ఎస్ భవన్‌కు చేరుకున్న కేసీఆర్.. తొలుత పార్టీ జెండాను ఎగురవేశారు. తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. తర్వాత ముహూర్తం ప్రకారం.. మధ్యాహ్నం 01:05 గంటలకు రిబ్బన్ కట్ చేసి పార్టీ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మొదటి అంతస్తులోని పార్టీ అధ్యక్షుడి చాంబర్‌లోకి వెళ్లిన కేసీఆర్.. పలు పత్రాలపై సంతకాలు చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సమయంలో కేసీఆర్ వెంట ఉన్న శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు జోగినపల్లి సంతోష్ కుమార్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మొత్తంగా సుమారు గంట పాటు బీఆర్‌ఎస్ భవన్‌లో గడిపిన కేసీఆర్.. తర్వాత తుగ్లక్ రోడ్డులోని తన నివాసానికి వెళ్లిపోయారు. సాయంత్రం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

భారీగా పోస్టర్లు.. బందోబస్తు మధ్య

బీఆర్‌ఎస్ భవన్ ప్రారంభోత్సవం సందర్భంగా బీఆర్‌ఎస్ భవన్ నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల పరిధిలో కేసీఆర్‌కు స్వాగతం పలుకుతూ పోస్టర్లు, బ్యానర్లు పెద్ద ఎత్తున వెలిశాయి. బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద తెలంగాణ పోలీసులతోపాటు ఢిల్లీ పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వసంత్ విహార్ మెట్రోస్టేషన్ నుంచి బీఆర్‌ఎస్ భవన్ వరకు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీలు కె.కేశవరావు, నామా నాగేశ్వర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, బీబీ పాటిల్, వెంకటేశ్ నేత, మాలోత్ కవిత, బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు. కాగా.. బీఆర్‌ఎస్ భవన్ ప్రారంభోత్సవం కవరేజీ కోసం వచ్చిన మీడియా ప్రతినిధులపై సీఎం సెక్యూరిటీ సిబ్బంది దురుసుగా వ్యవహరించారు. మీడియా ప్రతినిధులను దూరంగా పంపించడంతోపాటు 'సబ్ కో హఠావో' అంటూ ఢిల్లీ పోలీసులను కూడా కోరారు.

నాడు జలదృశ్యం.. నేడు ఢిల్లీలో అద్వితీయ దృశ్యం

జాతీయ రాజకీయాలపై బీఆర్‌ఎస్ ముద్ర ఖాయం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాధన కోసం జలదృశ్యంలో టీఆర్‌ఎస్‌గా మొదలైన ప్రస్థానం .. బీఆర్‌ఎస్‌గా దేశ రాజధాని ఢిల్లీలో అడుగుపెట్టడం పార్టీ శ్రేణులతోపాటు రాష్ట్రానికీ గర్వకారణమని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పేర్కొన్నారు. ఢిల్లీలో బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా కేటీఆర్ పార్టీ శ్రేణులకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తల పట్టుదలతోనే బీఆర్‌ఎస్ రూపంలో ఢిల్లీలో తెలంగాణ ఆత్మగౌరవ పతాకం ఎగిరిందని ఆయన పేర్కొన్నారు. ఉద్యమ పార్టీగా పురుడు పోసుకుని తెలంగాణను సాధించిన గులాబీ జెండా.. దశాబ్దాలుగా దగాపడిన దేశ ప్రజలను గెలిపించేందుకే ఢిల్లీలో అడుగుపెట్టిందని వ్యాఖ్యానించారు. గోల్‌మాల్ గుజరాత్ మోడల్ పనికిరాదని దేశప్రజలు గ్రహించారని, గోల్డెన్ తెలంగాణ మోడల్‌పైనే చర్చ జరుగుతోందని వివరించారు. జాతీయ రాజకీయ యవనికపై బీఆర్‌ఎస్ బలమైన ముద్ర వేయడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదాన్ని నిజం చేసేంత వరకు విరామం లేకుండా పనిచేద్దామని బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.





ఢిల్లీలో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేసీఆర్. చిత్రంలో బాల్కసుమన్, కేకే, వినోద్ కుమార్, నామా, శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి

శాశ్వత అంగవైకల్యం ఉంటేనే రిజర్వేషన్లు

▶ మొదటి పేజీ తరువాయి

కల్పించగా... ఇప్పుడు ఆ ప్రయోజనాలను నిలిపివేసింది. తాత్కాలిక వైకల్యంతో ఉన్న వ్యక్తికి కొంత కాలం తర్వాత వైకల్య స్థితిలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ మార్పు తాలుకు ఫలితం వైకల్యం నయమవ్వడం లేదా శాశ్వత వికలాంగుడిగా మారడంలాంటి సంఘటనలు అనేకం ఉంటాయి. ఈ క్రమంలో వికలత్వ నిర్ధారణ విషయంలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

శాశ్వత నిర్ధారణ సర్టిఫికెట్లే పరిగణించాలని..

శాశ్వత వికలత్వ నిర్ధారణ సర్టిఫికెట్లను మాత్రమే పరిగణించాలని, ఇతరత్రా సర్టిఫికెట్లను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు వికలాంగుల సాధికారత, వయోవృద్ధుల సంక్షేమ శాఖ రూపొందించిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ అందుకు అనుగుణంగా జీఓ 41 జారీ చేసింది.

40శాతం దాటితేనే...

వికలాంగ రిజర్వేషన్ల అమలులో వికలత్వ శాతమే కీలకం. కనీసం 40శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరిస్తేనే రిజర్వేషన్ల వర్తింపును ప్రభుత్వం అనుమతిస్తుంది. ప్రతి వికలాంగుడు తప్పకుండా వైకల్య ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. అందులో శాశ్వత ప్రాతిపదిక వైకల్యం ఉన్నట్లయితేనే రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. ఈమేరకు జీఓ 41లో స్పష్టత ఇచ్చింది. తాత్కాలిక వైకల్యం(టెంపరరీ డిజబులిటీ) ధ్రువీకరణ పత్రాన్ని ఇదివరకు అంధ విభాగంలోనే జారీ చేస్తుండగా... ప్రస్తుతం అన్ని కేటగిరీల్లోనూ ఈ ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం జారీ చేస్తోంది. మొదటిసారి ధ్రువీకరణ పత్రం కోసం సంప్రదించే ప్రతి వికలాంగుడికి టెంపరరీ సర్టిఫికెట్ ఇస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగ నియామకాలు పెద్ద సంఖ్యలో కొనసాగుతున్నాయి. ఇప్పటికే పలు నియామక సంస్థలు ఉద్యోగ ప్రకటనలు జారీ చేసి అర్హత పరీక్షలు సైతం నిర్వహిస్తున్నాయి. అతిత్వరలో పరీక్షల నిర్వహణ ప్రక్రియ వేగం పుంజుకోగా... వెనువెంటనే ఫలితాలను ప్రకటించి నియామకాల ప్రక్రియను వేగవంతం చేసేందుకు కార్యాచరణ రూపొందించాయి. ఈ సమయంలో వికలాంగ రిజర్వేషన్ల అమలులో మరింత పారదర్శకత కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. వికలాంగ రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన జీఓ 41 ప్రతులను రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామక సంస్థలకు ప్రత్యేకంగా పంపింది. జీఓ 41లో పేర్కొన్న నిబంధనల ప్రకారమే తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

ఇది వికలాంగులపై కక్షసాధింపు చర్య: ముత్తినేని వీరయ్య

తాత్కాలిక ధ్రువీకరణను రిజర్వేషన్ల అమలులో పరిగణించమంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీవ్ర అన్యాయం. ప్రస్తుతం సదరమ్ ద్వారా జారీ చేస్తున్న సర్టిఫికెట్లన్నీ టెంపరరీ సర్టిఫికెట్లే. కొందరికి రెండు, మూడేళ్లుగా ఇవే సర్టిఫికెట్లు ఇస్తున్నారు. ప్రస్తుతం ఉద్యోగ నియామకాల సమయంలో ఈ అంశాన్ని తీసుకురావడంతో అసలైన లబ్ధిదారులు నష్టపోయే అవకాశాలున్నాయి. జీఓ 41 జారీ ప్రక్రియ వికలాంగులపై కక్షసాధింపు చర్యగా భావిస్తున్నాం. ఈ ఉత్తర్వులను రద్దు చేసేందుకు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం.

క్లుప్తంగా...

43 అంగన్‌వాడీలు మంజూరు చేయండి



సాక్షి, న్యూఢిల్లీ: బాన్సువాడ నియోజకవర్గానికి 43 అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేయాలని తెలంగాణ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఢిల్లీలో కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఇందీవార్ పాండేను జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌తో కలిసి వినతి పత్రం అందజేశారు.

వచ్చే ఏడాది నుంచి సినిమాలకు అవార్డులు

దాసరి విగ్రహావిష్కరణ సభలో మంత్రి తలసాని వెల్లడి



దాసరి నారాయణరావు విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి తలసాని శ్రీనివాస్

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం తరపున సినీ అవార్డులను వచ్చే ఏడాది నుంచి ప్రకటిస్తామని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం దివంగత దాసరి నారాయణరావు 76వ జయంతిని పురస్కరించు కుని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో ఆయన విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ సినీరంగానికి దాసరి చేసిన సేవలను కొనియాడారు. దర్శకుడిగా 150 సినిమాలను తెరకెక్కించి గిన్నిస్‌బుక్ రికార్డును స్వంతం చేసుకున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. దాసరి వంటి దర్శక దిగ్గజం మన తెలుగు సినీ పరి శ్రమలో ఉండటం మనందరికీ గర్వకారణమన్నారు.

నంది అవార్డుల కోసం ఎవరూ మమ్మల్ని సంప్రదించలేదు

రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి నంది అవార్డులు ఎందుకు ఇవ్వట్లేదని కార్యక్రమంలో విలేకరులు మంత్రి తలసానిని అడిగారు. అవార్డులు ఇవ్వాలని సినీ పరిశ్రమ నుంచి ప్రభుత్వాన్ని ఎవరూ సంప్రదించలేదని మంత్రి బదులిచ్చారు. కార్యక్రమంలో చిత్రపురి హౌసింగ్ సొసైటీ, 24 క్రాఫ్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్, సినీ ప్రముఖులు సి.కల్యాణ్, దామోదర ప్రసాద్, ప్రసన్నకుమార్, దర్శకులు ఎన్.శంకర్, రేలంగి నర్సింహారావు, దాసరి అరుణ్‌కుమార్, ఫిలించాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిదుర ఉండదు.. కుదురుగుండదు

ఇప్పటివరకు ఆఫ్రికా ఏనుగులు(ఆఫ్రికన్ బుష్ ఎలిఫెంట్) మాత్రమే అతి తక్కువ సమయం నిద్రించే క్షీరదాలుగా గుర్తింపు పొందాయి. ఇప్పుడా జాబితాలో సముద్ర జీవి 'ఎలిఫెంట్ సీల్' కూడా చేరిపోయింది. ఆఫ్రికన్ ఏనుగుల మాదిరిగానే ఇవి కూడా రోజుకు 2 గంటలు మాత్రమే నిద్రిస్తాయని శాస్త్రవేత్తలు తేల్చారు. ఏడాదిలో కనీసం ఏడు నెలల పాటు పసిఫిక్ సముద్ర జలాల్లో ప్రయాణించే భారీ క్షీరదాలైన ఈ ఎలిఫెంట్ సీల్స్ రోజంతా వేటలోనే నిమగ్నమై ఉంటాయట. - సాక్షి, అమరావతి





వివిధ జంతువుల నిద్ర సమయం ఇలా.. (రోజుకు గంటల్లో)

గుర్రం	2.9
గాడిద	3.1
ఏనుగు	3.9
జిరాఫీ	4.5
మేక	5.3
కుందేలు	11.4
చింపాంజీ	9.7
కుక్క	10.0
పులి	15.8
ఎలుక, పిల్లి	12.5
ఉడుత	14.9
చిరుత	18.0
సింహం	20

(సుమారు)

అతి తక్కువ సమయం నిద్రించే క్షీరదంగా 'ఎలిఫెంట్ సీల్'

- ఆఫ్రికా ఏనుగుల్లాగే రోజుకు రెండు గంటలే నిద్రిస్తాయని గుర్తించిన శాస్త్రవేత్తలు
- శత్రువుల నుంచి తప్పించుకోవడానికి 1,237 అడుగుల లోతుకు వెళ్లి మరీ నిద్ర
- రోజంతా వేటాడుతూనే ఉంటాయని వెల్లడి

ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఓషనోగ్రఫీ జర్నల్ సైన్స్‌లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం.. ఎలిఫెంట్ సీల్స్ సముద్ర ఉపరితలం నుంచి సుమారు 377 మీటర్ల లోతు (1,237 అడుగులు)కు వెళ్లి నిద్రిస్తున్నట్టు కనుగొన్నారు. ఇవి ఏకబిగిన కాకుండా 20 నిమిషాల కంటే తక్కువ సేపు 'క్యాట్‌నాప్' (స్వల్పకాలిక) శ్రేణిలో మొత్తంగా 2 గంటలపాటు నిద్రిస్తున్నట్టు అంచనా వేశారు. ఎలిఫెంట్ సీల్స్ పెద్ద మొత్తంలో చేపల్ని వేటాడి తింటాయి. అయితే, ఇవి శత్రు జీవులైన సొర చేపలు, కిల్లర్ వేల్స్ దాడిలో మరణిస్తుంటాయి. ఇవి ఇతర మాంసాహార జీవుల నుంచి తమను తాము రక్షించుకునేందుకు లోతైన జలాల్లోకి వెళ్లి కొద్ది నిమిషాలపాటు (రాపిడ్ ఐ మూవ్‌మెంట్) నిద్ర పోతున్నట్లు నిర్ధారించారు. విచిత్రంగా సంతానోత్పత్తి సమయంలో మాత్రం తీరంలో రోజుకు 10 గంటలు నిద్రపోతాయి.

ఆడ సీల్స్ తలపై సెన్సర్లు అమర్చి..

ఎలిఫెంట్ సీల్స్ మెదడు, హృదయ స్పందన, కదలికలు, ప్రయాణించే లోతు, నిద్రించే సంకేతాలను పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా సెన్సార్లతో కూడిన వాటర్‌ప్రూఫ్ సింథటిక్ రబ్బరు టోపీలను ఉత్తర ప్రాంతంలోని ఆడ సీల్స్ తలలపై అమర్చి.. వాటిని జీవన స్థితిని శాస్త్రవేత్తలు క్రోడీకరించారు. ఎందుకంటే ఆడ సీల్స్ మాత్రమే ఎక్కువ కాలం సముద్రంలో ప్రయాణిస్తాయి. మగ సీల్స్ ఒడ్డునే ఉంటూ ఆహారాన్ని తింటాయి. ఇవి 4,500 పౌండ్ల వరకు పెద్ద శరీర బరువును కలిగి ఉండటం.. సముద్రంలో ఎక్కువ కాలం మేత వెతకాల్సిన కారణంగా ఈ నిద్ర ప్రవర్తనను అభివృద్ధి చేసుకున్నట్టు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మగ ఎలిఫెంట్ సీల్స్‌కు ఏనుగు మాదిరిగా చిన్న తొండం ఉంటుంది. అందుకే.. వీటిని ఎలిఫెంట్ సీల్స్‌గా పిలుస్తారు.

పేపర్ లీకేజీలో మరో ఇద్దరు అరెస్ట్

కొడుకు కోసం ఏఈ పేపర్ కొనేందుకు ఢాక్యను సంప్రదించిన మైబయ్య

- రూ. 2 లక్షలకు కుదిరిన బేరం.. రూ. 1.75 లక్షలు బదిలీ
- ఢాక్య బ్యాంకు ఖాతా విశ్లేషణతో ఆధారాలు బట్టబయలు
- ఈ కేసులో 22కు చేరిన అరెస్టయిన నిందితుల సంఖ్య

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో మరో ఇద్దరు నిందితులను 'సిట్' గురువారం అరెస్ట్ చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టయిన నిందితుల సంఖ్య 22కు చేరింది. ప్రధాన నిందితులైన ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్ రెడ్డిల ద్వారా రేణుక, ఢాక్య నాయక్ దంపతులు ఏఈ పేపర్ కొనుగోలు చేసి దాన్ని కొందరు అభ్యర్థులకు విక్రయించడం తెలిసిందే. ఈ క్రమంలోనే ఢాక్య నాయక్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాలను విశ్లేషించిన 'సిట్' పోలీసులు.. అనుమానాస్పదంగా ఖాతాలో జమ అయిన రూ. 1.75 లక్షల గురించి ఆరా తీయడంతో తాజా లింక్ బయటపడింది. ఢాక్య నాయక్ ఖాతాలో ఆ డబ్బు డిపాజిట్ చేసిన కోస్గి భగవంత్‌కుమార్ గురించి ఆరా తీసిన పోలీసులు... అతడికి నిందితులతో ఉన్న సంబంధాన్ని గుర్తించారు, అనంతరం భగవంత్‌కుమార్‌కు ఏఈ పేపర్ రాసిన వారితో ఉన్న లింక్‌లను ఆరా తీశారు. ఈ క్రమంలోనే భగవంత్‌కుమార్, తమ్ముడు కోస్గి రవికుమార్ కూడా ఏఈ పరీక్ష రాసిన లింక్ బయట పడింది. వారిద్దరినీ విచారించడంతో ఏఈ పేపర్‌ను ఢాక్య నాయక్ నుంచి కొన్నట్లు అంగీకరించారు. దీంతో వారిని 'సిట్' అరెస్ట్ చేసింది.

రూ. 2 లక్షలకు బేరం..!

వికారాబాద్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేసే గండేడ్ మండలానికి చెందిన మైబయ్యతోపాటు కోస్గి భగవంత్‌కుమార్ అక్కడే పనిచేస్తున్నాడు. ఢాక్య నాయక్ వికారాబాద్ జిల్లాలోని ఉపాధి హామీ పథకం విభాగంలో పనిచేస్తుండటంతో వాళ్లందరికీ పరిచయాలు ఉన్నాయి. టీఎస్‌పీఎస్సీ పేపర్ కొనుగోలు చేశాక రేణుకా ఆమె భర్త ఢాక్య నాయక్, సోదరుడు రాజేశ్వర్‌తో కలసి నీలేశ్ నాయక్, పత్లావత్ గోపాల్ నాయక్‌లకు విక్రయించారు. అనంతరం ఢాక్య నాయక్ ప్రశాంత్‌రెడ్డి, రాజేంద్రకుమార్‌లకు విక్ర యించాడు. టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మైబ య్యతో ఢాక్య పేపర్ విషయం చర్చించి రూ. 6 లక్షలకు విక్రయించేందుకు ఒప్పందం చేసుకోగా అందులో రూ. 2 లక్షలు మైబయ్య ఇచ్చి పేపర్‌ను తన కొడుకు కోసం కొన్నాడు. అయితే ఈ డబ్బు కోసం మైబయ్య తనతో పనిచేసే భగవంత్‌కుమార్‌ను సంప్రదించాడు. ఒకేసారి అంత డబ్బు అవసరం ఏమిటని ప్రశ్నించడంతో తన కొడుకు ఏఈ పరీక్ష రాస్తున్నాడని, దాని ప్రశ్నపత్రం కొనేందుకు ఢాక్య నాయక్‌కు ఇవ్వాల్సి ఉందంటూ చెప్పాడు. దీంతో భగవంత్‌కుమార్ తన సోదరుడికి ప్రశ్నపత్రం ఇప్పించేందుకు ఢాక్య నాయక్‌ను సంప్రదించగా రూ. 2 లక్షలకు బేరం కుదిరింది. అందులో భాగంగానే రూ. 1.75 లక్షలను ఢాక్య నాయక్ ఖాతాకు బదిలీ చేశాడు. ఈ కేసులో మైబయ్య, అతని కొడుకు జనార్ధన్‌ను సైతం 'సిట్' ఇప్పటికే అరెస్ట్ చేసింది.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- తడిసిన ధాన్యం కొనాలి
- కౌలు రైతులకు న్యాయం చేయాలి
- రైతు స్వరాజ్యవేదిక, టీజేఎస్, కాంగ్రెస్ డిమాండ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): గత 45 రోజులుగా భారీ వర్షాలు, వడగళ్ల వానలతో తీవ్రంగా నష్టపోయిన రైతులందరికి నష్టపరిహారం చెల్లించాలని రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు, పలువురు రాజకీయ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాలు, పంట నష్టం, పంటల బీమా అవశ్యకతపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ జనసమితి (టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎం.కోదండరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు పెట్టుబడులు పెరిగి పంటలకు ఎకరానికి 36 వేల ఖర్చు అవుతోందని, ఈ నేపథ్యంలో పంటలు నష్టపోయినవారికి పరిహారం చెల్లించి కాపాడుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. రైతులకు రుణమాఫీతో పాటు పంటల బీమా చెల్లించాలని, తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతుల జాబితా తయారు చేయడంలో వేలాది మంది బాధితుల పేర్లు నమోదు కాలేదని అన్నారు. ముఖ్యంగా కౌలు రైతుల పేర్లకు బదులు భూ యజమానుల వివరాలే సేకరించారన్నారు. ఈ నేపథ్యంలో కౌలు రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ విస్సా కిరణ్, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు మండలి వెంకన్న, తెలంగాణ రైతు సంఘం నాయకులు సోమిడి శ్రీనివాస్, సోమశేఖర్‌రావు, ప్రొఫెసర్ మురళీమనోహర్, ప్రొఫెసర్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

పలువురు నాయకుల అరెస్టు..

అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తూ సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి సచివాలయానికి బయలుదేరిన పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేసి ముషీరాబాద్, గాంధీనగర్, చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. నాయకులు ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరెస్టు అయిన వారిలో కోదండరాం, ఆకునూరి మురళి, విస్సా కిరణ్, మరికొందరు నాయకులు ఉన్నారు.

ముగ్గురి ఉసురు తీసిన సెల్ఫీ సరదా

- సిద్దిపేట జిల్లా నెంటూరు వద్ద ఘటన
- మృతులు హైదరాబాద్ వాసులు

వర్గల్ (గజ్వేల్): సెల్ఫీ సరదాకు ముగ్గురి ప్రాణాలు బలయ్యాయి. మూడేళ్ల బాలుడు సహా ఇద్దరు యువకులు చెరువులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. గురువారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నెంటూరు వద్ద ఈ విషాదకర ఘటన జరిగింది. బేగంపేట ఎస్‌ఐ అరుణ్‌కుమార్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని యాకుత్‌పురాకు చెందిన షేక్ ఖైసర్ (28), అతని అన్నకొడుకు షేక్ ముస్తఫా (3), సమీప బంధువు, జగద్గిరిగుట్టకు చెందిన మహమ్మద్ సోహెల్ (17) గురువారం రాత్రి సిద్దిపేట (దుద్దెడ)లో జరగనున్న ఫంక్షన్‌లో పాల్గొనేందుకు తమ కుటుంబ సభ్యులతో కలసి గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లిలోని బంధువుల ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గురువారం మధ్యాహ్నం వారు వర్గల్ మండలం నెంటూరు సామల చెరువు సమీపంలోగల బంధువుల పొలం వద్దకు వెళ్లారు. ఈ సమయంలో షేక్ ఖైసర్, మమ్మద్ సోహెల్‌లు ముస్తఫాను తీసుకుని సెల్ఫీలు దిగేందుకు సమీపంలో ఉన్న సామల చెరువుకు వెళ్లారు. అక్కడ సెల్ఫీలు దిగుతుండగా ప్రమాదవశాత్తు ముస్తఫా చెరువులో ఉన్న గుంతలో జారిపడ్డాడు. ఇది గమనించి అతడిని రక్షించే ప్రయత్నంలో సోహెల్, అతడిని కాపాడేందుకు ఖైసర్‌లు వరుసగా గుంతలో దిగారు. ఈత రాకపోవటంతో బాలుడితో పాటు వారిద్దరూ నీళ్లలో మునిగి చనిపోయారు. సమీపంలో వున్న కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని మొదట బాలుడి బయటకు తీసి చికిత్స కోసం తరలించగా అప్పటికే అతను మృతిచెందాడు. పోలీసులు స్థానికుల సహాయంతో చెరువు నుంచి ఖైసర్, సోహెల్ మృతదేహాలను వెలికి తీశారు. మృతుడు ఖైసర్‌కు భార్య, మూడు నెలల కూతురు ఉన్నారు. అప్పటిదాకా ఆడుతూ కళ్ల ముందు సంతోషంగా గడిపిన ముస్తఫా నీట మునిగి విగత జీవిగా మారటంతో తండ్రి జుబేర్, తల్లి అయేశాలు కన్నీరు మున్నీరై బోరుమని విలపించారు. కాగా మహ్మద్ సోహెల్ ఇటీవలే టెన్త్ పరీక్షలు రాశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



షేక్ ఖైసర్, మమ్మద్ సోహెల్, షేక్ ముస్తఫా మృతదేహాలు

> వాస్తవంగా, మేమే మానవుణ్ణి సృష్టించాము. అతని మనస్సులో మెదిలే ఊహలను కూడా మేము ఎరుగుతాము. మేము అతనికి అతని కంఠ రక్తనాళం కంటే కూడా అతి దగ్గరగా ఉన్నాము.
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 5 మే 2023

నిజమెంత? నిజాయతీ ఎంత?

'నిజజీవిత ఘటనల నుంచి ప్రేరణ పొంది తీశామ'ని అంటున్న సినిమాలో నిజాలు ఉంటాయనే ఆశిస్తాం. నిజాయతీగా ఉంటుందనే భావిస్తాం. కానీ అవే లోపిస్తే? శుక్రవారం విడుదలవుతున్న హిందీ చిత్రం 'ది కేరళ స్టోరీ' సరిగ్గా అవే ఆరోపణల్ని ఎదుర్కొంటోంది. విషయం మద్రాస్, కేరళ హైకోర్టుల మొదలు సర్వోన్నత న్యాయస్థానం దాకా వెళ్ళాల్సి వచ్చింది. దాదాపు 10 కట్స్‌తో సెన్సార్ బోర్డ్ పచ్చజెండా ఊపిన ఈ వివాదాస్పద చిత్ర ప్రదర్శనను ఆపడానికి కానీ, కనీసం 'కల్పిత పాత్రలతో అల్లుకున్న కథ' అని టైటిల్స్‌లో వేయడానికి కానీ గడచిన మూడు రోజుల్లో 3 సార్లు సుప్రీమ్ ససేమిరా అనడంతో, బంతి ఇప్పుడు థియేటర్లలోని ప్రజాకోర్టులో పడింది. 'సంఘ పరివార్ వారి అసత్యాల కర్మాగారంలో తాజా ఉత్పత్తి' అంటూ కేరళ సీఎం ఈ చిత్రాన్ని గర్హించారు. కేరళలో జెండా పాతాలని ప్రయత్నిస్తున్న బీజేపీ మినహా ప్రతిపక్షాలూ ఆ మాటే అంటున్నాయి. బహిష్కరణ పిలుపుతో సహా కేరళ సర్కార్ వివిధ మార్గాలు అన్వేషిస్తున్న నేపథ్యంలో కల్పనను నిజమని నమ్మించే ప్రమాదభరిత సృజనాత్మక స్వేచ్ఛ విపరిణామాలపై కచ్చితంగా చర్చ అవసరం.

ఏప్రిల్ ద్వితీయార్ధంలో ట్రైలర్ వచ్చినప్పటి నుంచి 'కేరళ స్టోరీ' వివాదాలకు కేంద్రబిందువైంది. తీవ్రవాద ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ప్రభావం పతాకస్థాయిలో ఉన్నవేళ కేరళ నుంచి 'దాదాపు 32 వేల మంది స్త్రీలు' కనిపించకుండాపోయారనీ, వారి తెర వెనుక కథల్ని 'బహిర్గతం' చేసే యత్నమే మత మార్పిడి అంశం ఇతివృత్తమైన ఈ చిత్రమనీ దర్శక, నిర్మాతల మాట. 'లవ్ జిహాద్'లో భాగంగా 32 వేల మందినీ ముస్లిమ్‌లుగా మార్చి, అత్యధికులను ఐఎస్ పాలనలోని సిరియాకు తీసుకువెళ్ళారనేది ఈ చిత్ర వాదన. సాక్ష్యాధారాలు లేని ఈ కాకుల లెక్కతో కేరళను తీవ్రవాదానికి పట్టుగొమ్మ అన్నట్టు చిత్రించడంపై సహజంగానే అభ్యంతరాలు వెల్లువెత్తాయి. ఇది ముస్లిమ్‌లపట్ల ద్వేషం పెంచే దుర్మార్గ ప్రయత్నమనే వాదన బలపడింది. 'లవ్ జిహాద్' లేదని నాటి కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రే పార్లమెంట్‌లో చెప్పినప్పుడు కేరళపై బురద చల్లేలా ఇలాంటి సినిమా ఎలా తీస్తారన్నది ప్రశ్న.

కేరళలో హిందువుల జనాభా దాదాపు 55 శాతమైతే, ఆ తర్వాత అత్యధికంగా ముస్లిమ్‌లు 26 శాతం పైగా, క్రైస్తవులు 18 శాతం ఉన్నట్టు లెక్క. దశాబ్దాల క్రితమే సంపూర్ణ అక్షరాస్యత సాధించి, నిత్యం చైతన్యం నిండిన ఆలోచనాపరుల సమాజంగా దేశంలో మలయాళ సీమది ప్రత్యేక స్థానం. సాహిత్యం, సంస్కృతి, కళలు, సినిమాలు సహా అనేక రంగాల్లో దిక్సూచిగా నిలిచిన ఘనత దానిది. మానవాభివృద్ధి సూచిలో ముందుంది. అలాంటి రాష్ట్రాన్ని పచ్చి తీవ్రవాదానికి పట్టుగొమ్మ అన్నట్టు చిత్రించడం కించపరచడమే. విమర్శలు పెరిగి, వివాదం ముదిరేసరికి సినీరూపకర్తలు సైతం సర్దుకోవాల్సి వచ్చింది. కేరళలోని '32 వేల మంది మహిళల కథల ఆధారంగా తీశా'మంటూ మొదట ట్రైలర్‌లో తొడకొట్టినవాళ్ళు చివరకు మే మొదట్లో దాన్ని ముగ్గురంటే 'ముగ్గురు యువతులు'గా మార్చేశారు. కడుపులో ఏదో పెట్టుకొని కథ రాసుకున్నప్పటికీ కోట్లు పెట్టి సినిమా తీసినవారికి మూడుకూ, 32 వేలకూ తేడా తెలీదా? ఒకటీ అరా ఘటనలు జరిగాయేమో తెలీదు కానీ దాన్ని పట్టుకొని కేరళలోని ప్రబలమైన ధోరణి అన్నట్టు చిత్రించాలనుకోవడం ఏ రకంగా సమర్థనీయం? మొత్తం కేరళ కథ అన్నట్టు సినిమాకు పేరు పెట్టి, బురద జల్లడం ఎవరిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ?

భావప్రకటన స్వేచ్ఛను కాపాడాల్సిందే. సృజనాత్మక స్వాతంత్ర్యం కావాల్సిందే! కానీ ట్రైలర్‌ను బట్టి చూస్తే... వాస్తవాలను చూపుతున్నామనే పేరుతో, నిజాలను వక్రీకరించి సంచలనాత్మకం చేయడం 'కేరళ స్టోరీ'లోని అతి పెద్ద ఇబ్బంది. ఇలా లెక్కలతో సహా అన్నిటినీ అతి చేస్తున్నప్పుడు ఈ చిత్ర రూపకల్పన వెనుక ఉన్న ఉద్దేశాలపై, సాధించదలచిన లక్ష్యాలపై తప్పక అనుమానాలు తలెత్తుతాయి. పైగా, కేరళలో ముస్లిమ్, ముస్లిమేతరులుగా ప్రజలను రెండు ప్రత్యర్థి వర్గాలుగా ఏకీకృతం చేసే ప్రయత్నాలు పెరుగుతున్న సమయంలో సినిమా రావడం సందేహాల్ని పెంచుతోంది. ఆ మధ్య 'పద్మావత్' నుంచి ఇటీవలి 'పఠాన్' దాకా సినిమాలపై నిషేధపు డిమాండ్లు, కోర్టు కేసులు చూశాం. అప్పుడైనా ఇప్పుడైనా నిషేధాలు పరిష్కారం కావు. కానీ సెంటిమెంట్లను దెబ్బతీసి, ఉద్రిక్తత సృష్టించి, విద్వేషాన్ని పెంచే ప్రయత్నాలను తప్పక అడ్డుకోవాల్సిందే. శాంతిభద్రతలకు భంగం వాటిల్లినప్పుడు భావప్రకటన స్వేచ్ఛపై నిర్బంధాలు తప్పవని ఆర్టికల్ 19 (2) అనుమతిస్తోంది. శాంతిభద్రతలేమో కానీ, మనోఫలకంపై నిలిచి ఆలోచనల్లోకి ఇంకిపోయే భావోద్వేగాల ప్రభావమే అర్ధసత్య చిత్రాలతో అతి ప్రమాదం. బ్రిటిష్ వారి వద్దే మన్యం వీరుడు అల్లూరి పోలీసుగా పని చేశాడని భావితరాలు నమ్మేలా సినిమా తీసి, ఆస్కార్ల దాకా వెళ్ళిన మన కథలే అందుకు సాక్ష్యం. 'కేరళ స్టోరీ'కీ కనీసం కల్పితపాత్రల కథనమని పేర్కొనమంటూ పిటిషనర్లు కోరిందీ అందుకే.

సెకనుకు 24 ఫ్రేమ్‌ల చొప్పున తెరపై చూపే సత్యం సినిమా అనే సూక్తికి 'కేరళ స్టోరీ' లాంటివి నిలబడతాయా అన్నది సందేహమే! సామాన్య ప్రజలు తాము తెరపై చూసేదంతా సత్యమని భ్రమ పడితే, సమాజంలో పెచ్చరిల్లే విద్వేషాగ్నికి బాధ్యులెవరు? 'కశ్మీర్ ఫైల్స్'తో దేశం ఆ చివరన మొదలైన అర్ధసత్య, అసత్య ప్రచార చిత్రాలు ఇప్పుడు 'కేరళ స్టోరీ'తో ఈ చివరన కన్యాకుమారికి విస్తరించడం దేనికి సంకేతం? భావప్రకటన స్వేచ్ఛ ఓకే కానీ, నిజాన్ని వక్రీకరించి చూపడంపై గళమెత్తాల్సిందే! ఈ రొచ్చుకు అడ్డుకట్ట ఏమిటో కనిపెట్టాల్సిందే! రాజకీయ ప్రయోజనాల కోసం సినిమాను వాడుకొనేందుకు పెరుగుతున్న ప్రాపగాండా ప్రయత్నాలను గమనించాలి. గత తొమ్మిదేళ్ళలో ఎన్నికల ముందే ఇలాంటి చిత్రాలు ఎందుకు, ఎవరి ప్రాపుతో వస్తున్నాయో ఆలోచించాలి.

ఇన్‌బాక్స్

చిరస్మరణీయ కృషి



రవ్వా శ్రీహరి

ద్రావిడ విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి, నిఘంటు కర్త, వ్యాకరణ వేత్త ఆచార్య డాక్టర్ రవ్వా శ్రీహరి (79) ఇటీవల తుదిశ్వాస విడిచారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెలువర్తి గ్రామంలో సామాన్య చేనేత కుటుంబంలో 1943 సెప్టెంబర్ 12న ఆయన జన్మించారు. తెలుగు, సంస్కృత భాషల వికాసానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం.


యాదగిరి లక్ష్మీ నరసింహ సంస్కృత విద్యాపీఠంలోనూ, హైదరాబాదులోని సంస్కృత కళాశాలలోనూ వ్యాకరణం చదివారు. వ్యాకరణంలో ఉత్తీర్ణుడైన శ్రీహరి... వివేకవర్ధిని కళాశాలలో తెలుగు పండితుడిగా చేరి, ఎంఏ తెలుగు, ఎంఏ సంస్కృతం చదివి 1967లో ఆంధ్ర సారస్వత పరిషత్తులో లెక్చరర్‌గా చేరి సంస్కృతం, తెలుగు రెండింటినీ బోధించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆచార్య బిరుదురాజు రామరాజు సలహాతో 'భాస్కర రామాయణం' మీద పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. కేంద్రీయ విశ్వవిద్యాల యంలో 17 సంవత్సరాలు బోధనా, పరిశోధనలు నిర్వహించిన శ్రీహరి 2002లో కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా నియమితులయ్యారు. 2011లో తిరు మల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగానికి ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

రవ్వా శ్రీహరి 50 వరకు తెలుగు గ్రంథాలను, సంస్కృతంలో 25 పుస్తకాలను రచించారు. పరిశోధన, సృజన, విమర్శ, అనువాదం, నిఘంటు నిర్మాణం రంగాలపై తనదైన ముద్రవేశారు. 'శ్రీహరి నిఘంటువు', 'అన్నమయ్య పద కోశం', 'సంకేత పదకోశం', 'వ్యాకరణ పద కోశం' ప్రముఖంగా చెప్పుకోదగ్గవి. విమర్శనాత్మక గ్రంథాలలో 'ఉభయ భారతి', 'అన్నమయ్య సూక్తివైభవం', 'అన్నమయ్య భాష వైభవం', 'తెలుగు అలబ్ధ వాఙ్మయం', 'సాహితీ నీరాజనం', 'తెలుగు కవులసంస్కృత అనుకరణలు', 'వాడుకలో తెలుగు అప్రయోగాలు' ఉన్నాయి. ఆయన మృతి ఇటు తెలుగు, అటు సంస్కృత సారస్వతాలకు తీరని లోటు.

– డా॥ టేకుమళ్ళ వెంకటప్పయ్య, అన్నమయ్య సంకీర్తనల వ్యాఖ్యాత, అన్నమాచార్య ప్రాజెక్టు

సోషల్ మీడియా


సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



స్వేచ్ఛ ఉందనా?

పత్రికా స్వేచ్ఛలో బంగ్లాదేశ్ (163) కన్నా అఫ్గానిస్తాన్ (152) మెరుగ్గా ఉందన్న వాస్తవం చాలు, ఈ 'ర్యాంకింగులు' ఎంత తప్పులతడకో చెప్పడానికి. దీనిపై కాబూల్ వెళ్లి ఏ జర్నలిస్టునైనా అడగండి, ఎవరైనా దొరికితే. మహిళా జర్నలిస్టును అడిగితే ఇంకా మంచిది, ఇంకా ఎవరైనా ఉండివుంటే!

– షా అలీ ఫర్హాద్, బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు అడ్వకేట్



అదా సంస్కారం?

చార్‌ధామ్ కావచ్చు, గుడి లేదా ఆఖరికి ఇంట్లో పూజ కావచ్చు– తొంభై శాతం మంది యువతీ యువకులు ఒక ధార్మిక ప్రదేశానికి ఫొటోల కోసమో, రీల్స్ చేయడానికో వెళ్తున్నారు. గౌరవం లేదు, విలువలు లేవు, సంస్కారం లేదు. దేవుడి విగ్రహం వైపు వీపుతిప్పి వాళ్లు సెల్ఫీలు తీసుకుంటుంటారు!

– అమితాభ్ చౌధరి, ఇంజినీర్

గంతలు కట్టేందుకే కట్టుకథలు



- పాత చింతకాయ పచ్చడినే తాజాగా వడ్డించేందుకు చంద్రబాబు ఆపసోపాలు
- 2017 ఎమ్మెల్సీ ఎన్నికలపై వక్రీకరణ
- వివేకాను అవినాశ్ ఓడిస్తే...మరి బీటెక్ రవి ఆయనపై ఎందుకు ఆరోపణలు చేస్తారు?
- కుట్రతో వివేకాను ఓడించిన బీటెక్ రవి.. సునీత దంపతులకు ఎలా సన్నిహితుడయ్యారు?
- 2019 కడప ఎంపీ టికెట్‌పై పచ్చ మీడియా అవాస్తవ కథనాలు
- చివరివరకూ అవినాశ్ గెలుపుకోసం ప్రచారం చేసిన వివేకా
- గూగుల్ టేక్ అవుట్ పేరిట ఫేక్ సమాచారం
- ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలకు అది పూర్తి విరుద్ధం
- వివేకా హత్య కేసులో సీబీఐ విస్మరిస్తున్న కీలక అంశాలెన్నో

సాక్షి, అమరావతి: ప్రతి ఊర్లో ఒకడుంటాడు. ఊరికి ఏదైనా మంచి జరిగితే భరించలేడు. వాస్తవాలను పక్కదారి పట్టించేందుకు ఏదో ఒక దుష్ప్రచారాన్ని తెరపైకి తెస్తాడు. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఒకరున్నారు! అధికారంలో ఉండగా రాష్ట్రానికి ఆయన చేసిందేమీ లేదు. ప్రతిపక్షంలో ఉన్నా బుద్ధి వంకరే. తనకు అలవాటైన రీతిలో కుట్రలకు పదును పెడతారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు తన భజన మీడియా ద్వారా కట్టు కథలను ప్రచారంలోకి తెస్తారు. ఒకపక్క భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం.. విశాఖలో డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరగడం.. మరోపక్క అమరావతిలో భూ దందాలపై సిట్ దర్యాప్తు కొనసాగించేందుకు అత్యున్నత న్యాయస్థానం అనుమతించడంతో బెంబేలెత్తి టీడీపీ కరపత్రిక ఈనాడు, ఇతర ఎల్లో మీడియాను రంగంలోకి దించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ అఫిడవిట్ పేరిట ఎంపీ అవినాశ్‌రెడ్డిపై నిరాధార అభియోగాలతో బురద చల్లేందుకు బరి తెగించారు. అయితే సీబీఐ అభియోగాలు అవాస్తవమని స్పష్టం చేస్తూ ఎంపీ అవినాశ్‌రెడ్డి పూర్తి ఆధారాలతో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ వెలుగులోకి రావడంతో ప్రతిపక్ష నేత చంద్రబాబు కుట్ర బెడిసికొట్టింది. దురుద్దేశపూరితంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు, ఆయన బృందం ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు యత్నించడం విస్మయపరుస్తోంది. ఎంపీ అవినాశ్‌రెడ్డి విచారణకు సహకరించడం లేదంటూ అభియోగం మోపడం విడ్డూరంగా ఉంది. ఎందుకంటే ఏప్రిల్ 19 నుంచి 25వరకు అవినాశ్‌రెడ్డి సీబీఐ విచారణకు హాజరై ఏకంగా 210 ప్రశ్నలకు సవివరంగా సమాధానాలు చెప్పారు. ఆ ప్రశ్నలన్నీ గతంలో విచారణలో అడిగినవే అయినా సరే ఓపిగ్గా సమాధానాలిచ్చారు. న్యాయస్థానం ఆదేశాలతో అదంతా ఆడియో, వీడియో రికార్డింగ్ కూడా చేశారు. అయినా సరే ఎంపీ అవినాశ్ దర్యాప్తునకు సహకరించడం లేదనడం వెనుక దురుద్దేశాలున్నట్లు స్పష్టమవుతోంది. కౌంటర్ అఫిడవిట్‌లో ఎంపీ అవినాశ్‌రెడ్డి పేర్కొన్న ఇతర అంశాలు సంక్షిప్తంగా ఇవీ...

ఎమ్మెల్సీ ఎన్నికలపై అదే దుష్ప్రచారం

ఎన్నిసార్లు వాస్తవాలను వెల్లడించినా పదే పదే ఒక అబద్ధాన్ని ప్రచారంలోకి తేవడం ఎల్లో మీడియా కుట్రలకు నిదర్శనంగా నిలుస్తోంది. 2017 ఎమ్మెల్సీ ఎన్నికల అంశంపై వక్రీకరణే అందుకు తార్కాణం. 2017లో కడప జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఉన్న వైఎస్ వివేకాను చంద్రబాబు కుట్రపూరితంగా ఓడించారు. వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన ఆధిక్యత ఉన్నప్పటికీ టీడీపీ అభ్యర్థిగా బీటెక్ రవిని బరిలో నిలిపారు. నాటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డి ద్వారా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేసి అడ్డదారిలో బీటెక్ రవిని గెలిపించారు. అయితే వైఎస్ వివేకాకు వ్యతిరేకంగా వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి పని చేసి బీటెక్ రవిని గెలిపించారంటూ సీబీఐ అవాస్తవాలను తన అఫిడవిట్‌లో పదే పదే ప్రస్తావిస్తోంది. వైఎస్ వివేకానందరెడ్డి అందుకే ఎంపీ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి నివాసానికి వెళ్లి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారంటూ నిరాధార అభియోగాలు మోపుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 800 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో ఎవరినైనా సీబీఐ విచారించిందా ? జిల్లాలో అన్ని ఓట్లను కలిపి ఎన్నికల కమిషన్ లెక్కిస్తుంది. మరి పులివెందులలో ఓట్లు క్రాస్ అయ్యాయని సీబీఐ ఎలా చెబుతుంది? ఇక డి.శివశంకర్‌రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ ఇప్పించాలని అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి భావించారని సీబీఐ ఎలా నిర్ధారణకు వచ్చింది? వాటిలో ఒక్కదానికైనా సీబీఐ సమాధానం చెబుతుందా అంటే అదీ లేదు. కేవలం దురుద్దేశాలతో అభియోగాలు మోపడం మినహా నిరూపించే ఉద్దేశమే సీబీఐకి లేదన్నది స్పష్టమవుతోంది.

బీటెక్ రవితో జట్టుకట్టిన సునీత దంపతులు

ఈనాడు సహా ఇతర ఎల్లో సిండికేట్ కట్టు కథలకు తాజా పరిణామాలే నిదర్శనం. వైఎస్ వివేకాను కుట్రపూరితంగా ఓడించిన బీటెక్ రవి ఇప్పుడు ఆయన కుమార్తె సునీత, అల్లుడు– చిన్న బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిలకు అత్యంత సన్నిహితుడు. ఆ విషయాన్ని బీటెక్ రవి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో స్వయంగా వెల్లడించాడు. అవినాశ్‌రెడ్డికి వ్యతిరేకంగా ఆ ఇంటర్వ్యూలో ఆయన ఆరోపణలు కూడా చేశారు.



ఏది నిజం?

అంటే 2017ఎన్నికల్లో వివేకాకు వ్యతిరేకంగా అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పని చేయలేదని స్పష్టమవుతోంది. సీఐబీ అభియోగాలు నిజమైతే బీటెక్ రవి, అవినాశ్‌రెడ్డి మధ్య ఫోన్ సంభాషణలు ఉండాలి కదా? బీటెక్ రవితో సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి రోజూ ఎందుకు ఫోన్లో మాట్లాడుతున్నారనేది సందేహాస్పదంగా మారుతోంది.

అవినాశ్‌కు ఖరారైన ఎంపీ టిక్కెట్‌పై సీబీఐ వక్రీకరణ

కడప ఎంపీ టికెట్‌పై లేని సందిగ్ధతను ఉన్నట్లుగా చిత్రీకరిస్తూ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై పచ్చ మీడియా దుష్ప్రచారం చేస్తోంది. దర్యాప్తును ప్రభావితం చేసేందుకు కుట్ర పన్నుతోంది. 2019 ఎన్నికల్లో కడప ఎంపీ టికెట్‌ను సిట్టింగ్ ఎంపీగా ఉన్న వైఎస్ అవినాశ్‌రెడ్డికే పార్టీ ఖరారు చేసింది. ఆయన్ని గెలిపించే బాధ్యతను వైఎస్ వివేకానందరెడ్డికి అప్పగిస్తూ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించింది. అప్పటికే అవినాశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగిస్తున్నారు. ఆయన గెలుపు కోసం వివేకా కూడా విస్తృతంగా పర్యటించారు. హత్యకు గురికావడానికి కొన్ని గంటల ముందు కూడా అంటే 2019 మార్చి 14న అవినాశ్‌రెడ్డికి అనుకూలంగా వివేకానందరెడ్డి మైదుకూరు నియోజకవర్గంలో దాదాపు 300 ఇళ్లకు వెళ్లి ఇంటింటి ప్రచారం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, సిట్టింగ్ ఎంపీ అవినాశ్‌రెడ్డిలను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ విషయాన్ని రఘురామిరెడ్డిని అడిగినా, వివేకా ఎన్నికల ప్రచారం నిర్వహించిన 300 ఇళ్లలోని వారిని అడిగినా వాస్తవం తెలుస్తుంది. సీబీఐ ఆ ప్రయత్నమే చేయకపోవడం విడ్డూరంగా ఉంది. అంతేకాదు అవినాశ్‌రెడ్డి విజయం కోసం తన తండ్రి చివరి వరకూ శ్రమించారని వివేకా కుమార్తె సునీత స్వయంగా 2019 మార్చి 27న మీడియాతో చెప్పారు. ఎంపీ టికెట్ కోసం వివేకానందరెడ్డిని హత్య చేశారన్న సీబీఐ అభియోగాలు పూర్తి నిరాధారం.

ప్రత్యక్ష సాక్షులా... గూగుల్ టేక్ అవుటా?

వాస్తవాలను వక్రీకరించడంలో పచ్చముఠా మరో అడుగు ముందుకేసింది. సాంకేతికంగా కచ్చితంగానీ, న్యాయపరంగా ఏమాత్రం చెల్లుబాటుగాని గూగుల్ టేక్ అవుట్ పేరిట దుష్ప్రచారం చేస్తోంది. 2019 మార్చి 15 తెల్లవారుజామున వైఎస్ అవినాశ్‌రెడ్డి ఇంట్లోనే గడిపి మూడో వ్యక్తి ఫోన్ కోసం ఎదురు చూశారని అఫిడవిట్‌లో పేర్కొనడం విస్మయపరుస్తోంది. వివేకా హత్య విషయాన్ని ఆయన పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్‌రెడ్డే ఎంపీ అవినాశ్‌కు తెలిపారు. శివప్రకాశ్‌రెడ్డి మూడో వ్యక్తి అవుతారా? మరి ఆయన్ని ఆ కోణంలో సీబీఐ ఎందుకు విచారించడం లేదు? గూగుల్ టేక్ అవుట్ పేరిట సీబీఐ చెబుతున్న అంశాలు, ప్రత్యక్ష సాక్షులు సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలానికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. సీబీఐ దర్యాప్తు తీరు అహేతుకంగా ఉందనేందుకు ఇదో నిదర్శనం. సీబీఐ ఏమాత్రం శాస్త్రీయంగానీ గూగుల్ టేక్ అవుట్‌ను పరిగణలోకి తీసుకుంటుందా? ఐదుగురు సాక్షులు చెప్పిన విషయాలను పరిగణలోకి తీసుకుంటుందా? ఒకవేళ గూగుల్ టేక్ అవుట్‌నే పరిగణలోకి తీసుకుంటే ఐదుగురు సాక్షులే కాదు.. మొత్తం 248 మంది సాక్షులు చెప్పింది తప్పని అంగీకరిస్తుందా?

అభ్యర్థులు ముందే ఖరారు..

వివేకా హత్య తరువాతే అవినాశ్‌రెడ్డికి టికెట్‌ను ఖరారు చేస్తూ పార్టీ ప్రకటించిందన్న సీబీఐ అభియోగం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 25 ఎంపీ, 175 ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాను 2019 మార్చి 17న పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఏ పార్టీ కూడా ఒక్క రోజులో 200 మంది అభ్యర్థులను ఖరారు చేయదు. ముందే ఖరారు చేసిన అభ్యర్థుల పేర్లను నామినేషన్ల ముందు ప్రకటించడం అన్నది కేవలం ఒక తంతే. అదే విధంగా 200 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అప్పటికే ఖరారు చేశారు. వారంతా అప్పటికే ప్రచారంలో సైతం నిమగ్నమయ్యారు.

ప్రత్యక్ష సాక్షుల కథనానికి భిన్నంగా సీబీఐ అఫిడవిట్

సీబీఐ ఉద్దేశపూర్వకంగానే వాస్తవాలను విస్మరించి నిరాధార అభియోగాలను మోపుతున్నట్లు మరోసారి నిరూపితమైంది. 2019 మార్చి 15 తెల్లవారుజామున ఎన్నికల ప్రచారం కోసం జమ్మలమడుగు వెళుతున్నట్లు ఎంపీ అవినాశ్‌రెడ్డి చెప్పింది తప్పని సీబీఐ తన కౌంటర్‌లో పేర్కొనడం విస్మయపరుస్తోంది. ఆ రోజు అవినాశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం కోసం జమ్మలమడుగు వెళుతుండగా వివేకా చనిపోయిన విషయాన్ని ఆయన పెద్ద బావమరిది శివప్రకాశ్‌రెడ్డి ఫోన్ చేసి చెప్పారు. దీంతో అవినాశ్‌రెడ్డి వెనక్కి మళ్లి వివేకా నివాసానికి చేరుకున్నారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులు చల్లా మల్లి, బండి కేశవ్, బండి రాఘవరెడ్డి, వెంకట రమణారెడ్డి, ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి ఇదే విషయాన్ని సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో స్పష్టంగా చెప్పారు. వారి సాక్ష్యాన్ని సీబీఐ రికార్డు కూడా చేసింది. కానీ ఇప్పుడు ప్లేటు ఫిరాయించి అసలు ఆ రోజు ఉదయం అవినాశ్‌రెడ్డి జమ్మలమడుగు వెళ్లడం లేదని సీబీఐ కౌంటర్‌లో పేర్కొనడం విడ్డూరంగా ఉంది. ప్రత్యక్ష సాక్షులు చెప్పిన విషయాలను పరిగణలోకి తీసుకోకుండా సీబీఐ కట్టు కథలు అల్లుతున్నట్లు స్పష్టమవుతోంది.

చిత్ర పటాలంటూ.. విచిత్ర వాదన

ఫోన్ కాల్స్ మ్యాప్ అంటూ మరో ఊహాజనితమైన కథను తెరపైకి తెచ్చారు. వివేకా హత్యకు ముందు రోజు అంటే 2019 మార్చి 14 సాయంత్రం 6 గంటల నుంచి మార్చి 15 ఉదయం 8 గంటల వరకు ఫోన్ సంభాషణల క్రమాన్ని వివరించే మ్యాప్ అంటూ అఫిడవిట్‌లో పేర్కొంది. ఒక ఊహాజనిత కుట్ర చిత్రాన్ని గీశారు. సీబీఐ ఉద్దేశపూర్వకంగా విస్మరించిన అంశం ఏమిటంటే ఎర్ర గంగిరెడ్డి, డి.శివశంకర్‌రెడ్డి ఒకే పార్టీలో ఉన్నారు. ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతున్న రోజుల్లో ఒకరితో ఒకరు ఫోన్లో మాట్లాడుకోవడం కుట్రలో భాగంగా చూపించడం హాస్యాస్పదంగా ఉంది. ఇక తండ్రీ కుమారులైన వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి పరస్పరం మాట్లాడుకోవడం కూడా కుట్రలో భాగంగా చూపించడం అంటే సీబీఐ ఈ కేసు దర్యాప్తులో ఎంతగా దారి తప్పిందో స్పష్టమవుతోంది. నిందితుడిగా సీబీఐ పేర్కొన్న ఉదయ్‌కుమార్‌రెడ్డికి రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేదు. యూసీఐఎల్ ఉద్యోగి అయిన ఆయన అవినాశ్‌రెడ్డిని సాధారణంగా తరచూ కలిసేవారు. వారిద్దరి మధ్య ఫోన్ కాల్స్ కూడా కుట్రలో భాగంగా చూపించడం విడ్డూరంగా ఉంది. దర్యాప్తు ఇంత డొల్లతనంగా ఉండటం సీబీఐ ప్రమాణాలను దిగజారుస్తోంది.

వారి ఫోన్ కాల్స్ మ్యాప్ ఎందుకు గీయలేదు?

ఈ కేసులో నిందితులైన ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరి వివేకానందరెడ్డికి అత్యంత సన్నిహితులు. ఆ నలుగురు ఆయన అల్లుడు–చిన్న బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్‌రెడ్డిలకు అత్యంత సన్నిహితులన్నది పులివెందులలో అందరికీ తెలిసిన విషయమే. మరి ఎర్ర గంగిరెడ్డి– నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, ఎర్ర గంగిరెడ్డి– నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి మధ్య ఫోన్ కాల్స్‌పై సీబీఐ ఎందుకు దృష్టి సారించలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. వారి మధ్య కాల్స్‌ను అనుమానాస్పదంగా పరిగణించాలని న్యాయ నిపుణులు సూచిస్తున్నా సీబీఐ ఎందుకు పట్టించుకోవడం లేదు? వారి మధ్య ఫోన్ కాల్స్ మ్యాప్‌ల ఆధారంగా ఎందుకు దర్యాప్తు చేయడం లేదో సీబీఐనే సమాధానం చెప్పాలి. వివేకా హత్య తరువాత సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి జైలులో ఉన్న ఎర్ర గంగిరెడ్డిని కలుసుకున్నారు. ఆ ములాఖత్ కచ్చితంగా అనుమానాస్పదమే. ఇక వివేకాను నరికి చంపానని అంగీకరించిన దస్తగిరి బెయిల్ పిటీషన్‌ను సునీత వ్యతిరేకించకపోవడం కీలకంగా మారింది. డి.శివశంకర్‌రెడ్డి బెయిల్‌ను మాత్రం ఆమె వ్యతిరేకించడం వెనుక దురుద్దేశం ఉందని స్పష్టమవుతోంది. దస్తగిరి బెయిల్‌ను వ్యతిరేకించని సునీత డి.శివశంకర్‌రెడ్డి బెయిల్‌ను మాత్రం ఎందుకు వ్యతిరేకిస్తున్నారని న్యాయస్థానం ప్రశ్నించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆధారాలు ధ్వంసం చేయించింది వివేకా బావమరుదులే

వివేకా హత్యా స్థలంలో ఆధారాలను ధ్వంసం చేయించారంటూ అవినాశ్‌రెడ్డిపై సీబీఐ మోపిన అభియోగాలు హాస్యాస్పదంగా ఉన్నాయి. వివేకా చనిపోయారని, వెంటనే అక్కడికి వెళ్లమని ఆయన పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్‌రెడ్డి చెబితేనే అవినాశ్ వెళ్లారు. అప్పటికే వివేకా రాసిన లేఖ గురించి శివప్రకాశ్‌రెడ్డికి తెలిసినా అవినాశ్‌కు చెప్పకుండా గోప్యంగా ఉంచారు. ఇక వివేకా నివాసంలో రక్తపు మరకలు, ఫ్లోర్‌ను శుభ్రం చేయించింది ఎర్ర గంగిరెడ్డి. శివప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతోనే ఆయన అలా చేశారు. ఎందుకంటే వారిద్దరూ అత్యంత సన్నిహితులు కాబట్టి. అంటే ఆధారాలను ధ్వంసం చేయించింది శివప్రకాశ్‌రెడ్డి అని స్పష్టమవుతూనే ఉంది. మరి ఈ విషయంలో శివప్రకాశ్‌రెడ్డిని సీబీఐ ఎందుకు విచారించడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. అవినాశ్ ఆధారాలను ధ్వంసం చేయించినట్లు ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడైందా? అలాంటిది ఏదీ లేనప్పుడు సీబీఐ ఏ ఆధారాలతో ఈ అభియోగాలను మోపుతోంది? వివేకా లేఖ, సెల్‌ఫోన్‌ను గోప్యంగా ఉంచిన ఆయన అల్లుడు, పెద్ద బావమరిదిని విచారించాలని అవినాశ్ ఎప్పటి నుంచో కోరుతునే ఉన్నారు. ఇన్నాళ్లకు మేలుకున్న సీబీఐ నర్రెడ్డి రాజశేఖరరెడ్డిని కొద్ది రోజుల క్రితం ఎట్టకేలకు విచారించింది.



పది రోజుల క్రితమే సీబీఐ అఫిడవిట్ దాఖలు..

భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, విశాఖలో అదాని డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా శంకుస్థాపన చేశారు. రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేసే అద్భుతమైన ఆ రెండు ప్రాజెక్టులపై సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది. మరోవైపు చంద్రబాబు సర్కారు భూదోపిడీ, ఇతర అవినీతి బాగోతాలపై సిట్ దర్యాప్తు కొనసాగించవచ్చని సుప్రీం కోర్టు బుధవారమే తీర్పునిచ్చింది. ఆ రెండు అంశాలు గురువారం మీడియాలో ప్రముఖంగా ప్రచురితమవుతాయని తెలుసు. అందుకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు టీడీపీ, పచ్చ మీడియా వేసిన పన్నాగమే సీబీఐ కౌంటర్ అఫిడవిట్‌ను హఠాత్తుగా తెరపైకి తేవడం. వాస్తవానికి సీబీఐ పది రోజుల క్రితమే న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేసింది. అదే రోజు అది అన్ని పత్రికలకు అందుబాటులోకి వచ్చింది. సీబీఐ కౌంటర్‌కు సమాధానంగా ఎంపీ అవినాశ్‌రెడ్డి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. ఆ రెండింటి ఆధారంగా న్యాయస్థానంలో వాద ప్రతివాదనలు జరిగాయి. అనంతరం న్యాయస్థానం విచారణను వాయిదా వేసింది. అవన్నీ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. తాజాగా భోగాపురం విమానాశ్రయం, అదాని డేటా సెంటర్‌కు శంకుస్థాపన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు ఆదేశాలతో ఈనాడు, ఎల్లో మీడియా సీబీఐ అఫిడవిట్ అంశాన్ని ప్రముఖంగా ప్రచారంలోకి తెచ్చాయి.

గ్రహం అనుగ్రహం: శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: పౌర్ణమి రా.10.44 వరకు, తదుపరి బ.పాడ్యమి, నక్షత్రం: స్వాతి రా.9.32 వరకు, తదుపరి విశాఖ, వర్జ్యం: రా.3.09 నుండి 4.43 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.08 నుండి 8.59 వరకు తదుపరి ప.12.22 నుండి 1.12 వరకు, అమృతఘడియలు: ప.12.30 నుండి 1.45 వరకు, బుద్ధపౌర్ణమి; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.36, సూర్యాస్తమయం: 6.16.

క్లుప్తంగా...

కూలిన సైనిక హెలికాప్టర్.. సిరిసిల్ల జవాన్ మృతి


అనిల్ (ఫైల్)

బోయినపల్లి (చొప్పదండి): జమ్మూకశ్మీర్‌లో నదిలో సైనిక హెలికాప్టర్ కూలిన ప్రమాదంలో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్కాపూర్‌కు చెందిన ఆర్మీ జవాన్ పబ్బాల అనిల్ (29) దుర్మరణం చెందారు. పదకొండేళ్ల క్రితం ఆర్మీలో చేరిన అనిల్.. సీఎఫ్ఎన్‌లో ఏవీఎన్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అనిల్ తన అత్తగారి గ్రామమైన కోరెంలో జరిగిన బీరప్ప పట్నాల నిమిత్తం 20 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చారు. చిన్న కుమారుడు అరయ్ పుట్టినరోజును ఘనంగా నిర్వహించి పది రోజుల క్రితమే విధులకు వెళ్లారు. ఇంతలోనే మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. అనిల్‌కు భార్య సౌజన్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

టికెట్ నాదే.. గెలుపు నాదే


రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: 'రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ టికెట్ నాదే.. గెలుపు నాదే' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రస్తుతం ఎన్నికల సీజన్ కావడంతో సోషల్ మీడియా, యూట్యూబ్ చానళ్లలో స్టేషన్‌ఘన్‌పూర్ టికెట్‌పై పలు వార్తలు వైరల్ అవుతున్నాయని, వాటిని చూసి పార్టీ శ్రేణులెవ్వరూ ఆందోళన చెందవద్దని అన్నారు. ఆరు నూరైనా ఘన్‌పూర్ బీఆర్ఎస్ టికెట్ తనదేనని, గెలుపు కూడా తథ్యమని పేర్కొన్నారు.
నోరు జారిన ఎమ్మెల్యే: ఘన్‌పూర్ బీఆర్ఎస్ టికెట్ తనదేనని ధీమాగా చెపుతున్న సమయంలో ఎమ్మెల్యే రాజయ్య నోరు జారారు. తనకు వెయ్యి ఏనుగుల బలం ఉందని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో అధికార కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన తొలి దళితుడినని తెలిపారు. అయితే తనతో పాటు రాజీనామా చేసిన జూపల్లి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇప్పుడు బీఆర్ఎస్‌లో లేరంటూ వ్యాఖ్యానించారు. వెంటనే తేరుకుని పోచారం కాదని సోమారపు సత్యనారాయణ అని చెప్పారు

అయేషా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు

సాక్షి, హైదరాబాద్: బీ ఫార్మసీ విద్యార్థిని అయేషా మీరా హత్య కేసు దర్యాప్తులో సీబీఐ వేగం పెంచింది. గురువారం హైదరాబాద్ జాయింట్ సీపీ శ్రీనివాసులును సీబీఐ అధికారులు ప్రశ్నించారు. హత్య జరిగిన సమయంలో నందిగామ డీఎస్పీ గా శ్రీనివాసులు పనిచేశారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ జాయింట్ సీపీగా పనిచేస్తున్నారు. కాగా, అయేషా హత్య జరిగిన తర్వాత పోలీసుల దర్యాప్తు, అనుమానితుల అరెస్టు తదితర అంశాలపై గురువారం 8 గంటలపాటు సీబీఐ అధికారులు శ్రీనివాసులును ప్రశ్నించినట్టు తెలిసింది. తెనాలికి చెందిన అయేషా మీరా కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలో బీఫార్మసీ చదువుతున్న సమయంలో ఓ హాస్టల్‌లో ఉంటూ 2007లో హత్యకు గురైంది. సీబీఐ అధికారులు తమ దర్యాప్తులో భాగంగా హత్య సమయంలో ఉన్న హాస్టల్ వార్డెన్ పద్మను సైతం బుధవారం ప్రశ్నించారు. పదిహేనేళ్లుగా దర్యాప్తు సాగుతున్నా హంతకులెవరో స్పష్టత రాలేదు.





క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం ప్రారంభం

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల పరిధి కరుణాపురంలో నిర్మించిన క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరాన్ని గురువారం పాల్సన్‌రాజ్, జయప్రకాశ్ ప్రారంభించారు. అనంతరం మందిరంలో వేలాది మంది భక్తులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశాక అన్నదానం నిర్వహించారు. ఆసియాలో అతిపెద్ద ప్రార్థన మందిరం ఇదేనని నిర్వాహకులు తెలిపారు. – ధర్మసాగర్

అన్ని మతాల అభ్యున్నతికి కృషి


వేడుకల్లో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల అభ్యున్నతికి కృషి చేస్తుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఎల్బీ స్టేడియంలో గురువారం క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జాతీయ ప్రార్థన దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని మతాలకు చెందిన ప్రధాన పండుగలను రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. అంతకు ముందు వివిధ జిల్లాలకు చెందిన పాస్టర్లు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మిక సహకార ఆర్థిక సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా పల్లె రవికుమార్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గీత కార్మిక సహకార ఆర్థిక సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా పల్లె రవికుమార్‌గౌడ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో రెండేళ్ల పాటు ఉంటారు. నల్లగొండ జిల్లా చండూరు మండలం బోడంగిపర్తికి చెందిన పల్లె రవికుమార్ భార్య కల్యాణి ప్రస్తుతం చండూరు ఎంపీపీగా ఉన్నారు. రవికుమార్ విద్యార్థి నేతగా మునుగోడు నియోజకవర్గంలో ఫ్లోరైడ్ సమస్య, నిరుద్యోగం, ఉద్యోగాల కల్పనతో పాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారు. 1996లో పాత్రికేయునిగా తన వృత్తిని ప్రారంభించి వివిధ పత్రికల్లో పనిచేశారు. 2006లో చండూరు వేదికగా బహిరంగసభలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవశ్యకతను బలంగా వినిపించే ప్రయత్నం చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రంలోని పాత్రికేయులను ఏకతాటిపై తీసుకురావటంలో క్రియాశీలక పాత్రను పోషించారు. ప్రస్తుతం 'తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్' వ్యవస్థాపక అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. 'పీపుల్స్ ఫౌండేషన్' పేరుతో ఆయన సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

నెలాఖరుకు 3,206 పల్లె దవాఖానాలు

- డాక్టర్ ఫోన్ నంబర్ బోర్డులపై ప్రదర్శించాలి
- పది రోజుల్లో నిమ్స్ కొత్త భవనానికి టెండర్ ప్రక్రియ
- వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆసుపత్రుల పనులు వేగవంతం చేయాలి
- అందరికీ కంటి వెలుగు పరీక్షలు... అద్దాలు త్వరగా పంపిణీ చేయాలని సూచన
- అధికారులతో వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ఈ నెలాఖరు వరకు 3,206 పల్లె దవాఖానాలు పూర్తి స్థాయిలో పనిచేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. అందుకు అవసరం అయిన 321 ఖాళీలు భర్తీ చేయాలన్నారు. ఆయా దవాఖానాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు పనిచేయాలని, పల్లె దవాఖానాల వేళలు అందరికీ తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యుల ఫోన్ నంబర్ కూడా ప్రజలకు అందుబాటులో ఉండేలా బోర్డుపై ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. అక్కడ అందిస్తున్న సేవలు, చేస్తున్న పరీక్షలు, వెల్‌నెస్ యాక్టివిటీ తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గురువారం సచివాలయంలో వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆసుపత్రులు, నిమ్స్ కొత్త బిల్డింగ్, డయాలసిస్ సేవలు, బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు, కంటివెలుగు తదితర అంశాలపై మంత్రి హరీశ్‌రావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. వరంగల్ హెల్త్ సిటీ పనులు దసరా నాటికి పూర్తిచేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని చెప్పారు. గ్రేటర్ పరిధితోపాటు, నగర శివారు ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు మరింత చేరువచేసే లక్ష్యంతో ఏర్పాటుచేస్తున్న సనత్‌నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. నిమ్స్ విస్తరణ పనుల్లో భాగంగా నిర్మించే 2 వేల పడకల భవనానికి పది రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న డయాలసిస్ కేంద్రాలు స్థానిక ఎమ్మెల్యేలతో ప్రారంభించి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తేవాలని సూచించారు. మూడు క్లస్టర్స్‌గా విభజించి గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రులకు పరిశీలన బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు.

జూన్ ఆఖరుకు 500 బస్తీ దవాఖానాలు...

హైదరాబాద్ పరిధిలో 350, హైదరాబాద్ బయట పట్టణాల్లో 150 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు హరీశ్‌రావు చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 363 బస్తీ దవాఖానాలు సేవలు అందిస్తున్నాయని, మరో 57 ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. వాటిని వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. తుది దశలో ఉన్న మిగతా దవాఖానాల పనులు వేగవంతం చేయాలని, జూన్ నెలాఖరు వరకు 500 దవాఖానాలు పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమం విజవంతంగా కొనసాగుతున్నదని, 67 పనిదినాల్లో 1.31 కోట్ల మందికి కంటి పరీక్షలు పూర్తి చేశామని తెలిపారు. 27 శాతం మందికి అద్దాలు అవసరం కాగా, సగటున ఒక్కో బృందం రోజుకు 120 మందికి స్క్రీనింగ్ నిర్వహించినట్లు చెప్పారు. 19.64 లక్షల మందికి రీడింగ్ గ్లాసెస్ ఇవ్వగా, 15.30 లక్షల మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అవసరం అని గుర్తించారన్నారు. ఇందులో 12 లక్షల మందికి పంపిణీ చేసినట్లు చెప్పారు. రాష్ట్ర సగటు (95%) కంటే తక్కువగా అద్దాలు పంపిణీ చేసిన జిల్లాల్లో ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ పంపిణీ త్వరగా పూర్తి చేయాలన్నారు. హైదరాబాదులో పంపిణీ కోసం ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ఈ సమీక్షలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, ఆర్అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డి, డీఎంఈ రమేశ్‌రెడ్డి, డీహెచ్ శ్రీనివాసరావు, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఈ రాజేందర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్యశాఖలో 1,331 కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖలోని ఏడు విభాగాలకు చెందిన మొత్తం 1,331 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రెగ్యులరైజ్ అయినవారిలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ విభాగంలో 68 మంది మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు(ఫిమేల్), వైద్య విద్యాసంచాలకుల విభాగంలో 72, ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో 156 ఫార్మసిస్టులు, 177 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, ఇద్దరు పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్లు, 837 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు(మేల్), ఆయుష్ విభాగానికి చెందిన 19 మంది మెడికల్ ఆఫీసర్లు ఉన్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం కేసీఆర్ నిర్ణయం వల్ల ఒక్క వైద్య, ఆరోగ్య శాఖలోనే మొత్తం 1,331 మంది ఉద్యోగులు క్రమబద్ధీకరణ పొందారన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి ఎంతోమంది జీవితాల్లో కేసీఆర్ వెలుగులు నింపారని ఆయా యూనియన్ల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



● కదం తొక్కిన రైతన్న

అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం రైతులు కదం తొక్కారు. రైతులు ట్రాక్టర్లతో పెద్దసంఖ్యలో రైతు భరోసా ర్యాలీ నిర్వహిస్తూ కలెక్టరేట్‌కు ముట్టడికి తరలివెళ్లారు. మధ్యలోనే రైతులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కలెక్టరేట్ ముందే రైతులు బైఠాయించారు. చివరకు పదిమంది రైతులకు అనుమతి ఇవ్వడంతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కలిసిన రైతులు.. పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని వినతిపత్రం అందజేశారు. – కామారెడ్డిటౌన్



తెలంగాణ అబ్బాయి.. జపాన్ అమ్మాయి ప్రేమ వివాహానికి భద్రాచలంలోని రామయ్య సన్నిధి వేదికైంది. జపాన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఆకాశ్, అక్కడే హెచ్‌ఆర్ మేనేజర్‌గా ఉన్న జపాన్ యువతి మికేలా ప్రేమించుకున్నారు. పెద్దలకు చెప్పి పెళ్లికి ఒప్పించారు. ఆకాశ్ తండ్రి, వైద్యుడు జగన్నాథాచారి.. భద్రాద్రి రామయ్యపై తనకున్న భక్తితో కొడుకు పెళ్లిని హిందూ సంప్రదాయం ప్రకారం రామాలయంలో చేయించారు. యువతి బంధువులు జపాన్ నుంచి తెలుగు సంప్రదాయ చీర, పంచె కట్టులో వచ్చారు. – భద్రాచలంటౌన్

వెన్ను విరగని వరి!


ఆర్ఎన్ఆర్-31479 రకం వరి

▶ మొదటి పేజీ తరువాయి

ఒక్కో జిల్లాలో, ప్రాంతంలో ఒక్కోలా ఉంటాయని.. సీజన్లను ముందుకు జరపడం కన్నా ప్రత్యామ్నాయాలను అన్వేషించాలని వ్యవసాయ నిపుణులు సూచించారు. ఈ క్రమంలోనే అకాల వర్షాలను, వడగళ్లను తట్టుకుని నిలిచే వరి వంగడాల అంశం తెరపైకి వచ్చింది. ఇప్పటికే అందుబాటులో ఉన్న జేజీఎల్-24423 రకంతోపాటు.. త్వరలో అందుబాటులోకి రానున్న మరో ఏడు రకాల వంగడాల వివరాలను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు చెప్పారు.

తట్టుకుని నిలిచిన.. జేజీఎల్-24423..

వడగళ్లు, ఈదురుగాలులను తట్టుకునే వరి వంగడంగా జేజీఎల్-24423 ఇప్పటికే గుర్తింపు పొందింది. వ్యవసాయ వర్సిటీ పరిధిలోని జగిత్యాల పొలాస పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు 2019లో దీనిని విడుదల చేశారు. దీనిని 2022-23 వానాకాలం సీజన్‌లో 5-7 లక్షల ఎకరాల్లో, యాసంగిలో ఆరు లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఇటీవలి ఈదురుగాలులు, వడగళ్ల వానలకు రాష్ట్రవ్యాప్తంగా లక్షల ఎకరాల్లో వరి పడిపోయినా, గింజలు నేలరాలినా.. జేజీఎల్-24423 రకం వరి మాత్రం 90శాతం వరకు తట్టుకుని నిలిచినట్టు తెలిసింది.

ఎత్తు తక్కువ.. చలిని తట్టుకుంటుంది..

జేజీఎల్-24423 వరి వెరైటీ రకాన్ని జగిత్యాల రైస్-1 అని కూడా అంటారు. ఎంటీయూ 1010, ఎస్ఎల్ఆర్-34449 రకాలని సంకరం చేసి దీనిని అభివృద్ధి చేశారు. ఇది వానాకాలం, యాసంగి రెండు సీజన్లకూ అనుకూలమైన స్వల్పకాలిక రకం. వానాకాలంలో దీని పంట కాలం 125 రోజులు, యాసంగిలో 135-140 రోజులు ఉంటుందని వర్సిటీ తెలిపింది. యాసంగిలో మార్చిలోగానే చేతికి వస్తుంది. ఈ వరి ఎత్తు తక్కువగా, కాండం దృఢంగా ఉండటం వల్ల ఈదురుగాలులు, వడగళ్లకు పంట నేలకొరగదు. గింజ సులువుగా రాలిపోని గుణాన్ని కలిగి, బరువు అధికంగా ఉంటుంది. యాసంగిలో చలిని సమర్థవంతంగా తట్టుకోవడం వల్ల నారు ఆరోగ్యవంతంగా పెరుగుతుంది. దోమను కొంతవరకు తట్టుకొంటుంది. దమ్ము చేసిన మడిలో నేరుగా వెదజల్లే పద్ధతికి కూడా అనుకూలం. ఈ ధాన్యానికి మార్కెట్లో గ్రేడ్-ఎ కింద మద్దతు ధర లభిస్తుంది. వానాకాలంలో జూలై చివరివరకు, యాసంగిలో నవంబర్ 15 నుండి డిసెంబర్ మొదటి వారం వరకు నారు పోయొచ్చు.

దిగుబడీ ఎక్కువే..: జేజీఎల్-24423 వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేసినప్పుడు బియ్యం రికవరీ 58-61 శాతం మధ్య ఉంటుంది.. సాధారణంగా మిగతా వెరైటీలు 52-54 శాతమే బియ్యం వస్తాయి. కర్ణాటక, ఏపీ, తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఈ రకాన్ని పండిస్తున్నారు. దిగుబడి ఎకరాకు 40-45 బస్తాల (25-28 క్వింటాళ్లు) వస్తుంది.

పరిశోధన దశ వంగడాలివీ..

1) **ఆర్ఎన్ఆర్-31479:** ఇది 125 రోజుల్లో కోతకు వస్తుంది. బీపీటీ సాంబమసూరితో సమానంగా ఉండే సన్నగింజ రకం. రాజేంద్రనగర్ వర్సిటీలోనే పరిశోధన పూర్తయింది. రైతుల పొలాల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతోంది.
2) **కేపీఎస్-2874:** మిర్యాలగూడ కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో పరిశోధన పూర్తయింది. రైతుల పొలాల్లో పరిశీలన జరుగుతోంది. ఇది 125 రోజుల్లో దిగుబడి వస్తుంది. సన్నగింజ రకం. దోమను, చౌడును తట్టుకుంటుంది.
3) **ఆర్ఎన్ఆర్-28361:** రాజేంద్రనగర్ పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేశారు. ఇది దొడ్డుగింజ రకం. 130 రోజుల్లో చేతికి వస్తుంది. వానాకాలం, యాసంగి రెండు సీజన్లలో వేయొచ్చు. దోమ, చౌడును తట్టుకుంటుంది.
4) **జేజీఎల్-28639:** జగిత్యాల పరిశోధన స్థానంలో అభివృద్ధి చేశారు. ఇది దొడ్డుగింజ రకం. 125 రోజుల్లో చేతికి వస్తుంది. రెండు సీజన్లలోనూ వేయొచ్చు. దోమను, వడగళ్లను తట్టుకుంటుంది.

పై నాలుగు రకాల వరి దిగుబడి 42 నుంచి 46 బస్తాల మధ్య ఉంటుంది. క్షేత్రస్థాయిలో పొలాల్లో పరిశీలన పూర్తయి.. వచ్చే ఏడాది రైతులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ రకాలకు వానాకాలం సీజన్‌లో జూన్ చివరి నుంచి జూలై మూడో వారం వరకు నాట్లు వేసుకోవచ్చు. అక్టోబర్‌లో పంట చేతికి వస్తుంది. యాసంగి సీజన్‌కు అయితే నవంబర్ 15 తేదీ నుంచి నాట్లు వేసుకోవచ్చు. డిసెంబర్ 15నాటికి నాట్లు పూర్తి చేసుకోవాలి. మార్చి 15 నాటికి పంట చేతికి వస్తుంది. సీజన్ నెల రోజులు ముందే పూర్తయినట్టు అవుతుంది. ఈ రకాలకు పెట్టుబడి ఎకరానికి సాధారణం కంటే రూ. 2-3 వేలు తక్కువగా ఉంటుంది.

5, 6, 7) **కేఎన్ఎం-12368, కేఎన్ఎం -12510, కేఎన్ఎం-7715:** ఈ మూడు 130-135 రోజుల్లో కోతకు వస్తాయి. వానాకాలానికి మాత్రమే అనుకూలమైనవి. జూన్ తొలకరి వర్షాలతోనే వేసుకోవచ్చు. అక్టోబర్ నాటికే కోతకు వస్తాయి. వీటిపై పరిశోధన పూర్తయి 2025లో అందుబాటులోకి వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ మూడు కూడా వడగళ్లు, ఈదురుగాలులు, భారీ వర్షాలను దీటుగా తట్టుకునే రకాలని వివరించారు. పెట్టుబడి సాధారణం కంటే రూ. 2-3 వేలు తక్కువ అవుతుందని.. నేరుగా వెదజల్లే పద్ధతిలో సాగు చేయాలని పేర్కొన్నారు.

మణిపూర్‌లో భీకర హింస



ఇంఫాల్‌లో ఆందోళనకారులు నిప్పుపెట్టిన వాహనాలు

అగ్గి రాజేసిన 'గిరిజన హోదా' డిమాండ్

మైతీ, గిరిజన వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ	ఇళ్లు, దుకాణాలు, వాహనాలు దహనం	రంగంలోకి దిగిన సైన్యం, అస్సాం రైఫిల్స్ దళం	రాష్ట్రంలో కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ

ఇంఫాల్: మణిపూర్‌లో హింస ప్రజ్వరిల్లింది. తమకు షెడ్యూల్డ్ కులాల(ఎస్టీ) హోదా కల్పించాలని రాష్ట్ర జనాభాలో 53 శాతం ఉన్న మైతీ వర్గం డిమాండ్ చేయడం అగ్గి రాజేసింది. గిరిజనులు భగ్గుమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఇళ్లు, దుకాణాలు, వాహనాలకు నిప్పుపెట్టారు. ప్రార్థనా మందిరాలపై దాడి చేశారు. గిరిజనేతరులతో ఘర్షణకు దిగారు. ఈ హింసాకాండలో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి 55 పటాలాల సైన్యంతోపాటు అస్సాం రైఫిల్స్ జవాన్లను ప్రభుత్వం గురువారం రంగంలోకి దించింది. మరో 14 పటాలాల సైన్యాన్ని సిద్ధంగా ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. మైతీ వర్గం అధికంగా ఉన్న దక్షిణ ఇంఫాల్, కాక్‌చింగ్, థౌబాల్, జిరిబామ్, బిష్ణుపూర్ జిల్లాలతోపాటు గిరిజన ప్రాబల్యం కలిగిన చురాచాంద్‌పూర్, కాంగ్‌పోక్పీ, తెంగ్నౌపాల్ జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు. రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. చురాచాంద్‌పూర్, మంత్రిపుఖ్రీ, లాంఫెల్, కొయిరంగీ, సుగ్ను తదితర ప్రాంతాల్లో అస్సాం రైఫిల్స్ జవాన్లు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్‌ఏఎఫ్) సిబ్బంది మోహరించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రమంతటా పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఎప్పుడేం జరుగుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటిదాకా 9,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బాధితులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. ఘర్షణలను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం 'కనిపిస్తే కాల్చివేత' ఉత్తర్వులు జారీ చేసింది.

అక్రమ వలసల వల్లే..

మైతీలు ప్రధానంగా మణిపూర్ లోయలో నివసిస్తున్నారు. మయన్మార్, బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసల కారణంగా తాము ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని, తమకు ఎస్టీ హోదా కల్పించాలని వారు కోరుతున్నారు. వలసదారుల నుంచి గిరిజనులకు చట్టప్రకారం కొన్ని రక్షణలు ఉన్నాయి. మైతీలకు ఎస్టీ హోదాపై రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సును నాలుగు వారాల్లోగా కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని గత నెలలో మణిపూర్ హైకోర్టు సూచించింది. దీనిపై గిరిజనులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

అపార్థం వల్లే అనర్థం: సీఎం

రాష్ట్రంలో శాంతి భద్రతలకు ప్రజలంతా సహకరించాలని ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ విజ్ఞప్తి చేశారు. అమాయకులు మృతి చెందడం, ఆస్తులు ధ్వంసం కావడం బాధాకరమని పేర్కొన్నారు. కేవలం అపార్థం వల్లే ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు అన్ని చర్యలూ చేపట్టామని తెలిపారు. మణిపూర్‌లో హింసాకాండపై పొరుగు రాష్ట్రం మిజోరాం ముఖ్యమంత్రి జోరాంథాంగా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో త్వరగా శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు.

గిరిజన సంఘీభావ యాత్ర

గిరిజనేతరులైన మైతీ వర్గానికి ఎస్టీ హోదా కల్పించాలన్న డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 10 జిల్లాల్లో ఆల్ ట్రైబల్ స్టూడెంట్ యూనియన్ మణిపూర్(ఏటీఎస్‌యూఎం) ఆధ్వర్యంలో గిరిజనులు బుధవారం 'గిరిజన సంఘీభావ యాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా మైతీలకు, గిరిజనులకు నడుమ ఘర్షణ మొదలయ్యింది. రాత్రికల్లా తీవ్రస్థాయికి చేరింది. హింస చోటుచేసుకుంది. తొలుత చురాచాంద్‌పూర్ జిల్లాలో మొదలైన ఘర్షణ, హింసాకాండ క్రమంగా రాష్ట్రమంతటికీ విస్తరించింది.

యూపీలో మరో గ్యాంగ్‌స్టర్ హతం



గ్యాంగ్‌స్టర్ దుజానా మృతదేహం

మీరట్: ఉత్తరప్రదేశ్ పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. యూపీ, ఢిల్లీల్లో 18 హత్య కేసులు సహా మొత్తం 60 కేసుల్లో నిందితుడైన గ్యాంగ్‌స్టర్ అనిల్ దుజానా పోలీసుల వాంటెడ్ లిస్ట్‌లో ఉన్నాడు. గౌతమ బుద్ధనగర్ జిల్లా బాదల్‌పూర్ పరిధిలోని దుజానా గ్రామానికి చెందిన అనిల్‌పై 2002లో మొదటిసారిగా హత్యకేసు నమోదైంది. ఓ కేసులో అరెస్టయిన ఇతడు ఇటీవలే జైలు నుంచి బెయిల్‌పై వచ్చాడు. తన గ్యాంగ్‌ను మళ్లీ బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. అతడిపై తాజాగా బలవంతపు వసూళ్ల కేసు నమోదైంది. దీంతో, గురువారం మధ్యాహ్నం ఎస్‌టీఎఫ్ పోలీసులు మీరట్ సమీపంలోని ఓ గ్రామంలో అతడున్న ప్రాంతాన్ని చుట్టుముట్టి పట్టుకునేందుకు ప్రయత్నించారు. 'తప్పించుకునే క్రమంలో తన ఎస్‌యూవీతో విద్యుత్ స్తంభానికి ఢీకొట్టాడు. కాల్పులు జరుపుతూ పారిపోయేందుకు యత్నించాడు. పోలీసుల ఎదురు కాల్పుల్లో మృతి చెందాడు'అని ఎస్‌టీఎఫ్ అదనపు డీజీ అమితాబ్ యశ్ తెలిపారు. అతడి వాహనంలో ఉన్న నాలుగు పిస్తళ్లు దొరికాయన్నారు. పట్టణ స్థానిక ఎన్నికల పోలింగ్ మొదటి రోజే ఈ ఘటన చోటుచేసుకుంది. కొన్ని రోజుల క్రితమే గ్యాంగ్‌స్టర్– రాజకీయ నాయకుడు అతీక్ అహ్మద్ కొడుకు అసద్, అతడి సన్నిహితుడు ఎన్‌కౌంటర్‌ హతమయ్యారు. ఆ తర్వాత రెండు రోజులకే అతీక్, అతడి సోదరుడు అష్రఫ్‌లను ముగ్గురు వ్యక్తులు కాల్చి చంపడం తెలిసిందే.

బిహార్‌లో కుల గణనపై స్టే

డేటా ఎవరికీ ఇవ్వొద్దని నితీశ్ ప్రభుత్వానికి పట్నా హైకోర్టు ఆదేశం

పట్నా: బిహార్‌లో నితీశ్ కుమార్ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కులగణనకు ఎదురు దెబ్బ తగిలింది. వెంటనే ఈ సర్వేని నిలిపివేయాలని పట్నా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు సేకరించిన డేటాని తాము తుది ఉత్తర్వులు ఇచ్చే వరకు ఎవరితోనూ పంచుకోవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కులాల ఆధారంగా జనాభా లెక్కలు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పలు పిటిషన్లను గురువారం విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వినోద్ చంద్రన్ ఆధ్వర్యంలో హైకోర్టు బెంచ్ పిటిషన్‌దారులు డేటా సమగ్రత, భద్రతపై వెలిబుచ్చిన ఆందోళనలను రాష్ట్ర ప్రభుత్వం నివారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. జనాభా లెక్కల్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టాలే తప్ప రాష్ట్ర ప్రభుత్వాలకు ఆ అధికారం లేదంటూ పిటిషన్‌దారులు పేర్కొన్న దాన్ని కూడా ప్రస్తావించింది. కులాల గణాంకాలు ఇతరుల చేతుల్లో పడితే దాని వల్ల రాజకీయంగా ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయోనని ఆందోళన వ్యక్తం చేసిన హైకోర్టు బెంచ్ తదుపరి విచారణను జులై 7కి వాయిదా వేసింది. నితీశ్ ప్రభుత్వం జనవరి 7 నుంచి 21 వరకు తొలి విడత కులగణన నిర్వహించింది. రెండో విడత ఏప్రిల్ 15 నుంచి మే 15వరకు జరగాల్సి ఉంది. ప్రభుత్వం ఇది కులగణన కాదని, ఆర్థికంగా వెనుకబడిన వారు ఏయే కులాల్లో ఉన్నారో తెలిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయన్న ఉద్దేశంతోనే దీనిని చేపట్టినట్టుగా వాదిస్తోంది.

జెలెన్‌స్కీని అంతం చేయక తప్పదు: మెద్వెదేవ్

మాస్కో: తమ దేశ అధ్యక్ష భవన సముదాయంపై డ్రోన్ల దాడికి ముమ్మాటికీ ఉక్రెయిన్ కారణమని రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్ ఆరోపించారు. ఈ ఉగ్రవాద దాడి తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని అంతం చేయడం మినహా తమకు మరో గత్యంతరం లేదని తేల్చిచెప్పారు. ఉక్రెయిన్ వ్యవహార శైలిపై రష్యా అధినేత పుతిన్ సన్నిహితుడు, దిగువ సభ స్పీకర్ వైచెస్లావ్ వొలోదిన్ తీవ్రంగా స్పందించారు. ప్రత్యర్థి దేశం ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని అన్నారు. లేకపోతే ఉక్రెయిన్ ఉగ్రవాదులకు బుద్ధి చెప్పే ఆయుధాలను తాము ప్రయోగించాల్సి వస్తుందని ఉద్ఘాటించారు. ఇదిలా ఉండగా, క్రెమ్లిన్‌పైకి రెండు డ్రోన్లు దూసుకురావడంతో రష్యా భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ముందుజాగ్రత్త చర్యగా అధ్యక్షుడు పుతిన్‌ను ఆయన నివాసంలోని బంకర్‌లోకి తరలించినట్లు తెలుస్తోంది.

పుతిన్‌ను కోర్టు బోనెక్కిస్తాం: జెలెన్‌స్కీ

హేగ్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ అంతర్జాతీయ న్యాయస్థానం బోనుకెక్కుతారని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. యుద్ధంలో తాము గెలిచిన వెంటనే యుద్ధ నేరాల కేసులో పుతిన్‌పై విచారణ ప్రారంభించేలా చర్యలు చేపడతామన్నారు. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ఉన్న నగరమైన హేగ్‌లో జరిగిన సదస్సులో ''ఉక్రెయిన్‌కు న్యాయం జరగనిదే శాంతి నెలకొనదు'' అనే అంశంపై జెలెన్‌స్కీ మాట్లాడారు. రష్యాతో ఏడాదికి పైగా కొనసాగుతున్న పోరులో తాము విజయం సాధిస్తామని జెలెన్‌స్కీ ధీమా వ్యక్తం చేశారు. యుద్ధంలో తాము గెలిచిన వెంటనే పుతిన్ అరెస్టుకు ఐసీసీ వారెంట్లు జారీ చేస్తుందన్నారు.

రెజ్లర్ల దీక్షా శిబిరం వద్ద ఉద్రిక్తత

పోలీసుల చర్యపై వెల్లువెత్తిన విమర్శలు



గాయపడిన రెజ్లర్

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో రెజ్లర్లు ఆందోళన చేస్తున్న దీక్షా స్థలి ఒక్కసారిగా ఉద్రిక్తతకు కేంద్ర బిందువైంది. రెజ్లర్లు, వారికి మద్దతుగా వచ్చిన ఆప్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగడం, చివరకు తోపులాట, ఘర్షణకు దారితీసింది. బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. దీక్షా శిబిరం వద్ద వర్షాలతో రెజ్లర్లు వినియోగిస్తున్న పరుపులు తడిసి ముద్దయ్యాయి. వారికి సాయపడేందుకు కొన్ని చెక్క మంచాలను ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే సోమ్‌నాథ్ భారతి తన కార్యకర్తలతో తెప్పించారు. వాటిని రెజ్లర్లకు ఇచ్చేందుకు అనుమతించేది లేదని, జంతర్‌మంతర్‌ను శాశ్వత దీక్షాశిబిరంగా మార్చేందుకు అనుమతులు లేవని అక్కడే మొహరించిన పోలీసులు తెగేసి చెప్పారు. అయినా సరే కొన్ని మంచాలను రెజ్లర్లకు కార్యకర్తలు ఇవ్వడం, వాటిని రెజ్లర్లు శిబిరంలోకి తీసుకెళ్తుండటంతో పోలీసులు, ఆప్ కార్యకర్తలకు మధ్య గొడవ జరిగింది. తమకు సాయపడేందుకు వచ్చిన ఆప్ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో రెజ్లర్లు వారితో వాదనకు దిగారు. దీంతో రెజ్లర్లు, కార్యకర్తలను నిలువరించేందుకు పెద్ద ఎత్తున పోలీసులు బలప్రయోగం చేశారు. ఇరువర్గాల వాదనలు చివరకు తోపులాటలు, ఘర్షణకు దారితీశాయి. ఈ ఘటనలో రాహుల్ యాదవ్, దుష్యంత్ ఫొగాట్‌సహా పలువురు రెజ్లర్లకు గాయాలయ్యాయి.



రోదిస్తున్న సంగీతా ఫొగాట్, వినేశ్ ఫొగాట్

వినేశ్ ఫొగాట్ కంటతడి

నన్ను తిట్టారు. నేలకు పడేశారు. పురుష పోలీసులు తమతో అనుచితంగా ప్రవర్తించారు. ఒక్క మహిళా పోలీసు అయినా ఉన్నారా ఇక్కడ?. మమ్మల్ని చంపేద్దామనుకుంటున్నారా? చంపేయండి. ఇలాంటి రోజు కోసమేనా మేం దేశం కోసం పతకాలు సాధించింది? అంటూ ప్రముఖ మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ కన్నీరు పెట్టుకున్నారు. తాము సాధించిన పతకాలు, కేంద్రం ఇచ్చిన అవార్డులు, పద్మశ్రీ అన్నీ వెనక్కి ఇస్తామని రెజ్లర్లు హెచ్చరించారు.

విపక్షాల తీవ్ర ఆగ్రహం

రెజ్లర్లపై పోలీసుల దాడి దారుణమని విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. 'ఆటగాళ్లపై పోలీసుల దాడి సిగ్గు చేటు. సమాఖ్య చీఫ్ శరణ్‌ను ఆ పదవి నుంచి మోదీ తొలగించాలి' అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. 'కోర్టు పర్యవేక్షణలో ఘటనపై దర్యాప్తు జరగాలి. కనీసం ఘటనాస్థలికి వెళ్లి మోదీ రెజ్లర్లకు సంఘీభావం ప్రకటించాలి' అని కాంగ్రెస్ డిమాండ్‌చేసింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఢిల్లీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు తదితర నేతలూ పోలీసుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు.



6న జరిగే పట్టాభిషేకంలో బ్రిటన్ రాజు చార్లెస్ ధరించే కిరీటం అచ్చం ఈ డిజైన్‌లో ఉంటుంది. దీనిని లండన్‌లో ఏర్పాటు చేశారు.

ఎన్సీపీ అధినేత ఎవరవుతారో?

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) తదుపరి జాతీయ అధ్యక్షుడు ఎవరన్నది శుక్రవారం తేలిపోనుంది. పార్టీ అధినేతగా తన వారసుడిని ఎంపిక చేసేందుకు శరద్ పవార్ ఒక కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ శుక్రవారం సమావేశం కానుందని ఎన్సీపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. దక్షిణ ముంబైలోని పార్టీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు భేటీ జరుగుతుందని వెల్లడించారు. శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే, సోదరుడి కుమారుడు అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్‌బల్ తదితరులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. 1999లో ఏర్పాటైన ఎన్సీపీ అధ్యక్ష బాధ్యతల నుంచి తాను తప్పుకుంటున్నట్లు శరద్ పవార్ మంగళవారం హఠాత్తుగా ప్రకటించి, అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. తదుపరి అధినేతగా పవార్ కుటుంబం నుంచే ఎవరో ఒకరు ఎంపికవుతారని ప్రచారం సాగుతోంది. సుప్రియా సూలే లేదా అజిత్ పవార్ ఎన్సీపీ అధినేతగా పగ్గాలు చేపట్టే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఎన్సీపీ భవిష్యత్తు కోసమే తాను అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నానని శరద్ పవార్ గురువారం ప్రకటించారు.

581 మంది అభ్యర్థులపై నేరారోపణలు

కర్ణాటక ఎన్నికల్లో అభ్యర్థుల నేరచరితపై ఏడీఆర్ నివేదిక

సాక్షి బెంగళూరు: కర్ణాటక రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో నేరారోపణలు ఎదుర్కొంటున్న నేతలకూ ప్రధాన పార్టీలు టికెట్లిచ్చిమరీ ఎన్నికల బరిలో నిలిపాయి. ఈసారి పోటీ చేసే అభ్యర్థుల్లో 581 మంది (22 శాతం) నేరారోపణలు ఎదుర్కొంటున్న వారు ఉండటం తాజా పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ 581 మంది నేతల్లో 404 మందిపై తీవ్రమైన నేరారోపణలు నమోదై ఉన్నాయి. ఈసారి శాసనసభ ఎన్నికల్లో నామినేషన్ దాఖలుచేసిన 2,613 మందిలో 2,586 మంది అభ్యర్థుల నామినేషన్లను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) అనే సంస్థ పరిశీలించి సంబంధిత గణాంకాలను విడుదలచేసింది. నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు.. ➤ బీజేపీ తరఫున 224 మంది నామినేషన్లు వేయగా అందులో 96 మందిపై కేసులున్నాయి. మొత్తం 223 మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లో 122 మందిపై కేసులున్నాయి. మొత్తం 208 మంది జేడీఎస్ అభ్యర్థుల్లో 70 మందిపై, 208 ఆప్ అభ్యర్థుల్లో 48 మందిపై, 9 మంది ఎన్సీపీ అభ్యర్థుల్లో ఇద్దరిపై, ముగ్గురు సీపీఐ అభ్యర్థుల్లో ఒకరిపై, 901 స్వతంత్ర అభ్యర్థుల్లో 119 మందిపై కేసులున్నాయి. ➤ గతంలో పోలిస్తే బీజేపీ, జేడీఎస్‌లు ఎక్కువ మంది నేరచరితులకు టికెట్లు ఇచ్చాయి. 2018లో బీజేపీ అభ్యర్థుల్లో 37 శాతం మందిపై కేసులుంటే ఈసారి 43 శాతం మందిపై కేసులున్నాయి. జేడీఎస్‌లోనూ ఈ శాతం 21 నుంచి ఏకంగా 34 శాతానికి పెరగడం ఆందోళనకరం. కాంగ్రెస్ అభ్యర్థుల్లో 2018 ఏడాదిలోనూ, ఇప్పుడూ 55 శాతం మంది నేరచరితులున్నారు. ➤ 111 నియోజకవర్గాల్లో ముగ్గురు కంటే ఎక్కువ మంది అభ్యర్థులు వివిధ రకాల క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు.

కుబేరులూ ఉన్నారు..

➤ బీజేపీ నుంచి 216 మంది, కాంగ్రెస్ నుంచి 215 మంది, జేడీఎస్ నుంచి 170, ఆప్ నుంచి 197 మంది అభ్యర్థులు కోట్లకు పడగలెత్తారని వారి నామినేషన్ల పత్రాల ద్వారా తెలుస్తోంది. స్వతంత్ర అభ్యర్థుల్లో 215 మంది కోటీశ్వరులు ఉండటం విశేషం. కోటీశ్వరులైన అభ్యర్థులను మొత్తంగా పరిశీలిస్తే ప్రతి అభ్యర్థి సరాసరి ఆస్తి విలువ రూ. 12 కోట్లు.

కర్ణాటక 'సెంట్రల్' ఎవరివైపు..!

అయిదుగురు సీఎంలను ఇచ్చిన ప్రాంతంగా ఘనత • బీజేపీ కంచుకోటలో కాంగ్రెస్ పాగా వెయ్యగలదా?



సాక్షి,బెంగళూరు: సెంట్రల్ కర్ణాటకలో గత కొన్ని దశాబ్దాలుగా బీజేపీయే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది. లింగాయత్‌ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో బీజేపీ హవా నడుస్తూ వస్తోంది. బీజేపీతో విభేదాలతో ఆ పార్టీ దిగ్గజ నాయకుడు యడియూరప్ప కర్ణాటక జనతా పార్టీ పేరుతో వేరు కుంపటి పెట్టి ఎన్నికల బరిలో దిగిన 2013లో మినహాయిస్తే మిగిలిన ఎన్నికల్లో బీజేపీదే పై చేయి. దావణగెరె, శివమొగ్గ, చిత్రదుర్గ, తుమకూరు జిల్లాలతో కూడిన ఈ ప్రాంతంలో లింగాయత్‌లతో పాటు ఎస్సీ, ఎస్టీ జనాభా ఎక్కువే. మొత్తం 32 స్థానాల్లో 8 సీట్లు ఎస్సీ, ఎస్టీకి రిజర్వ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఈ సారి లింగా యత్‌లతో పాటు ఎస్సీ, ఎస్టీ ఓట్లు తమకేనని అందుకే ఈ సారి ఈ ప్రాంతంలో తమ పార్టీ దూసుకు పోతుందన్న అంచనాలతో ఉంది. మలేనాడు, మధ్య కర్ణాటక జిల్లాల నుంచి రాష్ట్రానికి ఇప్పటికి ఐదు మంది ముఖ్యమంత్రులు వచ్చారు. దీంతో కర్ణాటక లోని ఈ ప్రాంతంపై ఆయా రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. అయిదుగురు మాజీ ముఖ్యమంత్రుల్లో కడిదాళ్ మంజప్ప, ఎస్.బంగారప్ప, జేహెచ్ పటేల్, బీఎస్ యడియూరప్ప వంటి నేతలు అవిభజిత శివమొగ్గ జిల్లాకు చెందిన వారు. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న ఈ ప్రాంతంపై పట్టుకు బీజేపీ,కాంగ్రెస్ శ్రమిస్తున్నాయి. కేవలం తుముకూరు జిల్లాలో మాత్రమే పట్టు ఉన్న జేడీ(ఎస్) ఈ సారి అన్ని జిల్లాలకు విస్తరించడానికి వ్యూహాలు పన్నుతోంది.

అవకాశాలను అందిపుచ్చుకున్న బీజేపీ..


గతంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతం కాల క్రమేణ బీజేపీ వశం అయింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో కాంగ్రెస్, బీజేపీకి మధ్య హోరాహోరీ పోరు నడుస్తోంది. 2004 నుంచి హిందూ ఓట్లను క్రోడీకరించడంలో బీజేపీ సఫలీకృతమైంది. అప్పటి నుంచి నెమ్మదిగా పుంజుకుంటూ మధ్య కర్ణాటకలో తిరుగులేని శక్తిగా ఎదిగింది. బీజేపీకి కీలక ఓటు బ్యాంకుగా ఉన్న లింగాయత్‌లు శివమొగ్గ, దావణగెరె జిల్లాల్లో అధిక సంఖ్యలో ఉండడం అధికార పార్టీకి కలసి వచ్చింది.

సీట్లను పెంచుకునే వ్యూహంలో కాంగ్రెస్

స్థానికంగా ఉన్న సమస్యల్ని ఎత్తి చూపుతూ కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా ప్రచారంలో మలుచుకుంటోంది. ఎక్కడిక్కడే హామీలు గుప్పిస్తూ ఈ సారి మధ్య కర్ణాటకలో అత్యధిక స్థానాలను దక్కించుకోవాలని ప్రయత్నిస్తోంది. గత ఏడాది కాంగ్రెస్ సీనియర్ నేత సిద్దరామయ్య 75వ పుట్టిన రోజు వేడుకల్ని దావణగెరెలో భారీగా నిర్వహించి ఎన్నికల సమరశంఖాన్ని పూరించింది. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా సెంట్రల్ కర్ణాటకలో అత్యధికంగా ర్యాలీలు నిర్వహిస్తూ వస్తున్నారు. జేడీ(ఎస్) తుమకూరు ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి పంచరత్న యాత్రని వినియోగించుకున్నారు. మొత్తమ్మీద సెంట్రల్ ఓటరు ఎవరిని కరుణిస్తారో వేచి చూడాలి.

స్థానిక అంశాలపై బీజేపీ దృష్టి

లింగాయత్ ఓట్లతో పాటుగా స్థానిక సమస్యల పరిష్కారంపై బీజేపీ దృష్టి సారించింది. శివమొగ్గ జిల్లాలో బగర్‌హుకుం భూ స్వాధీనం, శరావతి ప్రాజెక్టు పునరావాసం, విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ కర్మాగారం మూసివేత వంటి సమస్యలు బీజేపీకి తలనొప్పిగా మారాయి. చిక్కమగళూరు జిల్లాలో వర్షాల వల్ల కాఫీ సాగుదారులు తీవ్రంగా నష్టపోయారు. భద్రా ఎత్తిపోతల ప్రాజెక్టు చిత్రదుర్గ జిల్లాలో ఎన్నికల్లో కీలకాంశంగా మారింది. కేంద్రం ఈ ప్రాజెక్టు కోసం బడ్జెట్‌లో రూ. 5,300 కోట్లు ప్యాకేజీ ప్రకటించింది. ఈ అంశం బీజేపీకి అనుకూ లంగా మారింది. ఇక ధరాభారం, రాష్ట్ర ప్రభుత్వ అవినీతి కూడా ఎన్నికల్లో ప్రభావం చూపనుంది. ఎస్సీ వర్గీకరణపై బీజేపీ ఇంకా ఎటూ తేల్చకపోవడంతో ఈ వర్గం వారు అధికార పార్టీపై గుర్రుగా ఉన్నారు.



సరిహద్దు సమస్యల పరిష్కారానికే పెద్ద పీట

చైనా విదేశాంగ మంత్రి కిన్‌తో జైశంకర్ భేటీ

గోవా: తూర్పు లద్దాఖ్ సరిహద్దుల్లో శాంతి స్థాపన లక్ష్యంగా సరిహద్దు సమస్యల్ని పరిష్కరించుకోవాలని చైనా విదేశాంగ మంత్రి కిన్ గాంగ్‌కు భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి సరిహద్దు సమస్యల్ని పరిష్కరించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. గురువారం జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) విదేశాంగ మంత్రుల మండలి సమావేశంలో పాల్గొనడానికి గోవాకి వచ్చిన కిన్ గాంగ్‌తో బెనాలిమ్ బీచ్ రిసార్ట్‌లో జై శంకర్ సమావేశమయ్యారు. సరిహద్దు సమస్యతో పాటు ఎస్సీఓ, జీ-20, బ్రిక్స్‌కు సంబంధించిన అంశాలపై ఇరుదేశాల మంత్రులు చర్చించారు. మరోవైపు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌తో జైశంకర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భారత్ రష్యా ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చించారు. ఎస్సీఓలో పాల్గొనేందుకు పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ గురువారం గోవాకు చేరుకున్నారు.

దేశవ్యాప్తంగా 100 'ఫుడ్ స్ట్రీట్'లు

సాక్షి, న్యూఢిల్లీ: చిరుతిండిని అమితంగా ఇష్టపడే ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా 100 'ఫుడ్ స్ట్రీట్'లకు ఆర్థికసాయం చేస్తామని కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు సంబంధిత ఫుడ్‌స్ట్రీట్ ప్రాజెక్టు కార్యాచరణపై కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో కేంద్ర ఆరోగ్య శాఖ, భారత ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) అధికారులు పాల్గొన్నారు. మొదటగా పైలట్ ప్రాజెక్ట్ కింద దేశవ్యాప్తంగా 100 చోట్ల ఫుడ్‌స్ట్రీట్‌లను అక్కడి వ్యాపార సంస్థలు/వ్యాపారులతో కలిసి ప్రారంభిస్తారు. ఈ 100 ఫుడ్ స్ట్రీట్స్‌లో ఆంధ్ర ప్రదేశ్‌లో నాలుగు, తెలంగాణలో నాలుగు ఏర్పాటుకానున్నాయి. ఒక్కో ఫుడ్‌స్ట్రీట్‌కు రూ.1 కోటి ఆర్థిక సాయం అందిస్తారు. ఈ ఫుడ్‌స్ట్రీట్‌లలో ఆహారం ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతోపాటు ఆయా వ్యాపారులు సొంత బ్రాండింగ్ చేసుకోవాలి.

పాక్‌లో కాల్పుల్లో 8 మంది టీచర్లు మృతి

పెషావర్: పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో గురువారం జరిగిన రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో 8 మంది ఉపాధ్యాయులు చనిపోయారు. అప్పర్ కుర్రమ్ జిల్లా పరాచినార్‌లోని ప్రభుత్వం పాఠశాల ఉపాధ్యాయుడు మహ్మద్ షరీఫ్‌ను గుర్తు తెలియని సాయుధుడు కాల్చి చంపాడు. ఆయన సున్నీ మెంగల్ తెగకు చెందిన వాడు. దీంతో మెంగల్ వర్గీయులు ఆగ్రహంతో ప్రభుత్వ తెరి మెంగల్ హైస్కూల్‌లోకి చొరబడి ప్రత్యర్థి తోరి షియా తెగకు చెందిన ఏడుగురు ఉపాధ్యాయులను చంపేశారు. ఈ ఘటన స్థానిక తెగల మధ్య ఉద్రిక్తతలు రాజేసే అవకాశముందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది.

'బజరంగ్‌దళ్ నిషేధం' హామీపై నిరసనలు

బెంగళూరు: అధికారంలోకి వస్తే వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్‌లపై నిషేధం విధిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీపై కర్ణాటకలో నిరసనలు వెల్లువెత్తాయి. బెంగళూరు, చిక్కబళ్లాపుర, శ్రీరంగపట్న, మాండ్య, చిక్కమగళూరు తదితర ప్రాంతాల్లో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు హనుమాన్ చాలీసా పఠించారు. ఆలయాల్లో హనుమాన్ చాలీసా పఠిస్తూ కాంగ్రెస్‌పై నిరసన వ్యక్తం చేశారు. ప్రజలంతా పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి హనుమాన్ చాలీసా పారాయణం చేయాలంటూ పిలుపునిచ్చారు. శ్రీరంగపట్నలో కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రతులను దహనం చేశారు. వాటిని కాళ్లతో తొక్కారు.

37 వేల కిలోమీటర్ల రైల్వే లైన్ల విద్యుదీకరణ

న్యూఢిల్లీ: గడిచిన 9 ఏళ్లలో దేశవ్యాప్తంగా ఉన్న 37,011 కిలోమీటర్ల రైల్వే లైన్ విద్యుదీకరణ పూర్తి చేసినట్లు రైల్వే శాఖ తెలిపింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2014 వరకు కేవలం 21,413 కిలోమీటర్ల మేర విద్యుదీకరణ జరిగిందని పేర్కొంది. దీంతో, మొత్తం 58,424 కిలోమీటర్ల మేర విద్యుదీకరణ జరిగిందని వివరించింది.

అవినీతి బీజేపీని ఓడించాలి: ప్రియాంక

సాక్షి, బళ్లారి: 'కర్ణాటక ఎన్నికలు మహాభారత యుద్ధం వంటివి. కౌరవులు, పాండవుల మధ్య యుద్ధం జరుగుతోంది. అవినీతి పరులు, రాష్ట్రాన్ని లూటీ చేసిన బీజేపీకి ఓటు వేస్తారా? అవినీతి రహిత పాలన అందించే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తారా? మీరు తేల్చుకోవాల్సిన విషయం'అని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ పేర్కొన్నారు. ఆమె గురువారం కర్ణాటకలోని కనకగిరిలో ప్రచారసభలో మాట్లాడారు. యుద్ధంలోనైనా, ఎన్నికల్లోనైనా లక్ష్యం తప్పితే ఓడిపోతామన్నారు. లక్ష్యం తప్పితే మళ్లీ అవినీతి ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు. అప్పటి ఇందిరాగాంధీ పాలనను ప్రజలు ఇప్పటికీ తలుచుకుంటున్నారంటే కారణం.. ఆమె దేశాన్ని ఎంతో అభివృద్ధి చేయడంతో పాటు, పేదల కన్నీరు తుడిచినందుకేనన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక లక్షన్నర కోట్ల రూపాయలను లూటీ జరిగిందని, ఆ డబ్బుతో 30 లక్షల పేదల కుటుంబాలకు ఇళ్లు కట్టించవచ్చునని, 100 ఆస్పత్రులను నిర్మించవచ్చునని ఆమె పేర్కొన్నారు. ఇంత భారీగా దోపిడీ చేసిన ప్రభుత్వానికి ఓటు వేస్తారా? అని ప్రశ్నించారు.

స్టేడియంలో సన్ రైజర్స్ జట్టు సభ్యులు



న్యూస్‌రీల్

బల్కంపేట ఎల్లమ్మకు బంగారు కిరీటం చేయిస్తాం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



అమీర్‌పేట: భక్తుల కోర్కెలు తీర్చే బల్కంపేట ఎల్లమ్మకు బంగారు కిరీటం చేయించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. చిరు వ్యాపారుల కోసం నూతనంగా నిర్మించిన షాపులను గురువారం దాతలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. అమ్మవారికి భక్తులు మొక్కుల రూపంలో సమర్పించిన బంగారం, వెండిని అమ్మవారి కోసం వినియోగిస్తున్నామని, 2 కిలోల 200 గ్రాముల బంగారంతో అమ్మవారికి కిరీటం, పాదాలు, చేతులు తదితర ఆభరణాలు చేయిస్తామని తెలిపారు. ఆలయ ప్రధాన ద్వారం తలుపులకు వెండి తాపడం చేయిస్తామన్నారు. దాతల సహకారంతో రూ.32 లక్షలతో 34 షాపులు నిర్మించి ఎలాంటి అద్దె లేకుండా చిరు వ్యాపారులకు కేటాయించినట్లు వివరించారు. ప్రసాదాల తయారీ కోసం మోడరన్ కిచెన్‌ను నిర్మిస్తామని చెప్పారు. మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ సరళ, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, దేవాదాయ శాఖ రీజినల్ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, ఈఓ అన్నపూర్ణ, చైర్మన్ సాయిబాబాగౌడ్ పాల్గొన్నారు.

మీడియాపై మళ్లీ ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ కొత్త పాలక మండలి కొలువుదీరాక తొలిసారిగా జరిగిన సర్వసభ్య సమావేశానికి మీడియాను అనుమతించలేదు. ఆ తర్వాత నుంచి అనుమతిస్తున్నారు. రాబోయే రోజుల్లోనూ ఇకపై జరగనున్న సర్వసభ్య సమావేశాలకు మీడియాను అనుమతించరాదని ప్రభుత్వ స్థాయిలోని పెద్దలు నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇదే సందర్భంలో సర్కిల్ కార్యాలయాలు, జోనల్ కార్యాలయాల్లో వివిధ రాజకీయ పార్టీల నేతల ప్రమేయం వంటివి సైతం చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఏ పార్టీకి చెందిన రాజకీయ నేతలు ఒత్తిడి తెచ్చినా అధికారులు వెరవాల్సిన పనిలేదని, ఎవరినీ ఖాతరు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వ పెద్దలు సూచించినట్లు సమాచారం.

'ఇంటర్నేషనల్ బిజినెస్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

పంజగుట్ట: ప్రస్తుతం బిజినెస్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు, ఎంబీఏ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే పుస్తకం 'ఇంటర్నేషనల్ బిజినెస్' అని ఆస్కీ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.పద్మనాభయ్య అన్నారు. రచయితలు రిటైర్డ్ ప్రొఫెసర్ జయకర్ దళవాయి, విద్యావేత్త విద్యాధర్ రెడ్డి ఐలేని రచించిన ఇంటర్నేషనల్ బిజినెస్ అనే పుస్తకాన్ని గురువారం ఆస్కీలో రిటైర్డ్ డీజీపీ స్వరణ్‌జీత్ సేన్‌తో కలిసి పద్మనాభయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మనాభయ్య మాట్లాడుతూ... తాను ఈ పుస్తకాన్ని చదివానని, ఇందులో ఒకదేశానికి, మరో దేశానికి మధ్య వ్యాపార సంబంధాలు, యుద్ధం వచ్చినప్పుడు, కరోనా లాంటి విపత్తులు వచ్చినప్పుడు వ్యాపారం, వస్తువులు, కరెన్సీపై పడే ప్రభావంపై చక్కగా వివరించారన్నారు.



నిర్మాత సురేష్‌బాబు



జయేష్ రంజన్



చాముండేశ్వరీనాథ్





చీర్ గర్ల్స్ సందడి

జోష్ లేకపాయె!

ఆఖర్లో ఉత్కంఠ రేకెత్తించిన మ్యాచ్‌లో సొంత గడ్డపై సన్‌రైజర్స్ మళ్లీ నిరాశపరిచింది. వరుణ్ చక్రవర్తి చివరి ఓవర్ స్పిన్‌కు తలొగ్గి మ్యాచ్‌ను అప్పగించింది. ఫలితం ఇలా ఉంటే అభిమాన సందోహం కూడా తక్కువైంది. గత మ్యాచ్‌ల్లో పోటెత్తిన అభిమానులతో ఊగిపోయిన ఉప్పల్ స్టేడియం గురువారం నాటి మ్యాచ్‌లో పలచగా కనిపించింది. కోల్‌కతా టీమ్‌లో చెప్పుకోదగ్గ స్టార్ ఆటగాళ్లు లేకపోవడం, రెండు టీమ్‌లు కూడా ఇప్పటి వరకు అంతంత మాత్రం ప్రదర్శననే కనబరచడం, వారాంతం కాకపోవడం కారణమైంది. స్టేడియం సామర్థ్యాన్ని బట్టి చూస్తే దాదాపు 10 వేలకు పైగా సీట్లు ఖాళీగా ఉండిపోయాయి. ఈ సీజన్‌లో అన్నింటికంటే తక్కువ స్థాయిలో 26,342 మంది ప్రేక్షకులే ఈ మ్యాచ్‌కు హాజరయ్యారు.

వికెట్ తీసిన ఆనందంలో కేకేఆర్ జట్టు





నిరాశలో సన్‌రైజర్స్ అభిమాని



రన్ రాజా రన్

వార్డు కార్యాలయాల కోసం అధికారుల పరుగులు

- తగినంత స్టాఫ్ లేకుంటే ఇతర విభాగాల నుంచి.. ఔట్‌సోర్సింగ్‌పైనే
- భవనాల ఎంపిక బాధ్యత జడ్సీలదే..
- కార్యాలయాల ఏర్పాట్లకు అధికారుల కసరత్తు


సాక్షి, సిటీబ్యూరో: వార్డు కార్యాలయాల నుంచి పరిపాలన సాగించేందుకు ఈ నెలాఖరులోగా భవనాలు, సిబ్బందిని సమకూర్చుకొని సిద్ధంగా ఉండాలని మున్సిపల్ మంత్రి కేటీఆర్ ఆదేశించిన నేపథ్యంలో అధికారుల్లో ఉరుకులు పరుగులు మొదలయ్యాయి. జోనల్ కమిషనర్లు స్వయంగా పరిశీలించాకే భవనాలను ఫైనల్ చేయాలని కేటీఆర్ ఆదేశించిన నేపథ్యంలో జోనల్ కమిషనర్లు భవనాల కోసం అన్వేషణ ప్రారంభించారు.

మూడు నాలుగు రోజుల్లోగా వార్డు ఆఫీస్‌లకు యోగ్యమైన భవనాలను ఎంపిక చేయనున్నారు. ఒక్కో వార్డు ఆఫీస్ కోసం అందుబాటులో ఉన్న భవనాలను పరిశీలించి వాటిల్లో ఏది సదుపాయంగా ఉంటే, దాన్ని ఎంపిక చేసి, అవసరమైన పక్షంలో మరమ్మతులు చేసి, రంగులు వేయడం తదితర పనులన్నీ వీలైనంత త్వరగా పూర్తి చేయనున్నారు. వార్డు ఆఫీసుల ఎంపిక కోసం మంత్రి కొన్ని సూచనలు చేశారు.

వార్డు ఆఫీసులిలా ఉండాలి..

- వార్డులోని ప్రజలకు అందుబాటులో ఉండాలి.
- అధికారులు, సిబ్బంది సాఫీగా పని చేయడానికి, ప్రజలు సమస్యలు తెలియజేయడానికి సదుపాయంగా ఉండాలి.
- వార్డు కార్యాలయం వరకు సాఫీ రవాణా సదుపాయం ఉండాలి.
- తగినంత పార్కింగ్ ప్రదేశం ఉండాలి.
- అవసరమైన ఇతరత్రా సదుపాయాలుండాలి.
- ఇరుకు గల్లీల్లో ఉండరాదు.

వీటిని దృష్టిలో ఉంచుకొని తగిన భవనాల కోసం జోనల్ కమిషనర్లు వెతుకుతున్నారు. జీహెచ్ఎంసీకి ఎంసీహెచ్‌గా ఉన్నప్పుడు వార్డు కార్యాలయాలున్నప్పటికీ, వాటిల్లో చాలా వరకు ఇతర అవసరాలకు మళ్లించారు. కొన్ని రాజకీయ నేతల చేతుల్లోకి వెళ్లిపోయాయి. కొన్ని కబ్జాల పాలయ్యాయి. దీంతో సదుపాయంగా ఉన్న వార్డు కార్యాలయాలుంటే వాటిని ఎంపిక చేస్తారు. లేని పక్షంలో జీహెచ్‌ఎంసీకి చెందిన కమ్యూనిటీ హాళ్లు, ఇతరత్రా ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉంటే పరిశీలిస్తారు. అప్పటికీ దొరక్కపోతే ప్రైవేట్ భవనాలనైనా అద్దెకు తీసుకుంటారు.



స్టాఫ్ ఎంపిక..

వీటితో పాటు మరోవైపు వార్డు కార్యాలయాల్లో పని చేయడానికి అవసరమైన అధికారులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తారు. 150 వార్డులకు ఇన్‌చార్జులుగా వ్యవహరించేందుకు 150 మంది అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు (ఏఎంసీలు) కావాలి. జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం దాదాపు 80 మంది ఉన్నారు. మిగతా 70 మందిని ఇతర కార్యాలయాల నుంచి ఎంపిక చేస్తారు. అప్పటికీ చాలకపోతే సూపరింటెండెంట్లను ఎంపిక చేస్తారు. ఇన్‌చార్జి తర్వాత ఇంజినీర్ల కోసం ఏఈలను నియమించనున్నారు. ఏఈలు తక్కువైతే ఏఏఈలను అవసరమైతే డీఈఈలను సైతం నియమించనున్నారు.

= అప్పటికీ చాలకపోతే డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం న్యాక్ ద్వారా ఔట్ సోర్సింగ్‌పై తీసుకున్న వారిని ఆ విధుల్లో నియమిస్తారు. ప్రస్తుతం డబుల్ బెడ్రూం ఇళ్ల పనులు లేనందున వారికి పెద్దగా పనిలేదు. ఇంకా అవసరమైతే న్యాక్ నుంచి కానీ ఇతర సంస్థల నుంచి కానీ ఔట్‌సోర్సింగ్‌పై తీసుకుంటారు. ఇలాగే వార్డు కార్యాలయాల్లో ఉండాల్సిన శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఎంటమాలజీ, వెటర్నరీ, విద్యుత్ సిబ్బంది కోసం తగినంత మందిని నియమిస్తారు. ఎంటమాలజీలో తగినంత మంది ఉన్నారు. వెటర్నరీలో లేరు. పారిశుద్ధ్యంలోని వారిని వెటర్నరీలో నియమిస్తారు. ఇలా ఉన్న సిబ్బందిని పరిగణనలోకి తీసుకొని అందుబాటులో ఉన్న వారిని వార్డు విధులకు నియమిస్తారు. లేనిపక్షంలో ఔట్‌సోర్సింగ్‌పై నియమిస్తారు.

బ్రాండ్ ఇమేజ్..

వార్డు కార్యాలయాలన్నింటికీ బ్రాండ్ ఇమేజ్ ఉండేలా ఏకరీతిలో బోర్డులు వంటివి ఏర్పాటు చేయనున్నారు. జీహెచ్‌ఎంసీ బ్రాండ్ ఇమేజ్ కనిపించేలా తీర్చిదిద్దనున్నారు. ఈ నెలాఖరులోగా ఈ పనులన్నీ పూర్తిచేసి జూన్ ఒకటో తేదీ నాటికి.. ఎటొచ్చీ రాష్ట్రావతరణ దినోత్సవమైన జూన్ 2 నాటికి వార్డు కార్యాలయాలు పని ప్రారంభించేలా ఏర్పాట్లు పూర్తి చేయనున్నారు. ఈమేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ జడ్సీలు, డీసీలు, సంబంధిత విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లు సత్వరం పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు.


వణుకుతున్న వైర్లు!

'ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో కాంట్రాక్ట్ ఉద్యోగి ప్రదీప్ (40) ఈ ఏడాది మార్చి 17న ఉదయం పద్మారావు పార్కులో వాకింగ్‌కు వెళ్లాడు. భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి అప్పటికే హైటెన్షన్ వైరు తెగి వాకింగ్ ట్రాక్‌పై పడింది. సాధారణ టీవీ కేబుల్ మాదిరే ఏబీ కేబుల్ ఉండటం, వైరులో కరెంట్ సరఫరా అవుతుందనే విషయం తెలియకపోవడం, ప్రమాదవశాత్తూ వైరును తొక్కడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు'

'గండిపేటకు చెందిన సోలెం వీరాస్వామి (40) గ్రేహౌండ్స్ కానిస్టేబుల్. ఏప్రిల్ 30న సాయంత్రం జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ ఒకటి నుంచి ఎన్టీఆర్ మార్గ్ వైపు వెళ్తున్నాడు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్దకు చేరుకున్నాడు. ఈదురు గాలికి తోడు భారీ వర్షం కురుస్తుండటంతో బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. అప్పటికే అక్కడ విద్యుత్ వైరు తెగిపడి ఉండటంతో షాక్‌తో అక్కడికక్కడే చనిపోయాడు'

ఈదురు గాలులతో తెగిపడుతున్న విద్యుత్ తీగలు

- ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న అమాయకులు
- లైన్ల పునరుద్ధరణకు ఏటా రూ.100 కోట్లకు పైగా ఖర్చు
- అయినా క్షేత్రస్థాయిలో కనిపించని మార్పులు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌ను విశ్వ నగరంగా పాలకులు డల్లాస్.. ఇస్తాంబుల్‌లతో పోల్చుతున్నారు. ప్రపంచ దేశాలన్నీ ఇటు వైపే చూస్తున్నాయని గొప్పలు చెబుతున్నారు. ఎంత పెద్ద నగరమైతేనేమీ.. చిన్న ఈదురు గాలి వానకు గజగజా వణుకుతోంది. మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. విద్యుత్ లైన్లు తెగిపడుతున్నాయి. స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలుతున్నాయి. పలువురు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు.

డిస్కం చరిత్రలో ఇదే తొలిసారి..

- సీజన్ మారిన ప్రతిసారి విద్యుత్ లైన్ల పునరుద్ధరణకు డిస్కం ఏటా రూ.120 కోట్లకుపైగా ఖర్చు చేస్తోంది. కానీ.. నగరంలో ఎటు చూసినా లూజు లైన్లే దర్శనమిస్తున్నాయి. తీగలు చెట్ల కొమ్మల కింద వేలాడుతున్నాయి. డీటీఆర్‌ల నుంచి ఆయిల్ లీకేజీలు ఏర్పడుతూనే ఉన్నాయి. నిర్వహణ లోపంతో వైర్లు తెగిపడుతూ అమాయకులు మృత్యువాతపడుతున్నారు.
- గత సోమవారం కురిసిన వర్షానికి నగరంలో 300పైగా ఫీడర్లు ట్రిప్పయ్యాయి. 80పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో 20 గంటలకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నగర రోజువారీ విద్యుత్ వినియోగం కూడా 70 ఎంయూల నుంచి 50 ఎంయూలకు పడిపోయింది. డిస్కం చరిత్రలోనే ఈ సీజన్‌లో ఇంత తక్కువ విద్యుత్ వినియోగం రికార్డు కావడం ఇదే తొలిసారి.

నిర్వహణ లోపంతో..

వర్షం కురిసినప్పుడు రింగ్ మెయిన్ యూనిట్ (ఆర్ఎంయూ)కు తేమ చేరి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. సమస్యను గుర్తించి సరఫరాను పునరుద్ధరించడం ఇంజినీర్లకు పెద్ద తలనొప్పిగా మారింది. నిజానికి వర్షా కాలానికి ముందే ఆర్ఎంయూల నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉంది. కానీ నగరంలో ఎక్కడా ఇలాంటి పనులు చేస్తున్న దాఖలాలు లేవు. 11 కేవీ లైన్ల వరకు చెట్ల కొమ్మలు తొలగిస్తున్నా.. ఎల్‌టీ లైన్లు పట్టించుకోవడం లేదు. శివారులోని మెజార్టీ మున్సిపాలిటీల్లో ఇప్పటికీ చెట్ల కొమ్మల మధ్యే లైన్లు వేలాడుతున్నాయి.

ఎందుకిలా?!

పీఎం- శ్రీకి హైదరాబాద్ నుంచి ఒకే ఒక పాఠశాల..

- రంగారెడ్డి జిల్లా నుంచి 27, మేడ్చల్‌లో 15 స్కూళ్ల ఎంపిక
- అయిదేళ్లలో ఒక్కో పాఠశాలకు రూ.2 కోట్లు
- కేంద్ర, రాష్ట్ర నిధులతో ఆదర్శ పాఠశాలలుగా అభివృద్ధి



సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర విద్యాశాఖ సర్కారు బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు అమలు చేస్తున్న ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం-శ్రీ) పథకం కింద రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి ఒకే ఒక పాఠశాల ఎంపిక కావడం గమనార్హం. శివారు పరిధిలోని రంగారెడ్డి జిల్లా నుంచి 27, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి 15 పాఠశాలలు ఎంపికయ్యాయి. కేంద్ర విద్యాశాఖ నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా మొదటి విడతలో పీఎం- శ్రీ పాఠశాలలను ఎంపిక చేసింది. గత ఏడాది సెప్టెంబర్‌లో పీఎం-శ్రీ పాఠశాలల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదించి పోర్టల్‌లో జిల్లాల వారీగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల దరఖాస్తులు ఆహ్వానించింది. జిల్లా విద్యాశాఖ అధికారులు మార్గదర్శకాల అనుగుణంగా పాఠశాలలను ఎంపిక చేసి పోర్టల్‌లో ప్రతిపాదించారు. మొత్తమ్మీద మూడు దశల్లో ఈ ఎంపిక ప్రక్రియ కొనసాగింది. కేంద్ర విద్యాశాఖ చాలెంజ్ మోడ్‌లో వీటిని ఎంపిక చేసితాజాగా జాబితా విడుదల చేసింది. సమగ్రమైన, వినూత్నమైన విధానాల్లో, సృజనాత్మకతను ప్రోత్సహించేలా, అన్ని స్థాయిల్లో విద్యార్థులందరికీ సమానమైన, నాణ్యమైన విద్యనందిస్తూ.. సంపూర్ణమైన పరివర్తన తీసుకురావాలనే లక్ష్యంగా పాఠశాలలను తీర్చిదిద్దనున్నారు.

పీఎం-శ్రీ కింద ఎంపికైన పాఠశాలలను అయిదేళ్లలో పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచి, ఇతరత్రా పనులు చేపట్టనున్నారు. ఏడాదికి రూ.40 లక్షల చొప్పున అయిదేళ్లలో రూ.2 కోట్లను అందజేస్తారు. ఇందులో కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను సమకూరుస్తాయి. ఈ పథకంలో భాగంగా బడులను హరిత పాఠశాలలుగా అభివృద్ధి చేస్తారు. ఇందుకోసం సోలార్ ప్యానెళ్లు, ఎల్ఈడీ లైట్లు, ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, పోషకాహార తోటల పెంపకం, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడుతారు. ఇంటరాక్టివ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ల్యాబ్స్ ఏర్పాటు, అదనపు తరగతి గదుల నిర్మాణం, పిల్లల్లో క్రీడాభివృద్ధి, వివిధ కళల్లో శిక్షణ తదితర చర్యలను తీసుకుంటారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నిధులు విడుదల కానున్నాయి.

ప్రతిపాదనలు ఇలా

- హైదరాబాద్ జిల్లా నుంచి పీఎం- శ్రీకి అర్హత ఉన్న 23 పాఠశాలల ప్రతిపాదనలు పంపించగా కేవలం రసూల్‌పురాలోని పోలీస్‌లేన్ హైస్కూల్ మాత్రమే ఎంపికైంది.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో సుమారు 43 పాఠశాలలను ప్రతిపాదించగా 15 పాఠశాలలు ఎంపికయ్యాయి.
- రంగారెడ్డి జిల్లా పరిధిలో సుమారు 65 పాఠశాలల ప్రతిపాదనలు పంపించగా అందులో 27 పాఠశాలలకు మోక్షం లభించింది.

మార్గదర్శకాల ప్రకారమైనా...

పీఎం- శ్రీ మార్గదర్శకాలకు అనుగుణంగా బడికి సొంత భవనం, విద్యుత్, మంచి నీటి సౌకర్యం, ఫైర్ సేఫ్టీ ఉపకరణాలు, సగటు కన్నా మంచి విద్యార్థుల హాజరు నమోదు, ఆట మైదానం, గ్రంథాలయం, బాలురు, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు, సరిపోను టీచర్లు తదితర ప్రమాణాల ప్రాతిపదికన అర్హత ఉన్న పాఠశాలలను మాత్రమే ఎంపిక చేసి ప్రతిపాదించినా మొక్కుబడిగా ఎంపికయ్యాయి.

ఎవరిది అసమర్థత..?

రాజేంద్రనగర్ పరిధిలో భారీ హోర్డింగ్‌లు, బ్యానర్లు, పోస్టర్లు



- వీటిని ఏర్పాటు చేసింది మైలార్‌దేవ్‌పల్లి బీజేపీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి
- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అయిదేళ్లలో రూ.1.37 కోట్లే ఖర్చు చేశారని అసంతృప్తి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం మైలార్‌దేవ్‌పల్లి బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాటు చేసిన 'ఎవరిది అసమర్థత' హోర్డింగ్‌లు, బ్యానర్లు, పోస్టర్లు కలకలం సృష్టించాయి. గతంలోనూ 'సొమ్మొకరిది.. సోకొకరిది' పేరిట కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గంలో ఖర్చు చేసిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులపై ఆయన హోర్డింగ్‌లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రచారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇది మరవక ముందే గురువారం ఉదయం నార్సింగి, శంషాబాద్, గండిపేట మండల పరిధిలోని ప్రధాన రహదారులు, రోడ్డుకు ఇరువైపులాల, ప్యాసింజర్ ఆటోలపై 'ఎవరిది అసమర్థత' అనే పోస్టర్లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తన నిధుల నుంచి 1.37 కోట్లను అయిదేళ్లుగా ఖర్చు చేయగా.. ముఖ్యమంత్రి కేసీఆర్ తన నియోజకవర్గం గజ్వేల్‌కు రూ.616 కోట్లు, మంత్రి హరీష్‌రావు నియోజకవర్గం సిద్ధిపేటకు రూ.692 కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పరిచారంటూ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మూడు మండలాలలో కేవలం 1.37 కోట్లను మాత్రమే అయిదు సంవత్సరాలలో ఖర్చు చేశారంటూ వీటిపై పేర్కొన్నారు. ఉదయం నుంచి ఈ హోర్డింగ్‌లపైనే నియోజకవర్గంలో చర్చ నడిచింది. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో స్థానికులు ఇదే విషయమై చర్చించుకున్నారు. ఉదయం 7 గంటలకు హోర్డింగ్‌లను ఏర్పాటు చేయగా.. మధ్యాహ్నం 3 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు వీటిని తొలగించడం పట్ల నార్సింగి, రాజేంద్రనగర్, శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లలో శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. తాను సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించి ప్రజల ముందు ఉంచానని, దీన్ని జీర్ణించుకోలేకనే హోర్డింగ్‌లను తొలగించారని ఆయన ఆరోపించారు.

ఎమ్మెల్యే పుట్టిన రోజు నేపథ్యంలో..

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ జన్మదిన వేడుకలను నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. శుక్రవారం ఆయన పుట్టినరోజు కావడంతో స్వాగత వేదికలు, బ్యానర్లు, హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం తోకల శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లతో వారు కంగుతిన్నారు.



రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్

అభివృద్ధి కుంటుపడటంతోనే..

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అసమర్థత కారణంగా ఎలాంటి నిధులు రావడం లేదు. కేవలం పంచాయతీ, జీహెచ్‌ఎంసీ, మున్సిపల్, కార్పొరేషన్ నిధుల నుంచి మాత్రమే అభివృద్ధి పనులను ప్రారంభిస్తు తానే నిధులను మంజూరు చేయించినట్లు ప్రజలను నమ్మిస్తున్నారు. ఎమ్మెల్యే నిధుల నుంచి కేవలం 1.37 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. అసమర్థత ఎమ్మెల్యే కారణంగానే నిధులు మంజూరు కావడం లేదు. ఇది ప్రజలు గమనించాలి.

– తోకల శ్రీనివాస్‌రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్

మీరు ఇస్తామన్నా మాకొద్దు!



- పెరుగుతున్న అన్‌ఫిట్ రక్త దాతల సంఖ్య
- జీవనశైలి వ్యాధులే ప్రధాన కారణం
- ఫలితంగా సిటీలో రక్త నిల్వలకు తీవ్ర కొరత

సాక్షి, సిటీబ్యూరో: ఏఎస్‌రావు నగర్‌లో నివసించే సుధాకర్ (45) క్రమం తప్పకుండా రక్తం ఇచ్చేవాడు. కరోనా నేపథ్యంలో మూడేళ్ల పాటు ఇవ్వలేదు. తాజాగా సికింద్రాబాద్‌లోని ఒక బ్లడ్ బ్యాంక్‌కి వెళ్లి రక్తం ఇవ్వబోతే.. పరీక్షల అనంతరం ఆయన రక్తం అన్‌ఫిట్‌గా నిర్ధారణై తిరస్కరించారు. దీనికి కారణం గత కొంత కాలంగా ఆయన యాంటీబయాటిక్స్ వినియోగిస్తుండడమే. నగరంలో ఓ వైపు రక్త నిల్వలు క్షీణిస్తుంటే మరోవైపు అన్‌ఫిట్ రక్త దాతల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. అయిదేళ్ల క్రితం రక్తం ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేసిన వారిలో అన్ ఫిట్ బ్లడ్ డోనర్స్ సంఖ్య దాదాపు 7శాతం ఉండేది. ఇది ఇప్పుడు దాదాపు 15శాతానికి చేరుకుందని రక్త బ్యాంకుల రికార్డులు చెబుతున్నాయి. దీంతో అసలే రక్తదాతల సంఖ్య సరిపడా లేకపోగా ఇప్పుడు వారిలో అన్‌ఫిట్ సంఖ్య పెరుగుతూ నగర రక్త నిల్వల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోంది.

ఎందుకిలా అంటే..

ఈ అన్‌ఫిట్ పరిస్థితికి ప్రధాన కారణం నగరంలో గుండె జబ్బులు థైరాయిడ్‌తో పాటు మధుమేహం రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధుల బాధితులు వేగంగా పెరుగుతుండడమే అని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. 'జీవనశైలి వ్యాధుల కారణంగా మా కేంద్రానికి వచ్చే దాతలలో కనీసం 10శాతం మంది అన్‌ఫిట్‌గా నిర్ధారణవుతున్నారు' అని ఆరోహి బ్లడ్ బ్యాంక్‌కు చెందిన ధీరజ్ కావేరి అంటున్నారు. అలాగే క్రమం తప్పకుండా ఇచ్చేవారు కూడా అనంతరం కాలంలో వ్యాధుల బారిన పడుతుండడంతో రక్తదానం ఆపేస్తున్న పరిస్థితి కూడా కనిపిస్తోంది. ఇవన్నీ కలిసి అవసరార్థులకు రక్తం అందుబాటును కష్టసాధ్యంగా మారుస్తోంది.

యాంటీబయాటిక్స్ వినియోగమూ కారణమే..

- రకరకాల వ్యాధులు, సమస్యలకు ఎడా పెడా యాంటీబయాటిక్స్ వినియోగం సర్వసాధారణం కావడం కూడా అన్‌ఫిట్‌గా మారుస్తున్న మరొక ప్రధాన కారకం. అలాంటి మందులు వాడుతున్న వారు వెంటనే దాతల జాబితా నుంచి తొలగిస్తారు. కరోనా అనంతరం యాంటీ బయాటిక్స్ వినియోగం ఒక వ్యసనంగా మారిందని పలు సర్వేలు కూడా స్పష్టం చేస్తున్నాయి. కరోనా తర్వాత చిన్న జ్వరం, దగ్గు, జలుబు వంటి వాటి విషయాల్లోనూ యాంటీబయాటిక్స్ వాడకం అలవాటు కావడంతో పలువురు రక్తదానం ఇవ్వడానికి అనర్హులుగా మారారని ఇది తలసీమియా వ్యాధిగ్రస్థుల పాలిట శాపంగా మారిందని తలసీమియా, సికిల్ సెల్ సొసైటీ తెలంగాణ జాయింట్ సెక్రటరీ అలీమ్ బేగ్ అంటున్నారు.
- ఒకవైపు అనర్హుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రక్తం కోరుతూ అభ్యర్థనల వెల్లువ సోషల్ మీడియాలో బాగా పెరిగింది. నగరంలో ప్రస్తుత సరఫరాను బట్టి చూస్తే డిమాండ్‌లో 50శాతం మాత్రమే నెరవేరుతోందని తలసీమియా సొసైటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సొసైటీలో ప్రస్తుతం 3,085 మంది రోగులకు సంబంధించి ఉన్న డిమాండ్‌లో 50శాతం మాత్రమే తీర్చగలుగుతున్నారు. డిమాండ్–సరఫరా అంతరం భారీగా ఉన్నందున, అవసరాన్ని తీర్చడానికి రక్తదాన శిబిరాలను విరివిగా నిర్వహించాలని బ్లడ్ బ్యాంక్‌లను సొసైటీ సభ్యులు కోరుతున్నారు.

కారు బీభత్సం

- బైక్‌ను ఢీ కొట్టడంతో స్విగ్గీ బాయ్ మృతి
- మరొకరికి గాయాలు
- కానాజీగూడలో ఘటన



ప్రమాదానికి కారణమైన కారు



నిందితురాలు శివాని



మృతుడు రాజు (ఫైల్)

అల్వాల్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ర్యాష్ డ్రైవింగ్ కారణంగా ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం రాత్రి కానాజీగూడలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్వాల్ కానాజీగూడకు చెందిన శివాని (28) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తుంది. బుధవారం రాత్రి ఆమె ఎల్‌బీనగర్ నుంచి కియా కారులో తన స్నేహితులు అనూహ్య, శుకాంత్‌లతో కలిసి ఇంటికి వస్తుంది. డైయిరీ ఫామ్ రోడ్డు వేద్ విహార్ వద్దకు రాగానే కారు అదుపు తప్పి రోడ్డు పక్కన బైక్‌పై కూర్చుని ఉన్న స్విగ్గీ డెలివరీ బాయ్ పికెట్‌కు చెందిన రాసపురం రాజు (30)ను ఢీ కొట్టింది. అక్కడి నుంచి ముందుకు వెళ్లి మరో బైక్‌పై ఉన్న రాజ్ కుమార్‌ను ఢీ కొట్టి టిఫిన్, జ్యూస్ సెంటర్‌లోకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన రాజును సమీపంలోని ఆస్పత్రికి తరలించిన స్థానికులు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఇసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. పికెట్‌కు చెందిన రాజు అల్వాల్‌లో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తూ రాత్రి వేళల్లో పార్ట్‌టైమ్‌గా స్విగ్గీ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. రాజు మృతికి కారణం చెప్పడం లేదని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రమాదానికి కారణమైన శివానిని పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టి మర్యాదలు చేస్తున్నారని, ఆమె వివరాలు వెల్లడించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. రాజు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.





గుర్తుకొస్తున్నాయి!

- సీఐడీలో ఉండగా కృషి బ్యాంక్ కేసు దర్యాప్తు
- ఛైర్మన్ కొనరాజును బ్యాంకాక్‌లో అరెస్టు చేశా
- బాధితులకు చెక్కులు అందించడం ఆనందంగా ఉంది
- జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న కొత్వాల్ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లోని నార్త్‌జోన్ పరిధిలోని మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చిన కృషి బ్యాంక్ కుంభకోణం దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. 2001 నాటి ఈ కేసును సీఐడీ దర్యాప్తు చేసింది. అప్పట్లో డీఐజీ హోదాలో ఉన్న ఇప్పటి నగర కొత్వాల్ సీవీ ఆనంద్ నేతృత్వంలోనే ఇన్వెస్టిగేషన్ మొత్తం సాగింది. ఈ కేసులో బాధితులను గుర్తించి, చెక్కులు అందించేందుకు సీఐడీ అధికారులు చేస్తున్న ప్రయత్నాలపై మీడియాలో కథనాలు వచ్చాయి. వీటిని చూసిన సీవీ ఆనంద్ స్పందిస్తూ నాటి జ్ఞాపకాలను ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. కేసు దర్యాప్తు వివరాలతో కూడిన ఓ వీడియోతో పాటు బాధితులకు చెక్కుల పంపిణీ ఫొటోనూ షేర్ చేశారు. ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా ఉన్న వీసీ సజ్జనార్ సైతం ఈ బృందంతో పాటు బ్యాంకాక్ వెళ్లారు. ట్విట్టర్ ద్వారా ఆనంద్ పంచుకున్న అంశాలివీ...

'కృషి బ్యాంక్ బాధితులను వెతికి పట్టుకుని మరీ సీఐడీ అధికారులు చెక్కులు పంచుతున్నారనే వార్త చూసి చాలా ఆనందపడ్డా. కృషి బ్యాంక్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కొసరాజు వెంకటేశ్వరరావును అరెస్టు చేసేందుకు 17 ఏళ్ల క్రితం ఓ ప్రత్యేక బృందంతో బ్యాంకాక్ వెళ్లా. అతను 8 వేల మంది నుంచి రూ.32 కోట్ల మేర కాజేసి కుటుంబంతో సహా విదేశాలకు పారిపోయాడు. అప్పట్లో నేను సీఐడీలోని ఆర్థిక నేరాల విభాగం డీఐజీగా పని చేస్తున్నా. రెండేళ్లు శ్రమించి, ఇంటర్‌పోల్ సాయంతో బ్యాంకాక్‌లో కొసరాజు ఆచూకీ కనిపెట్టాం. అక్కడికి వెళ్లిన మా బృందం చట్టపరమైన అంశాలన్నీ పూర్తి చేసి ఎక్స్‌ట్రడిషన్ విధానంలో అతడిని హైదరాబాద్‌కు తీసుకువచ్చి చంచల్‌గూడ జైలుకు తరలించాం. విదేశాల్లో ఉన్న ఓ నిందితుడిని సీఐడీ పోలీసులు ఎక్స్‌ట్రడిషన్ విధానంలో ఇక్కడకు తీసుకురావడం అదే ప్రథమం. వెంకటేశ్వరరావును ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానంలో హైదరాబాద్ తెచ్చాం. అతడితో పాటు మా బృందం కోసం ఐసీ–736 విమానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందిగా ఎయిర్‌లైన్స్‌ను కోరాం. దీంతో ఆఖరి మూడు వరసల్నీ మా కోసం కేటాయించారు'. అని పేర్కొన్నారు.

క్లీన్‌బౌల్డ్ పేరుతో క్రికెట్ బెట్టింగ్

- నలుగురు ముఠా సభ్యుల అరెస్ట్
- పరారీలో ప్రధాన నిందితుడు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ జానకి రెడ్డి

చైతన్యపురి: సులువుగా డబ్బులు సంపాదించేందుకు క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ, సరూర్‌నగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ జానకిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బి.హేమంత్ అనే వ్యక్తి క్లీన్‌బౌల్డ్ పేరుతో క్రికెట్ బెటింగ్ కోసం వాట్సాప్ గ్రూప్ సృష్టించాడు. సరూర్‌నగర్ జనప్రియ అపార్టుమెంట్‌కు చెందిన సూరోలు కృష్ణ, లింగోజిగూడ కామేశ్వర్‌రావు కాలనీకి చెందిన గొడుగు ఈశ్వర్‌కుమార్, అదే కాలనీకి చెందిన కనపాకల మహేష్, రమణబోయిన వంశీ హేమంత్‌తో పంటర్లుగా ఒక ముఠాగా ఏర్పడి క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా నగరానికి చెందిన పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. బుధవారం మొహాలీలో జరిగిన ముంబై వర్సెస్ పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌కు బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ, సరూర్‌నగర్ పోలీసులు కామేశ్వరావు కాలనీలోని ఓం సాయి లక్ష్మి డిజిటల్స్ ప్రింటర్స్ అండ్ అవుట్‌డోర్ కార్యాలయంపై దాడి చేసి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 5 వేల నగడు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు హేమంత్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ పకోడీలో కారం ఎక్కువైందన్నందుకు..

- యువకుడిపై కత్తితో నిర్వాహకుడి దాడి
- అడ్డుకోబోయిన అతడి సోదరుడికి గాయాలు



గాయపడిన ప్రణీత్

కేపీహెచ్‌బీకాలనీ: చికెన్ పకోడీలో కారం ఎక్కువైందన్నందుకు వినియోగదారుడిపై పకోడి సెంటర్ నిర్వాహకుడు కత్తితో దాడికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన నాగార్జున బుధవారం రాత్రి 9వ ఫేజ్‌లోని జెఎస్ చికెన్ పకోడి సెంటర్‌కు వెళ్లి పకోడి తిన్నాడు. అయితే పకోడీలో కారం ఎక్కువగా ఉందంటూ నిర్వాహకుడు జీవన్‌కు చెప్పాడు. దీంతో అతను తింటే తిను లేదంటే వెళ్లిపో అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అదే సమయంలో నాగార్జునను తీసుకెళ్లేందుకు అతని సోదరుడు ప్రణీత్ అక్కడికి వచ్చాడు. అప్పటికే ఇద్దరి మధ్య వివాదం ముదరడంతో పకోడీ సెంటర్ నిర్వాహకుడు జీవన్ కత్తితో నాగార్జునపై దాడికి యత్నించగా అడ్డుకోబోయిన ప్రణీత్ చేతి మణికట్టుపై భాగంలో తీవ్ర గాయమైంది. స్థానికులు ప్రణీత్‌ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు తిరిగి చెల్లించాలన్నందుకు..

వ్యక్తి దారుణ హత్య



హత్యకు గురైన మిథున్

దూద్‌బౌలి: తీసుకున్న అప్పును తిరిగి చెల్లించమన్నందుకు ఓ వ్యక్తిని నడిరోడ్డుపైన కత్తితో దారుణంగా హత్య చేసిన సంఘటన గురువారం హైకోర్టు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకకు చెందిన మిథున్ ఆలియాజ్ రాజు (33) గత కొన్నేళ్లుగా హైకోర్టు వద్ద ఉన్న సులభ్ కాంప్లెక్స్‌లో పని చేస్తున్నాడు. అతడికి అదే ప్రాంతానికి చెందిన పండ్ల వ్యాపారి ఆజంతో పరిచయం ఉంది. కొన్నాళ్ల క్రితం ఆజం మిథున్ వద్ద రూ.10 వేలు వడ్డీకి తీసుకున్నాడు. మిథున్ తన వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమని ఆజంను నిలదీశాడు. మిథున్‌పై కక్ష పెంచుకున్న ఆజం తన బావమరిదికి ఈ విషయం చెప్పాడు. ఇదే విషయమై గురువారం ఉదయం మిథున్, ఆజం మధ్య గొడవ జరిగింది. దీంతో ఆజం తన బావమరిది షేక్ గౌస్‌ను అక్కడికి పిలిపించాడు. వీరి మధ్య మాటా మాటా పెరగడంతో ఆగ్రహానికి లోనైన షేక్ గౌస్ కత్తితో మిథున్‌ను దారుణంగా హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్, ఇన్‌స్పెక్టర్ గురు నాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. చార్మినార్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు షేక్ గౌస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

పరీక్ష సరిగా రాయలేదని..

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



సాయి కిరణ్ మృతదేహం

జగద్గిరిగుట్ట: ఇటీవల జరిగిన కానిస్టేబుల్ పరీక్ష సరిగా రాయలేదని మనస్తాపానికి లోనైన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటేశ్వర నగర్‌కు చెందిన సాయికిరణ్(26) సోదరుడు కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. తాను కూడా కానిస్టేబుల్ కావాలన్న లక్ష్యంతో పరీక్షలకు సిద్ధమయ్యాడు. అయితే పరీక్ష సరిగా రాయలేదని తరచూ భార్యతో చెప్పి బాధపడుతుండేవాడు. ఉద్యోగం వస్తుందో లేదోననే అనుమానంతో గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జువైనల్ హోం నుంచి బాల నేరస్తుడు పరారీ

దుండిగల్: జువైనల్ హోం నుంచి బాల నేరస్తుడు తప్పించుకుని పారిపోయిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. బౌరంపేటలోని హంసఫార్ దాబా సమీపంలో గాజులరామారం బాలుర జువైనల్ హోం కొనసాగుతోంది. వివిధ నేరాలకు పాల్పడిన మైనర్లను ఈ కేంద్రానికి తరలిస్తుంటారు.

రంగారెడ్డి జిల్లా, కొత్తపేట మండలం, మార్గదర్శి కాలనీకి చెందిన ఓ బాలుడు(16)డిని చోరీ కేసులో ఆరు నెలల క్రితం జువైనల్ హోంకు తరలించారు. అప్పటి నుంచి అక్కడే ఉంటున్న అతను ఈ నెల 1న అధికారుల కళ్లుగప్పి పరారయ్యాడు. జువైనల్ హోం అధికారి సంగమేశ్వర్ ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ.6 లక్షలు స్వాహా

అమీర్‌పేట: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతి నుంచి రూ.6 లక్షలు స్వాహా చేసిన వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌కు చెందిన యువతికి మ్యాట్రిమోనీ ద్వారా అదే ప్రాంతానికి చెందిన రాజశేఖర్ పరిచయం ఏర్పడింది. తనకు వివాహం అయ్యిందని.. భార్యతో విడాకులు తీసుకున్నట్లు చెప్పాడు.అతడి మాటలు నమ్మి సదరు యువతి అతడితో పరిచయం పెంచుకుంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి వ్యాపార లావాదేవీల నిమిత్తం రూ.15 లక్షలు కావాలని చెప్పడంతో రూ.6 లక్షలు ఇచ్చింది. కొన్ని రోజుల తర్వాత రాజశేఖర్‌కు భార్యాపిల్లలు ఉన్నట్లు తెలియడంతో అతడిని వదిలించుకోవాలని నిర్ణయించుకుంది. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీయగా డబ్బులు ఇవ్వకపోగా బెదిరింపులకు దిగడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోంగార్డుపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

అమీర్‌పేట: ట్రాఫిక్ హోంగార్డుపై దాడికి పాల్పడిన వ్యక్తిని ఎస్ఆర్‌నగర పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్సై ప్రదీప్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ చౌరస్తాలో హోంగార్డు ఏవీ. కృష్ణారెడ్డి బుధవారం విధుల్లో ఉండగా అక్కడికి క్యాబ్‌లో వచ్చిన చింతల్ నివాసి నరేష్ కారులో అతడి భార్యను తీవ్రంగా కొడుతుండటాన్ని గుర్తించిన హోంగార్డు కృష్ణారెడ్డి అక్కడికి వెళ్లి నరేష్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో అతను హోంగార్డుపై కూడా దాడి చేశాడు. గతంలో అతడికి బ్రెయిన్ సర్జరీ కాగా అదే చోట తీవ్రంగా కొట్టడంతో కృష్ణారెడ్డి లేవలేని స్థితికి చేరుకున్నాడు. స్థానికులు అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నరేష్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

కారులో తిప్పుతూ ఆటో డ్రైవర్‌పై దాడి

నగదు, సెల్‌ఫోన్‌తో పరార్

అమీర్‌పేట: గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఆటో డ్రైవర్‌పై దాడి చేసి నగదు, సెల్ ఫోన్ లాక్కెళ్లిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. అబ్దుల్లాపూర్‌మెట్, ఇంజాపూర్ సమీపంలోని వెంకటేశ్వరనగర్‌కు చెందిన ధారావత్ కళ్యాణ్ (23) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఎస్ఆర్‌నగర్ లస్సీ కార్నర్ వద్ద ఉండగా బ్రిజా కారులో అక్కడికి వచ్చిన నలుగురు వ్యక్తులు స్థానికంగా ఉండే ఆడపిల్లల చిరునామా చెప్పాలని బెదించారు. తనకు తెలియదని చెప్పినా వినిపించుకోకుండా తీవ్రంగా కొట్టికారులో ఎక్కించుకుని పలు ప్రాంతాల్లో తిప్పుతూ అతడిపై దాడి చేశారు. జేబులో ఉన్న రూ.5 వేల నగడు,సెల్ ఫోన్ లాక్కుని తిరిగి ఆటో వద్ద వదిలి పారిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

యవకుడి దారుణ హత్య



సురేశ్ మృతదేహం

జవహర్‌నగర్: టవల్‌తో గొంతుకు బిగించి, రాయితో తల పగులగొట్టి ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కౌకూర్‌కు చెందిన రాగం నాగేందర్‌రావు ఇంట్లో ఈ నెల 1న నెల్లూరుకు చెందిన పొదలకూరు సురేశ్ (40) అద్దెకు దిగాడు. సమీపంలోని జనప్రియలో పెయింటర్‌గా పనిచేస్తున్న సురేశ్ రాత్రి వేళల్లో స్నేహితులతో కలిసి మద్యం తాగి న్యూసెన్స్ చేస్తుండటంతో బుధవారం అతడిని ఖాళీ చేయించి అడ్వాన్స్‌గా చెల్లించిన రూ. 1500 తిరిగి ఇచ్చేశారు. కాగా గురువారం ఉదయం స్థానిక హనుమాన్ దేవాలయం సమీపంలో దేవేందర్‌రెడ్డికి చెందిన పాడుబడిన ఇంటి వద్ద సురేశ్ మృతి చెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ సీతారాం సంఘటనా స్థలాన్ని పరిశీలించాడు. టవల్‌తో గొంతుకు బిగించి, ముఖంపై రాయితో కొట్టి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మద్యం మత్తులోనే హత్య జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

భర్త వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య



బుస్రాబేగం మృతదేహం

సైదాబాద్: భర్త వేధింపులు భరించలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సైదాబాద్ పీఎస్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సింగరేణి కాలనీకి చెందిన సాలేహ్‌కు కిషన్‌బాగ్‌కు చెందిన బుస్రా బేగం (26) తో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. సాలేహ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా బుస్రాబేగం ఇంట్లోనే ఉంటుంది. గత కొద్ది రోజులుగా భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భర్త వేధింపులు తీవ్రం కావడంతో మనస్తాపానికి లోనైన బుస్రా గురువారం సాయంత్రం సింగరేణి కాలనీలోని తమ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న సైదాబాద్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

నేడు సాయిబాబాకు ప్రత్యేక పూజలు

బంజారాహిల్స్: వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12 విశ్వ సాయి మందిరంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం స్వామివారికి విశేష లవంగ చూర్ణ రసం, మామిడి పండ్లు, పుష్పాలతో అభిషేకం అనంతరం సహస్ర నామార్చన నిర్వహిస్తామని తెలిపారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా అభివృద్ధి, ఉద్యోగ, ప్రాప్తి కలగడంతో పాటు పితృదేవతల అనుగ్రహం కలుగుతుందని స్పష్టం చేశారు.

వేడుకగా నరసింహ స్వామి జయంతి



నరసింహ స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న సత్యచంద్ర గౌరదాస

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం-12లోని స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి స్వర్ణ దేవాలయంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నరసింహ స్వామి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, ఊంజల్ సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీ భూసమేత నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పల్లకీ సేవ, ప్రత్యేక ప్రవచనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యచంద్ర గౌరదాస తదితరులు పాల్గొన్నారు.

మెట్లదారిని బాగుచేయరూ...



ఉదయ్‌నగర్‌లో సరస్వతి స్కూల్ వద్ద దెబ్బతిన్న మెట్లదారి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని శ్రీ సరస్వతి స్కూల్ వద్ద ఉన్న మెట్లదారి చాలా రోజులుగా మురుగు ప్రవాహంతో వర్షాలతో పూర్తిగా దెబ్బతిన్నది. ఈ దారిగుండా నిత్యం విద్యార్థులు, బస్తీవాసులు ప్రయాణిస్తుంటారు. రాత్రి వేళల్లో దెబ్బతిన్న ఈ దారిగుండా కిందపడి పలువురు గాయాలపాలవుతున్నారని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి ఈ మెట్లదారికి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కిడ్స్ క్లాతింగ్ సమ్మర్ కలెక్షన్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఫ్యాషన్ సంస్థ ఏంజెల్ అండ్ రాకెట్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 వేదికగా కిడ్స్ క్లాతింగ్ సమ్మర్ కలెక్షన్ ప్రారంభమైంది. గురువారం నిర్వహించిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో కో ఫౌండర్ చెందురన్ మాట్లాడుతూ... బ్రాడరీ, ఫైరీ గాళ్ ప్రింట్స్‌తో సరికొత్త డిజైన్లను అందిస్తున్నామని తెలిపారు. పర్యావరణ అనుకూలనమైన గారీ సైకిల్డ్ పాలిస్టర్ ఫ్యాబ్రిక్స్, ఆర్గానిక్ కాటన్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. వీటిని ప్రత్యేకంగా యూకేలో డిజైన్ చేసి, నగరవాసులకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన కూల్ కోఆర్డ్‌సెట్స్ టెక్చర్డ్ కాటన్ వస్త్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

రైడర్స్‌కు ఈవీ బైక్స్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో తమ డెలివరీ సేవలను మరింత విస్తరించనున్నామని తమ రైడర్స్‌కు ఎలక్ట్రిక్ వాహనాలను అందించనున్నామని ప్రముఖ ఇంట్రా సిటీ డెలివరీ సేవల సంస్థ బోర్జో మార్కెటింగ్ మేనేజర్ దివేష్ గంగాల్ తెలిపారు. నగరంలో సేవలు ప్రారంభించిన సందర్భంగా బంజారాహిల్స్‌లోని స్టార్ బక్స్ కాఫీ షాప్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం తమకు నగరంలో 1000 మంది రైడర్‌ల డెలివరీ సామర్థ్యం ఉందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ నెట్‌వర్క్‌ను మూడింతలకు పెంచాలని యోచిస్తున్నామన్నారు. మిగిలిన డెలివరీ సంస్థలకు భిన్నంగా ఎక్కడి నుంచి ఎక్కడికైనా డెలివరీ, భారీ ఉత్పత్తుల పోర్ట్ ఫోలియో వంటి ప్రత్యేకతలతో నగరవాసుల ఆదరణ చూరగొంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముందుకు సాగని 'మన బస్తీ-మన బడి'



ఫిలింనగర్‌లోని ఎమ్మార్సీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- వసతుల కల్పనలో నిర్లక్ష్యం
- నీరుగారిపోతున్న మహోన్నత లక్ష్యం
- పట్టించుకోని అధికారులపై సర్వత్రా ఆగ్రహం

మెరుగైన వసతులను కల్పించి తద్వారా మంచి ఫలితాలను సాధించాలనే మహోన్నతాశయంలో ప్రారంభించిన 'మన బడి-మన పథకం' ఆచరణలో నీరుగారిపోతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎంపిక చేసిన పలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన అభివృద్ధి పనులు అసంపూర్తిగానే మిగిలిపోతున్నాయి.

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపర్చడమే కాకుండా ప్రహరీలు నిర్మించి రంగులు వేసి ఆవరణలు తీర్చిదిద్దాలని మన బస్తీ-మన బడి పథకం కింద షేక్‌పేట మండల పరిధిలో 9 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో ఫిలింనగర్‌లోని ఎమ్మార్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలతో పాటు బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎస్పీటీనగర్ ప్రాథమిక పాఠశాలల్లో పనులు పూర్తి చేసి ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే ఈ రెండు పాఠశాలల్లో ఇంకా 40 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికీ ప్రహరీ నిర్మాణం పూర్తి కాలేదు. కొత్తగా గేట్లు కూడా ఏర్పాటు చేయలేదు. టాయ్‌లెట్ల నిర్మాణం కూడా సగంలో ఆగిపోయింది. రంగులు వేయకపోవడంతో గోడలు అధ్వాన స్థితికి చేరాయి. అయితే అధికారులు మాత్రం ఆదరాబాదరగా ఈ రెండు పాఠశాలల్లో మన బస్తీ-మన బడి కింద ప్రారంభించేందుకు నిర్ణయించడం స్థానికులకు నివ్వెరపోయేలా చేస్తున్నది. గత జూన్‌లో ఈ రెండు పాఠశాలలకు సంబంధించి ఈ పథకం కింద సౌకర్యాల కోసం శంకుస్థాపన చేశారు. నత్తనడకన పనులు సాగుతున్నాయి. పనులు వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపకపోవడం, స్థానికులు కూడా పట్టించుకోకపోవడం, స్కూల్ మేనేజింగ్ కమిటీలు మొత్తుకుంటున్నా అధికారులు వినిపించుకోకపోవడం ఈ పథకం నత్తనడకన సాగడానికి కారణమవుతున్నాయనే చెప్పొచ్చు.

- ఎమ్మార్సీ కాలనీ పాఠశాలకు రూ. 23.92 లక్షలు, ఎస్పీటీనగర్ ప్రైమరీ స్కూల్‌కు రూ. 19.47 లక్షలు ఈ పథకం కింద కేటాయించారు. ఇంకా పనులు జరుగుతున్నాయని ఈ నెల 20వ తేదీ లోపు పనులు పూర్తి కావడం అనుమానమేనని స్థానికులు పేర్కొంటున్నారు.

మిగతా స్కూళ్ల పరిస్థితీ ఇదే...

- షేక్‌పేట మండల పరిధిలో మన బస్తీ-మన బడి పథకం కింద తొమ్మిది పాఠశాలలు ఎంపిక చేశారు. ఇందులో డ్రెయినేజీ, మంచినీటి పైప్ లైన్ పనులు, ప్రహరీల నిర్మాణం, టాయ్‌లెట్ల నిర్మాణం, గేట్లు ఏర్పాటు చేయడం, గోడలకు రంగులు వేయడం తదితర పనులు చేయాల్సి ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ. 21.50 లక్షలు, ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ ఉన్నత పాఠశాలకు రూ. 45.32 లక్షలు, బంజారాహిల్స్ రోడ్ నెం. 12 ఎస్పీటీ నగర్ హైస్కూల్‌కు రూ. 48.45 లక్షలు, షేక్‌పేట హైస్కూల్‌కు రూ. 15.89 లక్షలు, గతి ప్రాథమిక పాఠశాలకు రూ. 20.04 లక్షలు, ఫిలింనగర్ దుర్గా భవానీనగర్ తెలుగు మీడియం స్కూల్‌కు రూ. 1.67 లక్షలు, ఎమ్మార్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు రూ. 23.92 లక్షలు, ఎస్పీటీ నగర్ ప్రైమరీ స్కూల్‌కు రూ. 19.47 లక్షలు, షేక్‌పేట ప్రైమరీ స్కూల్‌కు రూ. 23.47 లక్షలు కేటాయించారు. రూ. 30 లక్షల్లోపు నిధులు మంజూరైన పాఠశాలల్లో స్కూల్ మేనేజింగ్ కమిటీల ఆధ్వర్యంలో ఈ పథకం కింద పనులు చేయాల్సి ఉంటుంది. ఇలా రూ. 30 లక్షల్లోపు నిధులు మంజూరైన పాఠశాలలు మండల పరిధిలో ఏడు ఉన్నాయి.
- మిగతావన్నీ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించాల్సి ఉంటుంది.
- స్కూల్ మేనేజింగ్ కమిటీల చైర్మన్ల పర్యవేక్షణలో మన బస్తీ-మన బడి పథకం కింద ఈ అభివృద్ధి పనులు జరిగేలా జీవో జారీ చేశారు.
- ఆ మేరకు ఆయా పాఠశాలల్లో పనులు జరగాల్సి ఉండగా కొన్ని పాఠశాలలకు ఎస్‌ఎంఎస్ కమిటీలు లేనట్లుగా తేలింది.

ఎస్‌పీడీ వ్యాధిపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్యులు

బంజారాహిల్స్: సెన్సరీ ప్రాసెసింగ్ డిజార్డర్ (ఎస్‌పీడీ) రుగ్మతపై జూబ్లీహిల్స్‌లోని మా ఈఎన్‌టీ హాస్పిటల్‌లో ఒక్క రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఎస్‌పీడీ వైద్యంలో నిపుణుడు లోగనాథన్ గురుస్వామి మాట్లాడుతూ... జ్ఞానేంద్రియాల ద్వారా వచ్చే సమాచారాన్ని స్వీకరించడంలో, దానిపై ప్రతిస్పందించడంలో మెదడుకు కలిగే ఇబ్బందిగా ఈ వ్యాధిని చెప్పవచ్చునని తెలిపారు. బయటకు ఆటిజంలా కనిపించడం వల్ల ఇది ఎస్‌పీడీ వ్యాధిగా గుర్తించలేకపోతారని తెలిపారు. ఈ వ్యాధితో బాధపడుతున్న పిల్లలను ఎంతో విలువైన వారిగా పరిగణించే వారి ఎదుగుదల సంవత్సరాల్లో సరైన సమయంలో వారికి సరైన చికిత్స అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇరవై మందిలో ఒకరికి ఎస్‌పీడీ సంభవించే అవకాశం ఉందని, ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఏఎస్‌డీ) ఉన్న ప్రతి ఆరుగురు పిల్లలలో ఒకరు ఎస్‌పీడీని కలిగి ఉండవచ్చన్నారు. సెన్సరీ ప్రాసెసింగ్ డిజార్డర్ (ఎస్‌పీడీ)పై శిక్షణ, నాణ్యమైన విద్య, పరిశోధన అనేది ప్రస్తుతం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో మా రీసెర్చ్ ఫౌండేషన్ మా ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్, వ్యవస్థాపక చెర్‌పర్సన్ సునీత జి కుమార్, మా ఇనిస్టిట్యూట్ వైస్ ప్రిన్సిపాల్ గిష్ చాకో డాక్టర్ సాయి కృష్ణ వేగివాడ, హియర్ 'ఎన్ సే క్లినిక్, క్లినికల్ డైరెక్టర్ రిహాబిలిటేషన్, పీపుల్ బియాండ్ లిమిట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, డాక్టర్ గరిమా వేగివాడ తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేరిస్తేనే దళితుల పురోగతి



మాట్లాడుతున్న రమేష్

పంజగుట్ట: సచివాలయానికి అంబేద్కర్ పేరు, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పెట్టగానే దళితుల బతుకులు మారవని, ఇచ్చిన హామీ మేరకు దళితులకు 3 ఎకరాల భూమి ఇవ్వాలని, దళిత ముఖ్యమంత్రిని చేయాలని తెలంగాణ లేబర్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు గొర్రె రమేష్ డిమాండ్ చేశారు. పై డిమాండ్ల సాధనకై ఈ నెల 6వ తేదీన గన్‌పార్క్ అమరవీరుల స్థూపం నుంచి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి విగ్రహం వద్ద ధర్నా కార్యక్రమం చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, 119 ఎమ్మెల్యేల్లో బీసీలకు 60 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గొర్లు, బర్లు, చెప్పులు కుట్టుకునేందుకు తోలు ఇస్తామని మభ్య పెడితే సరిపోదని వారు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు. దళితబంధు కేవలం టీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉన్న వారికే ఇస్తున్నారని అసలైన అర్హులను గుర్తించడం లేదని, ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ కోశాధికారి లక్ష్మి, రాష్ట్ర నాయకుడు శివరామ్, నాయకులు చైతన్య, శ్రావణి, లక్ష్మీపతి, ప్రవీణ్, ఎస్.కె.సలీం తదితరులు పాల్గొన్నారు.

అధికారులు లేకుండా 'పబ్లిక్ కాంటాక్ట్' దండగ

హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీగౌడ్



స్ట్రీట్ నెంబర్-9లో పర్యటిస్తున్న కార్పొరేటర్, అధికారులు

హిమాయత్‌నగర్: ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాంలో అధికారులు లేకపోతే అది సుద్ద దండగ అని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీగౌడ్ వ్యాఖ్యానించారు. డివిజన్‌లో గురువారం తలపెట్టిన పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాంకు డీఎంసీ వేణుగోపాల్, ఇంజినీరింగ్ ఈఈ పేర్రాజులు మాత్రమే హాజరయ్యారు. దీంతో ప్రజల సమస్యలు పరిష్కరించాలంటే ఈ ప్రోగ్రాంలో అన్ని విభాగాలకు చెందిన అధికారులు ఉండాలి కదా అంటూ కార్పొరేటర్ ప్రశ్నించారు. శనివారం నుంచి అన్ని విభాగాలకు చెందిన అధికారులు ఈ ప్రొగాంలో ఉండేలా చూస్తానంటూ డీఎంసీ వేణుగోపాల్ హామీ ఇచ్చారు. స్ట్రీట్-9లో జరిగిన ప్రోగ్రాంలో స్థానికులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. రోడ్డు పూర్తిగా ధ్వంసం అవడం, దోమలు ఎక్కువగా ఉండటం, మురుగునీరు రోడ్డుపై ప్రవహించడం వంటి సమస్యలను చెప్పారు. డీఎంసీ స్పందిస్తూ.. ఆయా విభాగాల అధికారులకు తెలియచేసి ఒకటి రెండు రోజుల్లో సమస్యలన్నీ పూర్తయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రామన్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, జైస్వాల్, సందీప్, జకీ తదితరులు పాల్గొన్నారు.

బోరబండ హరిహర క్షేత్ర బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: బోరబండ స్వరాజ్‌నగర్ కాలనీలో వెలసిన స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహ్మ స్వామి (హరిహర క్షేత్ర దేవస్థానం) బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. విశ్వక్సేనారాధన, రక్షా బంధనం, దీక్షా స్వీకారం, మహా కుంభ స్థాపన, అగ్ని ప్రతిష్ట, మూర్తిమంత్ర మూలమంత్ర హోమం, ధ్వజారోహం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం యాగ ఘంటారాధన, గరుడ సేవ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం సుదర్శన హోమం, మహాపూర్ణహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారయణ చిన్నజీయర్ స్వామి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కల్వల సత్యనారాయణరావు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్



మాట్లాడుతున్న బేగంపేట ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం-10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో గురువారం ట్రాఫిక్ అవగాహన, రోడ్డు భద్రత అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడంతో చాలా మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారన్నారు. రోడ్డును జీబ్రా క్రాసింగ్‌ల వద్దే దాటాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపరాదని సూచించారు. సరైన ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జ్యోతి, కరుణాకర్‌రెడ్డి, ఆస్పత్రి సీఈవో డాక్టర్ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుంతల మయం.. మరమ్మతులు శూన్యం



రోడ్డును తవ్వడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

శ్రీనగర్‌కాలనీ: ఇంజినీరింగ్ విభాగం, వాటర్‌వర్క్స్ అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు, స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడ దుర్గా ఆలయం నుంచి లా కళాశాల వద్ద ఉన్న మసీదు వరకు గత రెండు నెలల క్రితం మరమ్మతుల కోసం రోడ్లను, డ్రైనేజీ వ్యవస్థను తవ్వారు. అయితే ఇంతవరకూ మ్యాన్‌హోల్స్, రోడ్లు వేయకపోవడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయంలో వాటర్‌వర్క్స్, ఇంజినీరింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. వాటర్‌వర్క్స్‌లో నిర్లక్ష్యం, అవినీతితో ఓ ఉద్యోగి కొద్ది వారాల క్రితమే ఏసీబీకి పట్టుబడ్డాడు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో వ్యవహరించి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

'నిషా'చరులకు జైలు శిక్ష.. జరిమానా

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష పడింది. వీరితో పాటు మరో 18 మందికి జరిమానా విధించారు. వివరాలివీ... ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 20 మంది మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని గురువారం నాంపల్లిలోని 8వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయస్థానంలో హాజరుపర్చారు. కృష్ణానగర్‌కు చెందిన సాయిరామ్, మోతీనగర్‌కు చెందిన పి.రాములకు రెండు రోజుల జైలు శిక్ష, రూ. 2100 చొప్పున జరిమానా విధించారు. మరో 18 మందికి రూ. 2100 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు.



మహిళలకు మెరుగైన అవకాశాలు

వీ హబ్ సీఈవో దీప్తి రావుల



మాట్లాడుతున్న దీప్తి రావుల

బంజారాహిల్స్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా మహిళలకు మెరుగైన అవకాశాలున్నాయని తెలంగాణ వీ హబ్ సీఈవో దీప్తి రావుల అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ క్యాంపస్‌లో యువ మహిళా పారిశ్రామికవేత్తల సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... యువతులకు ఇంట్లో తల్లిదండ్రులు ప్రోత్సాహం అందిస్తే సొసైటీలో ఎన్నో అవకాశాలున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం యువ వ్యాపారవేత్తలుగా ఎదగాలనుకునేవారికి ఎన్నో వేదికలు ఏర్పాటు చేసిందని టీ-హబ్, టీ-వర్క్స్, టాస్క్ తదితర వేదికలు వారందరికీ స్వాగతం పలుకుతున్నాయన్నారు. ఇన్నోవేటివ్ ఐడియాలతో వస్తే ప్రోత్సాహం అందిస్తామన్నారు. ప్రస్తుతం పెద్ద సంఖ్యలో యువత వ్యాపారవేత్తలుగా మారుతున్నారని అందులో మహిళలు కూడా ఉండటం అభినందనీయమన్నారు. యువత కొత్త విషయాలను నేర్చుకోవాలని నేర్చుకున్న అంశానిన్ని ప్రయత్నించాలని ఒక వేళ ప్రయత్నాల్లో విఫలమైతే ఎక్కడ తప్పు జరిగిందో తెలుసుకుని సరిదిద్దుకొని ముందుకు వెళ్లాలన్నారు. ప్రస్తుతం మహిళలు అడుగు పెట్టని రంగం లేదన్నారు. యువ మహిళా వ్యాపారవేత్తలు ఎంతో మందికి ఇప్పుడు రోల్ మోడల్ నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ మెంబర్, వామ్‌మామ్ ఫుడ్ ఫౌండర్ శ్యామా జా, విరించి ఆస్పత్రి చైర్‌పర్సన్ కొంపెల్ల మాధవీ లత, సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ జాఫర్ జావెద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై పేరుకుపోతున్న వ్యర్థాలు



వెంగళ్‌రావు పార్కు దారిలో ఫుట్‌పాత్‌పై పేరుకుపోయిన చెత్తకుప్పలు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని వెంగల్‌రావు పార్కు దారిలో ఉన్న ఫుట్‌పాత్‌పై పెద్ద ఎత్తున చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. స్థానికంగా ఉన్న కాలనీవాసులు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. పాదచారులు నడవాల్సిన ఫుట్‌పాత్‌పై స్థానిక వ్యాపారులతో పాటు జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులే చెత్త వేస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చెస్‌తో ప్రతిభకు పదును

శ్రీనగర్‌కాలనీ: చెస్ ఆడటం ద్వారా చిన్నారులు, విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరిగి మెదడు చురుకుగా పనిచేస్తుందని ఏకాగ్ర చెస్ అకాడమీ సీఈఓ, కోచ్ సందీప్‌నాయుడు అన్నారు. గురువారం శ్రీనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ రోడ్ నెం-10లోని ఏకాగ్ర చెస్ అకాడమీలో సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమ్మర్ అయిపోయే వరకూ ఈ సమ్మర్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిష్ణాతులైన కోచ్‌లచే కోచింగ్‌తో పాటు వారిలో మోటివేషన్‌ను కలిగించి వారిలో ప్రతిభను వెలికితీస్తామన్నారు. ఏకాగ్ర చెస్ అకాడమీ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అకామమీ విద్యార్థులు పతకాలు, అవార్డులు, రివార్డులు పొందారని చెప్పారు. వివరాలకు ఫోన్స్: 79813 58105, 87684 88888లలో సంప్రదించాలని కోరారు.



దోమలు వృద్ధి చెందకుండా పటిష్ట చర్యలు



వెంగళ్‌రావు పార్కు చెరువులో దోమల మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: వరుసగా కురిసిన వర్షాలతో చెరువులు, కుంటల్లో దోమల వృద్ధి పెరిగి పరిసర ప్రాంతాల్లో ఉన్నవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది స్పందించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని వెంగళ్‌రావు పార్కు చెరువుతో పాటు, తాజ్‌బంజారా లేక్, ఫిలింనగర్ కొత్త చెరువు ప్రాంతాల్లో సిబ్బంది దోమల లార్వా వృద్ధి చెందకుండా మందులను పిచికారీ చేస్తున్నారు. వారానికి ఒకసారి డ్రోన్ ద్వారా కూడా మందులను పిచికారీ చేస్తున్నట్లు ఎంటమాలజీ ఏఈ రజిత తెలిపారు. అదే విధంగా బస్తీలు, కాలనీల్లో సాయంత్రం వేళల్లో దోమల ఫాగింగ్ యంత్రాలను తిప్పుతున్నామని తెలిపారు.

మధుశ్రీకి డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలోని ఇన్స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ విభాగం నుంచి జి.మధుశ్రీకి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. వరంగల్ పట్టణానికి చెందిన మధుశ్రీ పీజీ వరకు కేయూలో చదివి, జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అనంతరం ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో పీహెచ్‌డీలో ప్రవేశం పొంది ఎస్‌ఆర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.గురురావు పర్యవేక్షణలో కంట్రోలింగ్ ఐపీ ఫాల్సిఫ్లయింగ్ యూజింగ్ రీలిస్టిక్ సిములేషన్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకురాలిగా పని చేస్తున్న మధుశ్రీ తన పీహెచ్‌డీ పరిశోధనకు సహకరించిన ప్రొ.శ్యామల, బీవోఎస్ వెంకటదాస్, డీన్ ప్రొ.పీవీ.సుధాకు ధన్యావాదలు తెలిపారు.

మట్టికుప్పల తొలగింపు



బంజారాహిల్స్: నాలుగు రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లోని ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారుల్లో చాలా చోట్ల పెద్ద ఎత్తున మట్టి, బురద పేరుకుపోయింది. బంజారాహిల్స్ రోడ్ నెం.2 లోని పార్క్ హయత్ హోటల్ సమీపంలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన మట్టిని గురువారం జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. పెద్ద ఎత్తున మట్టి వ్యర్థాలు పేరుకుపోవడంతో పాదచారులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫిర్యాదు అందుకున్న అధికారులు వెంటనే సిబ్బందితో ఇక్కడ పేరుకుపోయిన మట్టిని పూర్తిగా తొలగించారు.

క్లుప్తంగా...

ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

ఒకే కుటుంబానికి చెందిన 10 మంది సహా 11 మంది మృతి

బలోడ్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బలోడ్ జిల్లాలోని 30వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 10 మంది సహా మొత్తం 11 మంది చనిపోయారు. ధంతారి జిల్లా సారామ్ భట్‌గావ్ గ్రామానికి చెందిన ఓ కుటుంబం కాంకేర్ జిల్లా మర్కటోలా గ్రామంలో జరిగే వివాహ వేడుకలో పాల్గొనేందుకు బొలెరో వాహనంలో బయలుదేరింది. పురుర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జగ్తారా గ్రామం వద్ద వారి వాహనం ముందున్న ట్రక్కును వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబంలోని 10 మందితోపాటు మరో వ్యక్తి మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. మృతుల కుటుంబాలకు సీఎం భూపేశ్ బఘేల్ రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

సెలవు అర్జీ యాప్ ద్వారానే..

ఏ వివరాలు కావాలన్నా యాప్‌లే ఆధారం

- ఆర్టీసీలో ఇంటిగ్రేటెడ్ ఐటీ ప్రాజెక్టు
- మరో నాలుగు వారాల్లో కాగితరహిత సేవలు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులకు సెలవు కావాలంటే యాప్.. వారి జీతభత్యాలు, సెలవులు వివరాలు తెలుసుకోవాలంటే యాప్.. ఆర్టీసీలో ఏ వివరాలు కావాలన్నా ఇప్పుడు యాప్‌లే ఆధారం. ఇంటిగ్రేటెడ్ ఐటీ దిశగా ఆర్టీసీ అడుగులు వడివడిగా వేస్తోంది. ఏరోజుకారోజు బస్సు ప్రయాణించిన దూరం, సమకూరిన ఆదాయం, బల్క్ డీజిల్ ధర, వినియోగం, డిపోల్లో మిగిలిన స్టాక్, ఆయిల్ కంపెనీకి బకాయి తదితర వివరాలన్నీ ఆన్‌లైన్ ద్వారా ఉన్నతాధికారులకు అందుబాటులో ఉంటాయి. ఈ క్రమంలో మరికొద్ది రోజుల్లో కాగితరహిత కార్పొరేషన్‌గా ఆర్టీసీ అవతరించబోతోంది. ఇటీవలే దాదాపు రూ.6 కోట్ల వ్యయం కాగల ఐటీ ప్రాజెక్టుకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. కొంతకాలంగా ఆర్టీసీకి ఐటీ సేవలు అందిస్తున్న సంస్థ పనితీరు సరిగా



లేదని ఒప్పందం రద్దు చేసుకుంది. మరో సంస్థతో చేసుకున్న ఒప్పందం మేరకు ఐటీలో ఇంటిగ్రేటెడ్ వ్యవస్థ ఏర్పాటవుతోంది. ప్రజలకు చాలినన్ని బస్సులు సమకూర్చటంలో విఫలమవుతున్న ఆర్టీసీ కంప్యూటర్లు, లాప్‌టాప్‌ల కొనుగోలుతో ముందడుగు వేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని డిపోల్లో కంప్యూటర్లు ఉన్నా, ఇప్పుడు కొత్తగా డిపో మేనేజర్లందరికీ లాప్‌టాప్‌లు కొనేందుకు చర్యలు తీసుకుంటోంది.

చీమ చిటుక్కుమన్నా బస్‌భవన్‌కు తెలిసేలా..

ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల డిపోలో ఏం జరుగుతోందో, హైదరాద్‌లోని ప్రధాన కార్యాలయమైన బస్‌భవన్‌కు వెంటనే తెలిసే వ్యవస్థ ఏర్పాటవుతోంది. ఇందుకోసం అన్ని డిపోలతో ఐటీపరంగా అనుసంధానించే ప్రాజెక్టు సిద్ధమవుతోంది. నిరంతరం డిపో మేనేజర్లు తమ డిపోల కార్యకలాపాలను సంబంధిత కంప్యూటర్ ప్రోగ్రాం ద్వారా అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఆర్టీసీతో ఒప్పందం కుదుర్చుకున్న ఐటీ సంస్థ తన సిబ్బందితో ఏడాది పాటు ఈ ప్రాజెక్టు నిర్వహించనుంది. అదే సమయంలో దీనిపై ఆర్టీసీ ఉద్యోగులకు తగిన శిక్షణ ఇస్తోంది. ఇందులో భాగంగా మొత్తం ఆర్టీసీ కార్పొరేషన్ ఒకే ఐటీ గొడుకు కిందకు వచ్చేసింది. 46 వేల మంది ఉద్యోగులు, 96 డిపోల సమాచారం అనుసంధానమైంది. దీని ఆధారంగా ప్రత్యేకంగా యాప్‌లను కూడా రూపొందించారు. ఇక అంతా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. మరో నాలుగు వారాల్లో ప్రాజెక్టు పూర్తి కాబోతోంది.

మార్గదర్శి పిటిషన్ కొట్టేయండి

- దీన్ని విచారించే పరిధి తెలంగాణ హైకోర్టుకు లేదు
- ఏపీ ప్రభుత్వం వాదనలు
- తదుపరి విచారణ 11కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: తమ సంస్థ కార్యకలాపాలను ఏపీ ప్రభుత్వం అడ్డుకుంటోందంటూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేయాలని ఏపీ ప్రభుత్వ స్పెషల్ ఏజీపీ లలితా గాయత్రి గురువారం తెలంగాణ హైకోర్టును కోరారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలపై మంగళగిరి పీఎస్‌లో కేసులు నమోదయ్యాయని, తనిఖీలూ అక్కడే జరిగాయన్నారు. అలాంటప్పుడు ఇక్కడ పిటిషన్ ఎలా వేస్తారని ఆమె ప్రశ్నించారు. మార్గదర్శి రిట్ పిటిషన్‌పై విచారణ జరిపే పరిధి తెలంగాణ హైకోర్టుకు లేదన్నారు. తనిఖీలు, జప్తు ప్రక్రియ ఇప్పటికే ముగిసిందని.. పంచనామా కూడా పూర్తయిందని వెల్లడించారు. కాబట్టి మార్గదర్శి పిటిషన్‌ను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ముమ్మనేని సుధీర్ మార్గదర్శి పిటిషన్‌కు సంబంధించి వివరణ ఇవ్వాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 11కి వాయిదా వేశారు. తనిఖీల పేరిట మార్గదర్శి రోజువారీ కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని.. ఇది చట్ట విరుద్ధం, హక్కుల ఉల్లంఘన అని మార్గదర్శి చిట్‌ఫండ్స్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అమరావతి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు చేసిన కేసులను విచారించేలా ఆదేశాలివ్వాలని కోరింది. అలాగే సీఐడీ తనిఖీల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వస్తున్నారని.. వారిని అనుమతించడం కుదరదని పిటిషన్‌లో పేర్కొంది. విచారణ సమయంలో ఉద్యోగులను వేధించకుండా ఆదేశాలివ్వాలని మార్గదర్శి విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్‌లో హోం శాఖ ముఖ్య కార్యదర్శి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ, సీఐడీ ఏఎస్పీ తదితరులను ప్రతివాదులుగా పేర్కొంది.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్క్‌షాప్ నిర్వహిస్తున్న డీజీపీ అంజనీకుమార్

మావోయిస్టులను సరిహద్దులు దాటనివ్వొద్దు..

- డీజీపీ అంజనీ కుమార్
- సరిహద్దు జిల్లాల ఎస్పీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టులు మళ్లీ రాష్ట్ర సరిహద్దులు దాటి లోపలికి రాకుండా వారి కదలికలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డీజీపీ అంజనీ కుమార్ సరిహద్దు జిల్లాల పోలీసులను ఆదేశించారు. రాష్ట్రంలో మావోయిస్టుల దాడి ఘటన ఏ ఒక్కటి జరిగినా అది తెలంగాణ అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని డీజీపీ అభిప్రాయపడ్డారు. పొరుగునే ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దక్షిణ బస్తర్‌లో ఇటీవల మందుపాతర దాడి ఘటన నేపథ్యంలో రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల పోలీస్ అధికారులతో గురువారం డీజీపీ తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్క్‌షాప్ నిర్వహించారు. గ్రేహౌండ్స్ అదనపు డీజీ విజయ్ కుమార్, శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్, ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఐజీలు చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్ ఖాసీంలతో కలసి పలు సూచనలు ఇచ్చారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, సరిహద్దు జిల్లాల ఎస్పీలు, డీఎస్పీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ ప్రముఖులు, వీవీఐపీల పర్యటనలు పెరుగుతాయన్నారు. మావోయిస్టుల ఆకస్మిక దాడులు పెరిగేందుకు అవకాశం ఉంటుందని, భద్రతా సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో మావోయిస్టుల ఘటనలు లేనప్పటికీ వారిని కట్టడిచేసే వ్యూహాలను మాత్రం పక్కాగా అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో 80 శాతం మంది కొత్తగా విధుల్లో చేరిన పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నందున మావోయిస్టుల వ్యూహాలు, దాడులపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. అదనపు డీజీ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. వీఐపీల వద్ద ఉండే పీఎస్‌ఓలకు మావోయిస్టులు జరిపే ఆకస్మిక దాడులు, అనుకోని పరిస్థితులు ఎదురైతే కల్పించాల్సిన భద్రతపై ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేస్తామన్నారు.

మరో రెండేళ్లలో 85 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి

- సీహెచ్‌పీల లోడింగ్ సామర్థ్యాన్ని 133 మిలియన్ టన్నులకు పెంచాలి
- సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: మరో రెండేళ్లలో 85 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి రవాణాను లక్ష్యంగా పెట్టుకున్నట్టు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో నేపథ్యంలో బొగ్గు రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ)ల లోడింగ్ సామర్థ్యాన్ని 133 మిలియన్ టన్నులకు పెంచాలని ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గురువారం సింగరేణి వ్యాప్తంగా ఉన్న 10 ప్రధాన సీహెచ్‌పీలు, గనుల వద్ద ఉన్న 16 పిట్ హెడ్ సీహెచ్‌పీల పనితీరును సమీక్షించారు. ముందస్తు ప్రణాళికలతో 2025–26 నాటికి ఏడాదికి 23 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కొత్త సీహెచ్‌పీలను నిర్మించాలని ఆదేశించారు. కొత్తగా ప్రారంభం కానున్న వీకే–7 ఓపెన్ కాస్ట్ గని వద్ద 10 మిలియన్ టన్నుల సామర్థ్యం గల సీహెచ్‌పీని, ఒడిశా రాష్ట్రంలోని నైనీ వద్ద 10 మిలియన్ టన్నుల సామర్థ్యం గల సీహెచ్‌పీతో పాటు రామగుండం–2 ఏరియాలో 5 మిలియన్ టన్నుల సామర్థ్యం గల సీహెచ్‌పీని నిర్మించాలని పేర్కొ



న్నారు. ఇందుకు దీనికి సంబంధించిన అనుమతులు, ప్రణాళికలు ఇప్పటి నుంచే అమలు జరపాలని కోరారు. మందమర్రికి సమీపంలో రూ.130 కోట్ల వ్యయంతో ఒక రైల్వే సైడింగ్, సీహెచ్‌పీని నిర్మించాలని నిర్ణయించారు.

నాలుగు కొత్త గనుల నుంచి 20 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి

2024–25లో ప్రారంభించనున్న నాలుగు కొత్త గనులపై అంశాల వారీగా శ్రీధర్ సమీక్షించారు. నైనీ బొగ్గు బ్లాకు నుంచి ఈ ఏడాది 50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని, 2024–25 నుంచి పది మిలియన్ టన్నుల బొగ్గు సాధించాలని పేర్కొన్నారు. మిగిలిన 3 కొత్త గనులకు రావాల్సిన ఉన్న అటవీ పర్యావరణ అనుమతులను జూలై నాటికి సాధించాలన్నారు. వచ్చే ఏడాది నుంచి వీకే కోల్ మైన్ నుంచి 45 లక్షల టన్నులు, జేకే ఓపెన్ కాస్టు నుండి 20 లక్షల టన్నులు, గోలేటి ఓపెన్ కాస్టు నుంచి 35 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి సాధించాలని తద్వారా మొత్తం మీద 20 మిలియన్ టన్నుల బొగ్గును కొత్త గనుల నుంచి ఉత్పత్తి చేయాలని సూచించారు.

యాజమాన్యం వాటా నుంచే..

ఈపీఎస్‌కు అదనపు చెల్లింపు

- అధిక పెన్షన్ చందాదారులకు ఊరటనిచ్చిన ఈపీఎఫ్‌ఓ
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం
- ప్రత్యేకంగా నోటిఫికేషన్ జారీ

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) అధిక పెన్షన్ చందాదారులకు ఊరటనిచ్చింది. వేతన పరిమితి దాటిన ఉద్యోగులకు సంబంధించి అదనంగా చెల్లించాల్సిన ఈపీఎస్ మొత్తాన్ని యాజమాన్యాలే భరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రత్యేకంగా నోటిఫికేషన్ జారీ చేసింది.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు..

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ నిబంధనలను ఈపీఎఫ్‌ఓ 2014 సెప్టెంబర్‌లో సవరించింది. చందాదారులకు వేతన పరిమితిని రూ.15 వేలుగా నిర్ధారించింది. ఈ పథకం కింద చందాదారుల వేతనం నుంచి మినహాయించే 12శాతం సొమ్మును పీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్) ఖాతాలో జమచేస్తారు. యాజమాన్యం చెల్లించే 12శాతం సొమ్ములో 3.67శాతాన్ని పీఎఫ్ ఖాతాలో.. మిగతా 8.33 శాతాన్ని ఎంప్లాయీస్ పెన్షన్ పథకం (ఈపీఎస్) ఖాతాలో జమ చేస్తారు. అయితే అధిక పెన్షన్‌కు సంబంధించి వేతన పరిమితి రూ.15 వేలు దాటిన చం



దాదారులు.. ఈపీఎస్ కోసం అదనంగా 1.16 శాతం సొమ్ము చెల్లించాలనే నిబంధన విధించింది. దీనిపై అసంతృప్తి చెందిన చందాదారులు కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. స్పందించిన న్యాయస్థానం.. ఉద్యోగి నుంచి అధిక మొత్తాన్ని స్వీకరించడం సామాజిక భద్రతకు విరుద్ధమని, ఆ మేరకు సొమ్మును సమకూర్చుకునే ఇతర మార్గాలను అన్వేషించాలని ఆదేశించింది. దీనిపై ఇప్పటిదాకా జాప్యం చేస్తూ వచ్చిన ఈపీఎఫ్‌ఓ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. అధిక పెన్షన్ పొందాలనుకునే చందాదారులకు సంబంధించిన 1.16 శాతం అదనపు సొమ్మును యాజమాన్యాలు చెల్లించే వాటా నుంచే తీసుకోనున్నట్టు ప్రకటించింది. దీని ప్రకారం.. యాజమాన్యాల వాటాలో ఈపీఎస్‌కు వెళ్లే సొమ్ము 9.49శాతానికి పెరగనుంది.

నగర వార్తలు

27, 28 తేదీల్లో ‘అఖిల భారత విశ్వ విద్యాలయాల విద్యార్థుల మహాసభ’

పంజగుట్ట: భారత్ బచావో ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో ‘అఖిల భారత విశ్వ విద్యాలయాల విద్యార్థుల మహాసభ’ నిర్వహిస్తున్నట్లు సభ నిర్వాహక కమిటీ కన్వీనర్ డాక్టర్ సుశీల్ కుమార్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సభ కరపత్రాన్ని ప్రతినిధి దీపక్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని కాషాయీకరణ, వ్యాపారీకరణ, ప్రవేటీకరణ చేస్తుందని దీనికి వ్యతిరేకంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠ్యాంశాల్లో చరిత్రను వక్రీకరిస్తున్నారని అశాస్త్రీయ విధానాలు ప్రవేశపెడుతున్నారని ఆరోపించారు. సభకు దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, జర్నలిస్టులు, విద్యార్థి సంఘాల నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశ ప్రాంగణాన్ని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

పదవి లేకపోతే సీఎంపై విమర్శలా.?

- పిడమర్తి రవిపై టీఎస్ విద్యార్థి జేఏసీ ఆగ్రహం



బండారు వీరబాబు

ఉస్మానియా యూనివర్సిటీ: పదవులు లేకుంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి విమర్శలు చేయడం దారుణమని తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ బండారు వీరబాబు అన్నారు. గురువారం ఆయన ఓయూలో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారనే విశ్వాసంతో రెండు సార్లు సత్తుపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని కల్పించారని, రెండు సార్లు ఎస్సీ కార్పొరేషన్ పదవిని కట్టబెట్టారన్నారు. ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి పిడమర్తి రవి లేదన్నారు. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల కావడంతో తన స్వలాభం కోసం యువతను పక్కదోవ పట్టించేందుకు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల అభివృద్ధిని కోరుకునే వారు పదవులను పట్టించుకోరన్నారు. వ్యక్తిగత సంపాదనకు మరిగిన వారే ముఖ్యమంత్రిని విమర్శిస్తారని ఎద్దేవా చేశారు. మరోసారి సీఎంను విమర్శిస్తే రాళ్లతో కొడతామని హెచ్చరించారు.

అంధ క్రీడాకారుల ప్రతిభ అభినందనీయం



టోర్నీలో పాల్గొన్న చిన్నారికి అవార్డు అందజేస్తున్న బండారు దత్తాత్రేయ...



మొదటి బహుమతి అందుకుంటున్న మారిముత్తు

- ముగిసిన హైదరాబాద్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ ఫర్ విజువల్లీ చాలెంజ్డ్ 2023
- విజేతగా తమిళనాడుకు చెందిన మారిముత్తు..
- ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఢిల్లీ, మహారాష్ట్రలకు చెందిన క్రీడాకారులు..

సనత్‌నగర్: క్రీడా పోటీల్లో అంధులు అంతర్జాతీయ స్థాయిలో రాణించడం స్ఫూర్తిదాయకమని హరియానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బేగంపేట మయూరిమార్గ్‌లోని దేవనార్ ఫౌండేషన్ ఫర్ బ్లైండ్‌లో నిర్వహించిన పదో హైదరాబాద్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ ఫర్ విజువల్లీ చాలెంజ్డ్ 2023 గురువారం ముగిసింది. 16 రాష్ట్రాలకు చెందిన దాదాపు 250 మంది అంధ క్రీడాకారులు చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని సత్తా చాటారు. ఒక్కొక్కరు తొమ్మిది రౌండ్లు పూర్తి చేసి రేటింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచారు. తమిళనాడుకు చెందిన మారిముత్తు ప్రథమ బహుమతి, ఢిల్లీకి చెందిన సోమేందర్ ద్వితీయ, మహారాష్ట్రకు చెందిన శిరీష్‌పాటిల్ తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ దేవనార్ ఫౌండేషన్ ఫర్ బ్లైండ్ ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా అంధుల కోసం విశేష సేవలందిస్తుందన్నారు. ఇక్కడ విద్యనభ్యసించిన ఎంతోమంది వివిధ రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ అంధులకు ప్రోత్సాహాన్ని అందిస్తూ వారికి బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందిస్తున్న దేవనార్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. దేశవ్యాప్తంగా 250 మంది విద్యార్థులు చదరంగంలో అద్భుత ప్రదర్శన కనబర్చడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు సాయిబాబాగౌడ్, జ్యోతిగౌడ్, రాంగోపాల్‌పేట కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్ రోడ్ నెం.1లో భారీ వర్షం కురుస్తున్న దృశ్యం


నగరంలో మళ్లీ కుండపోత

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. గత వారం రోజులుగా వర్షం వెంటాడుతూనే ఉంది. ఒక రోజు విరామం తర్వాత తిరిగి జోరందుకుంది. సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతం కాగా, రాత్రి 9.30 గంటల తర్వాత పలు ప్రాంతాల్లో భారీ వర్షం జోరందుకుంది. జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, కార్వాన్, చందానగర్, ముసాపేట, యూసుఫ్‌గూడ, ఆర్‌సీ పురం, కూకట్‌పల్లి మాదాపూర్ ఫిలింనగర్, పంజాగుట్ట, మణికొండ, శేరిలింగం పల్లి, పటాన్‌చెరు, మెహిదీపట్నం కొండాపూర్, కేపీహెచ్ బీ, లింగంపల్లి తదితర ప్రాంతాల్లో రెండు నుంచి ఐదు సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైంది. దీంతో నగరంలో పలు చోట్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ‘మోచా’ తుఫాన్ నేపథ్యంలో హైదరాబాద్ వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. 4 రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

రాత్రి 11 గంటల వరకు నమోదైన వర్షపాతం ఇలా..

ప్రాంతం	సెం.మీ
షేక్‌పేట	5.4
మణికొండ	5.0
జియాగూడ	4.6
కిషన్‌బాగ్	4.0
ఆసీఫ్‌నగర్	3.6
గచ్చిబౌలి	3.4
జూబ్లీహిల్స్	2.3





జూబ్లీహిల్స్‌లో..

గాంధీలో ఈఆర్‌సీపీ లైవ్ డెమో శిక్షణ



ఈఆర్‌సీపీపై డెమో శిక్షణ ఇస్తున్న గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్య నిపుణులు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగం ఆధ్వర్యంలో ఎండోస్కోపీ రిట్రోగ్రేడ్ కొలాంజియో పాంకియాటోగ్రఫీ (ఈఆర్‌సీపీ) వర్క్‌షాప్‌ను గురువారం విజయవంతంగా నిర్వహించారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆస్పత్రులకు చెందిన సూపర్ స్పెషాలిటీ పీజీ వైద్యులకు ఈఆర్‌సీపీ లైవ్ అండ్ డెమో శిక్షణ ఇచ్చి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గాంధీ, ఉస్మానియా గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌ఓడీలు ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్, రమేష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ మెడికల్ గవర్నమెంట్ సెక్టార్‌లో ఈఆర్‌సీపీ లైవ్ అండ్ డెమోపై శిక్షణ అందించడం ఇదే ప్రథమమన్నారు. పైత్యనాళంలో అడ్డుగా ఉన్న రాళ్లను తొలగించడం, పైత్య నాళం దారి మూసుకుపోతే స్టంట్‌వేసి సరిచేయడం, జాండిస్, క్యాన్సర్ తదితర ప్రమాదకరమైన రుగ్మతలను గుర్తించి సరైన వైద్య సేవలు అందించడం, పైత్యనాళాన్ని బ్లాక్ చేసే నులి పురుగులు తదితర సమస్యలను ఈఆర్‌సీపీ ప్రొసీజర్ ద్వారా పరిష్కరించవచ్చని తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈఆర్‌సీపీ ప్రొసీజర్‌కు రూ.50 వేలకు పైగా వసూలు చేస్తారని, గాంధీ, ఉస్మానియా, నిమ్స్‌లో ఉచితంగా నిర్వహిస్తున్నామని, ఒక్క గాంధీ ఆస్పత్రిలోనే నెలకు 40కు పైగా ఈఆర్‌సీపీలు చేస్తున్నామన్నారు. త్వరలో నిర్వహించే గ్యాస్ట్రోఎంట్రాలజీ ఎండీ పరీక్షలకు హాజరయ్యే మూడు ప్రభుత్వ ఆస్పత్రులకు చెందిన సూపర్‌స్పెషాలిటీ పీజీ వైద్యులకు ఈఆర్‌సీపీ ప్రక్రియపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించామన్నారు. మనేక్వ్యాన్ (బొమ్మ)లను ఉచితంగా అందించిన కుక్ మెడికల్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుకన్య, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాసరావు, సూపర్ స్పెషాలిటీ పీజీలు సుమిత్, వరుణ్, ప్రఫుల్ల కుమార్, హరీష్, రాహుల్, జీషన్, జోగ్వేర్, దినేష్, కుక్ మెడికల్ సంస్థ సేల్స్‌మేనేజర్ అర్పిత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో వాయిస్ అండ్ స్పీచ్ వర్క్ షాప్..



- భాషా సాంస్కృతిక శాఖ, సురభి కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఏర్పాటు..
- 21 రోజుల పాటు కొనసాగనున్న శిక్షణ..

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సురభి కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో శిల్పారామం వేదికగా వాయిస్ అండ్ స్పీచ్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. గురువారం జరిగిన ఈ వర్క్‌షాప్ ప్రారంభోత్సవానికి ఆల్ ఇండియా రేడియో రిటైర్డ్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ సి.ఎస్.రాంబాబు గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., స్వరంపై పట్టు సాధించాలంటే భాషపై పట్టు పెంచుకోవాలని అందుకోసం విస్తృతంగా సాహిత్యం చదవాలన్నారు. మాటను మంత్రంగా మలచాలంటే నిరంతర సాధనను మించిన మార్గం లేదని మరో అతిథి ఆర్‌జే శివ సూచించారు. వాయిస్ అండ్ స్పీచ్ వర్క్ షాప్ నిర్వాహకులు ఆర్‌జే డా.సురభి రమేష్ మాట్లాడుతూ., ఈ వర్క్ షాప్ 21 రోజుల పాటు కొనసాగనుందని, వాయిస్ ఇండస్ట్రీలోని వివిధ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇలాంటి శిక్షణ అవసరమన్నారు. స్వరాన్ని శృతి చేసి, భావాల్ని సుస్పష్టంగా వ్యక్తీకరించడానికి శిక్షణ తప్పనిసరి. శిక్షణలో భాగంగా స్టోరీ టెల్లింగ్, పబ్లిక్ స్పీకింగ్, స్టేజ్ యాంకరింగ్, రేడియో, టీవీ ప్రజెంటేషన్, పాడ్ కాస్టింగ్, న్యూస్ రీడింగ్, డబ్బింగ్ తదితర అంశాల్లో ఆయా రంగాలకు చెందిన నిపుణులు శిక్షణ ఇస్తారు. ఒకప్పుడు అవకాశాలు ఉన్నా వాటిని అందిపుచ్చుకునే మార్గాలు తెలియక చాలా మంది నష్టపోయారని, అలాంటి ఔత్సాహికులను ప్రోత్సహించి వాయిస్ ఇండస్ట్రీకి దీటైన కళాకారులను అందించడమే లక్ష్యంగా ఈ వేదికను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సినీ దర్శకులు డాక్టర్ ఖాజా మన్సూర్, ఆర్‌జే స్వాతి, వెల్ నెస్ కోచ్ డాక్టర్ సాయి ఆచార్య, ఆర్‌జే జయశ్రీ, వోకలిస్ట్ శ్రీవాణి, డాక్టర్ షేక్ షమీర్, శాంతి ఇశాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

వరంగల్‌లో మంత్రి కేటీఆర్ పర్యటన నేడు



సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ శుక్రవారం వరంగల్ నగరంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం హెలికాప్టర్‌లో హసన్‌పర్తి మండలం ఎర్రగట్టు కిట్స్ కళాశాల ఆవరణకు చేరుకోనున్న ఆయన.. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో ప్రయాణించి వరంగల్ నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. రూ.181.45 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేటీఆర్ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. సాయంత్రం కాజీపేటలోని సెయింట్ గాబ్రియల్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడతారని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్ వెల్లడించారు. పర్యటన ఏర్పాట్లను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి గురువారం పరిశీలించారు.

భట్టి యాత్రకు కోమటిరెడ్డి ఎందుకు పోలేదో?: జానా



నల్లగొండ: 'ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి జ్వరమొచ్చిందో.. నొప్పొచ్చిందో నాకేం తెలుసు? భట్టి విక్రమార్క పాదయాత్రకు ఎందుకు పోలేదో ఆయన్నే అడగాలి.. నన్నుకాదు' అని కుందూరు జానారెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జానారెడ్డి మాట్లాడారు. భువనగిరి జిల్లాలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్రలో ఎంపీ కోమటిరెడ్డి ఎందుకు పాల్గొనడం లేదని విలేకరులు అడగ్గా జానారెడ్డి పైవిధంగా స్పందించారు. నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలో చేపట్టినవేనని, ఇప్పటికే 14 లక్షల ఎకరాలకు నీరందిస్తున్నాయని, 7 లక్షల ఎకరాలకు నీరందించే ప్రాజెక్టులు బీఆర్ఎస్ పాలనలో నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం కేసీఆర్ తరమే కాదన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్ మాట్లాడుతూ నిరుద్యోగుల విషయంలో ప్రభు త్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే టీఎస్‌పీఎస్సీ పేపర్లు లీకయ్యాయన్నారు. విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

సచివాలయం నిర్మాణంపై దర్యాప్తు చేయాలి: షర్మిల



సాక్షి, హైదరాబాద్: సచివాలయ నిర్మాణంలో నాణ్యత లోపించిందని, దీనిపై దర్యాప్తు చేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. నిర్మాణంకోసం వెచ్చించిన రూ.1,600 కోట్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని గురువారం ఆమె ఒక ప్రకటనలో కోరారు. 'ప్రపంచం మెచ్చిన కాళేశ్వరం కడితే.. ఒక్క వరదకే మునిగింది. దేశం మెచ్చిన యాదాద్రి కడితే.. చిన్న వానకే చిందరవందరైంది. ఇక రాష్ట్రం మెచ్చిన సెక్రటేరియట్ కడితే.. గోడలకు బీటలు.. సారు ఏం చేసినా, ఏం కట్టినా అవినీతి చిట్టాలు.. అక్రమాల పుట్టలు' అని షర్మిల ఆరోపించారు. తెలంగాణ సంపదనంతా కొల్లగొట్టి ఢిల్లీలో గడీలు కడుతున్నారని మండిపడ్డారు. రైతులకు పరిహారం ఎగ్గొట్టి, వెన్నుపోటు పొడవడంలో కేసీఆర్ దిట్ట అన్నారు. గతంలో పరిహారం పేరుతో మిర్చి రైతులను నిండా ముంచారని.. తాజాగా వరి రైతులను నట్టేట ముంచాలని చూస్తున్నారని విమర్శించారు. అకాల వర్షాలకు 10 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినా.. సీఎంకి పట్టడం లేదన్నారు. ఇదేనా కిసాన్ సర్కారంటే.. అని నిలదీశారు. ఇప్పటికైనా తడిసిన ధాన్యం కొనడమే కాకుండా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని షర్మిల డిమాండ్ చేశారు.

రైతుబీమా నిబంధనలే కల్లుగీత కార్మికులకూ వర్తింపజేయాలి

బీజేపీ నేత బూర నర్సయ్యగౌడ్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: గీతకార్మికుల బీమాకు కూడా రైతుబీమా నిబంధనలే వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌ను బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు. కేవలం ప్రమాదబీమానే వర్తింపజేస్తే గీతకార్మికులను మోసం చేసినట్లేనన్నారు. రైతుబీమాను 18 నుంచి 59 ఏళ్లలోపు వారికి ఏ కారణంతో మరణించినా ఇస్తుండగా, తాటి చెట్టు నుంచి పడి మరణిస్తేనే గీతకార్మికులకు బీమా వర్తిస్తుందనడం సరికాదన్నారు. గురువారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్, ఎస్.హరిశంకర్‌గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు మాత్రమే సీఎం కేసీఆర్‌కు గీత కార్మికులు గుర్తుకు వస్తారన్నారు. సీఎంను ఉద్దేశించి ఆయన రాసిన లేఖను ఈ సందర్భంగా విడుదల చేశారు. నీరాకేఫ్ ఏర్పాటు అనేది ప్రభుత్వ ప్రచారానికి పనికొస్తుందే కాని దానిద్వారా గీతకార్మికులకు ఫలితం తక్కువని చెప్పారు. నీరా పాలసీ తెచ్చి గీత సొసైటీకి లైసెన్సులు ఇవ్వాలని, ప్రతిసొసైటీకి ఐదెకరాల భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. కల్వకుంట్ల కుటుంబం కులవృత్తుల జోలికి వస్తే భస్మమై పోతారని హెచ్చరించారు.

రాష్ట్రావతరణ రోజే ముహూర్తం

- పొంగులేటి, జూపల్లి ఏ పార్టీలో చేరేదీ జూన్ 2న ప్రకటన
- అదే రోజు బహిరంగ సభ.. పార్టీలో చేరిక
- దీనికి ముందు బీఆర్ఎస్ అసంతృప్త నేతలతో సమ్మేళనాలు





సాక్షిప్రతినిధి, ఖమ్మం: పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు ఏ పార్టీలో చేరతారనే దానిపై అధికారిక ప్రకటనకు ముహూర్తం ఫిక్స్ అయింది. తెలంగాణ అవతరణ దినోత్సవమైన జూన్ 2వ తేదీన ఇద్దరు నేతలు తాము ఏ పార్టీలో చేరేది ప్రకటించనున్నారు. ఖమ్మం, రంగారెడ్డి లేదా మహబూబ్‌నగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి అదే రోజు పార్టీలో చేరనున్నారు. ఈ జిల్లాల్లో ఎక్కడ సభ నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తారని సమాచారం. కాగా ఈ బహిరంగ సభ తెలంగాణ ఆత్మ గౌరవ పొలికేక సభగా మారనుందని పొంగులేటి, జూపల్లి అనుచర గణం చెబుతోంది. దీనికిముందు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ అసంతృప్త నేతలతో వారి నియోజకవర్గాల్లో పొంగులేటి ఆత్మీయ భేటీలు నిర్వహించనున్నారు.

14న ఖమ్మంలో ఆత్మీయ భేటీ

ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా పొంగులేటి ఇప్పటికే ఖమ్మం మినహా 9 నియోజకవర్గాల్లో ఆత్మీయ భేటీలు నిర్వహించారు. భద్రాచలం, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట, వైరా నుంచి పోటీ చేసే తన అభ్యర్థులను కూడా ప్రకటించారు. తాజాగా ఖమ్మంలో 14న ఆత్మీయ భేటీ పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

ఏ పార్టీలో చేరతారో..

పొంగులేటి ఏ పార్టీలో చేరతారన్నది రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల కాంగ్రెస్ నేతలు ఆయనతో పార్టీలో చేరిక విషయమై చర్చించారు. తాజాగా గురువారం బీజేపీ నేతలు పొంగులేటి, జూపల్లితో సమావేశమయ్యారు. భోజనం కూడా కలిసి చేసిన నేతలు.. నడ్డా, అమిత్ షా ఆదేశాలకు అనుగుణంగా చర్చలు జరిపినట్లు తెలిసింది. వీరిద్దరు బీజేపీలో చేరితే కేసీఆర్ వ్యతిరేక ఓటు చీలకుండా కలిసొస్తుందా? లేక ఓట్లు చీలి కేసీఆర్‌ను గద్దె దించే లక్ష్యం నెరవేరకుండా పోతుందా? అన్న అంశం చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ఇలావుండగా బీజేపీ నేతల భేటీ నేపథ్యంలో పొంగులేటి ఆ పార్టీలో చేరతారనే ప్రచారం ప్రారంభమయ్యింది. అయితే అధికారికంగా జూన్ 2న పొంగులేటి నిర్ణయం వెలువడనుంది.

కేసీఆర్‌ను పంపించడమే ఏకైక ఎజెండా

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పారు. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు యావత్ తెలంగాణ ప్రజల ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌తో పాటు మరికొందరు గురువారం పొంగులేటి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుతో ఖమ్మంలోని పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో భేటీ అయ్యారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సుదీర్ఘ చర్చలు జరిగాయి. అనంతరం పొంగులేటి మాట్లాడారు.

హడావుడిగా తీసుకునే నిర్ణయం కాదు..

తెలంగాణ రాష్ట్రం వస్తే అన్ని రకాలుగా మంచి జరుగుతుందని కలలు కన్న బిడ్డల ఆశయాలను తుంగలో తొక్కి వ్యక్తిగత స్వార్థమే లక్ష్యంగా ఇప్పుడు రాష్ట్రంలో పరిపాలన జరుగుతోందని పొంగులేటి విమర్శించారు. ఈ నేపథ్యంలో ఏ ఆలోచనతో బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చామో.. ఆ ఆశయం నెరవేర్చడానికి పని చేస్తామని చెప్పారు. బీజేపీతో చర్చలు ప్రాథమిక దశలోనే ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్‌తో పాటు కమ్యూనిస్టులు కూడా వచ్చి తమను అడగొచ్చని, తమ ఇంటి ద్వారాలు అర్ధ రాత్రి కూడా తెరిచే ఉంటాయని తెలిపారు. అయితే ఏ పార్టీలో చేరాలనేది హడావుడిగా, రాత్రికి రాత్రి తీసుకునే నిర్ణయం కాదన్నారు. ఈనెలలో సస్పెన్స్‌కు తెరదించుతారా? అనే ప్రశ్నకు తాము కూడా అదే కోరుకుంటున్నామని సమాధానం ఇచ్చారు.

పాలించే అర్హత కోల్పోయింది: జూపల్లి

కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలించే అర్హత కోల్పోయిందని జూపల్లి ధ్వజమెత్తారు. అమర వీరుల ఆత్మ శాంతించాలంటే ఎట్టి పరిస్థితుల్లో మరోసారి బీఆర్ఎస్‌కు అధికారం దక్కకుండా చూడాల్సి ఉందని అన్నారు. బీజేపీ నుంచి తమకు ఆహ్వానం అందిందని, కానీ చేరికపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. చాలామందితో మాట్లాడాల్సి ఉందని తెలిపారు. సంఘటిత పోరుతో తెలంగాణ ఏర్పడినట్లే.. కేసీఆర్‌ను గద్దె దించడానికి అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడం సాధ్యమేనని చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న ఈటల. చిత్రంలో రవీందర్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, రఘునందన్ తదితరులు

బీఆర్ఎస్ సర్కారుకు క్షేమం బీజేపీతోనే సాధ్యం

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలువరించి, కేసీఆర్ నిరంకుశత్వాన్ని బొంద పెట్టేది భారతీయ జనతా పార్టీ మాత్రమేనని ఈటల రాజేందర్ అన్నారు. ఈ భావన అందరిలోనూ ఉందన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోంమంత్రి అమిత్‌షా ఆదేశాల మేరకు పొంగులేటి, జూపల్లిని కలిసినట్లు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ నియంతృత్వ పాలనను అంతమొందించడం, ప్రజల పక్షాన పోరాడటం కోసం ఐక్యంగా ముందుకు వెళ్లాలనేది తమ లక్ష్యమని చెప్పారు. ఇందుకోసమే పొంగులేటి, జూపల్లిని బీజేపీలోకి ఆహ్వానించామన్నారు. వారు సానుకూలంగా స్పందించే అవకాశం ఉందన్నారు. నేతలు విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు.

మోదీని గద్దె దించడమే కమ్యూనిస్టుల లక్ష్యం

సీపీఐ జాతీయకార్యదర్శి నారాయణ



సభలో మాట్లాడుతున్న నారాయణ

చండూరు: సంపన్నవర్గాలకు దోచిపెడుతున్న ప్రధాని మోదీని గద్దె దించడమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. గురువారం రాత్రి నల్లగొండ జిల్లా చండూరులో జరిగిన సీపీఐ ప్రజాపోరు పాదయాత్ర ముగింపు సభలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చి హిందూ రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని బీజేపీ ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మతోన్మాద బీజేపీని నడిపిస్తున్న ఆర్‌ఎస్ఎస్ కార్యాలయంలో ఏనాడూ జాతీయ జెండాను ఎగుర వేయలేదని.. రాజ్యాంగాన్ని గౌరవించని బీజేపీ అధికారంలోకి వచ్చి తాము దేశ భక్తులమంటూ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. తాము మద్దతిస్తేనే మునుగోడు ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అన్నారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రజా పోరు పాదయాత్రతో కార్యకర్తల్లో నూతనోత్తేజం వచ్చిందన్నారు. సీపీఐ జాతీయ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

..బీజేపీలో చేరండి

▶ మొదటి పేజీ తరువాయి

దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితంలో ఎన్నోమార్లు లక్ష్య సాధన కోసం పదవులను వదిలేసి మళ్లీ ప్రజాదరణ పొందిన వ్యక్తి. మరి గవర్నర్ ఇప్పటివరకు ఎన్నిమార్లు ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేసి గెలిచారు..'అని హరీశ్ ప్రశ్నించారు.

గవర్నర్‌ను పిలవాలని రాజ్యాంగంలో ఉందా?

సచివాలయం ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించలేదని గవర్నర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. 'సచివాలయం ప్రారంభానికి గవర్నర్‌ను పిలవాలని రాజ్యాంగంలో ఉందా? పార్లమెంట్ భవన శంకుస్థాపనకు, వందే భారత్ రైళ్ల ప్రారంభానికి రాష్ట్రపతిని ఎందుకు పిలవలేదు? ప్రధాని పాల్గొనే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికీ రాష్ట్రపతిని పిలుస్తున్నారా?..'అని నిలదీశారు.

అసెంబ్లీ ముఖ్యమా? ఎమ్మెల్యే లేఖ ముఖ్యమా?

'ఉమ్మడి జాబితాలో కొన్ని, రాష్ట్రం జాబితాలో మరి కొన్ని అంశాలు ఉంటాయి. వాటికి అనుగుణంగా బిల్లులు ఉన్నాయా లేదా అని చూడటం వరకే గవర్నర్ బాధ్యత. సుప్రీంకోర్టులో ఏమైనా కేసులు ఉంటే గవర్నర్ బిల్లులు ఆపొచ్చు. గవర్నర్ పెండింగులో పెట్టిన బిల్లుల్లో అలాంటి అంశాలు ఏవైనా ఉన్నాయా? ఎమ్మెల్యే పొడెం వీరయ్య లేఖ ఇచ్చారనే సాకుతో అసెంబ్లీ తీర్మానించిన భద్రాచలం విలీన గ్రామాల బిల్లును గవర్నర్ ఆపేశారు. అసెంబ్లీ ముఖ్యమా? లేక ఎమ్మెల్యే రాసిన లేఖ ముఖ్యమా?..'అని మంత్రి ప్రశ్నించారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్నారు..

'నిరుద్యోగ యువతకు ఉద్యోగాలను, పిల్లలకు విద్యను గవర్నర్ తమిళిసై దూరం చేస్తున్నారు. గతంలో ఐదు ప్రైవేటు యూనివర్సిటీల బిల్లులను ఆమోదించిన గవర్నర్.. ఇప్పుడు అదే తరహా బిల్లును ఆమోదించడం లేదు. సిద్దిపేటలో వెటర్నరీ కాలేజీ మంజూరైనా రిక్రూట్‌మెంట్ బిల్లును తొక్కి పెట్టడం ద్వారా అభివృద్ధిని అడ్డుకుంటున్నారు..'అని హరీశ్ ఆరోపించారు.

సుప్రీంకు వెళితేనే బిల్లులకు కదలిక

'స్థానిక సంస్థల్లో అవిశ్వాసం గడువును నాలుగేళ్లకు పెంచితే గవర్నర్‌కు ఇబ్బందేంటి? బిల్లులు మార్పు చేసే అధికారం లేనప్పుడు మంత్రులు రాజ్‌భవన్‌కు ఎందుకు వెళ్లాలి? అయినా గవర్నర్‌పై గౌరవంతో రాజ్‌భవన్‌కు వెళ్లి వివరణ ఇచ్చివచ్చారు. సుప్రీం కోర్టు మెట్లు ఎక్కితే తప్ప బిల్లులు రాజ్‌భవన్ నుంచి కదలడం లేదు. తమిళనాడు నుంచి వచ్చిన సినీ నటులు రజనీకాంత్‌కు తెలిసినంత కూడా గవర్నర్‌కు తెలియదా?..'అని ప్రశ్నించారు. బీజేపీ నేతలకు మాత్రమే రాజ్‌భవన్ తలుపులు తెరిచి ఉన్నాయని హరీశ్ విమర్శించారు. కాగా కేసీఆర్ సిద్దిపేట నుంచి పోటీ చేస్తే స్వాగతిస్తానంటూ ఒక ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

గవర్నర్‌కు రాజకీయాలు తగవు: మంత్రి గంగుల



కొత్తపల్లి(కరీంనగర్): అకాల వర్షాలతో రైతులు అష్టకష్టాలు పడుతుంటే రాష్ట్ర గవర్నర్ రాజకీయాలు చేయడం తగదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదని ప్రధాని మోదీకి ఫిర్యాదు చేసే బదులు రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేసి ఉంటే తెలంగాణ ఆడబిడ్డగా గౌరవించేవాళ్లమని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ ప్రతినిధిగా గవర్నర్ కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రైతులను ఆదుకునేందుకు ఎఫ్‌సీఐ నిబంధనలు సడలించాలని, తేమశాతం ఉన్నా, లేకున్నా ధాన్యం కొనాలన్న నిబంధనలు సడలించాలని కేంద్రానికి ఎందుకు విన్నవించడం లేదని ప్రశ్నించారు. పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారం ప్రకటించిందని, కేంద్రం కూడా రూ.20 వేలు చెల్లించేలా గవర్నర్ ఎందుకు చొరవ చూపడం లేదన్నారు.

ఓఆర్ఆర్ టెండర్లను రద్దు చేయాలి

▶ మొదటి పేజీ తరువాయి



రూ.22 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని చెప్పారు. ఈ 30 ఏళ్ల ఆదాయాన్ని తనఖా పెడితే రూ.15 వేల కోట్ల రుణం ఏ బ్యాంక్ అయినా ఇస్తుందన్నారు. టెండర్లను రద్దు చేసి స్విస్ చాలెంజ్ విధానంలో బేస్ ప్రైస్ రూ. 7,388 కోట్లతో కొత్త టెండర్లను ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కొంటామన్న కేసీఆర్ తెలంగాణ ప్రజల ఆస్తిని ఎందుకు ప్రైవేటుకు కట్టబెడుతున్నారని ప్రశ్నించారు. 'ఓఆర్ఆర్ టెండర్ల వెనుక రూ.వేల కోట్లు చేతులు మారాయి. ఐఆర్బీ సంస్థను ముందు పెట్టి కేటీఆర్ ఇన్వెస్ట్‌మెంట్ మిత్రులు ఈ సంస్థలోకి వస్తారు. తద్వారా ఈ సంస్థ కేటీఆర్ చేతుల్లోకి వెళ్తుంది. రేపు కేటీఆర్ అమెరికాలో స్థిరపడినా, కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో సేద తీరుతున్నా నెలకు రూ.100 కోట్ల ఆదాయం వచ్చేలా ఓఆర్ఆర్‌ను వినియోగించుకునే ప్రయత్నం జరుగుతోంది'అని ఆరోపించారు.

మాజర్ సంస్థపై కేసులు

మాజర్ సంస్థ నివేదిక ప్రకారం టెండర్లు ఇచ్చామని మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ సమర్థించుకుంటున్నారని, కానీ ఆ సంస్థపై పలు దేశాల్లో కేసులున్నాయని రేవంత్ పేర్కొన్నారు. 'హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ 2031తో ముగుస్తుంది. 30 ఏళ్లకు లీజుకు ఇస్తే.. 2031 తర్వాత మాస్టర్ ప్లాన్ మారుతుంది. రహదారి టెండర్ 30 ఏళ్ల సుదీర్ఘ కాలానికి కాకుండా 15–20 ఏళ్ల వరకే టెండర్ వ్యవధి ఉండాలని ఎన్‌హెచ్ఏఐ సూచించింది. దాన్ని పట్టించుకోకుండా ఓఆర్ఆర్‌ను 30 ఏళ్లకు కట్టబెట్టారు'అని వివరించారు. ఏ టెండర్‌కు అయినా బేస్ ప్రైస్ నిర్ధారించి, టెండర్లను ఆహ్వానిస్తారని, ఓఆర్ఆర్ విషయంలో బేస్ ప్రైస్‌ను ఇప్పటికీ రహస్యంగా ఉంచారన్నారు.

రహస్యం ఎందుకు?

ఓఆర్ఆర్ లీజు టెండర్లను ఏప్రిల్ 11న ఓపెన్ చేశారని, కానీ హయ్యెస్ట్ బిడ్డర్ గా ఐఆర్బీ సంస్థ ఎంపికైందని, రూ.7,380 కోట్లకు 30 ఏళ్ల పాటు సంస్థ కాంట్రాక్టు దక్కించుకుందని ఏప్రిల్ 27న ప్రకటించారని రేవంత్ చెప్పారు. దీనిపై ఈ 16 రోజుల్లో ఏ గూడుపుఠాణి జరిగిందని ప్రశ్నించారు. 'ఐఆర్బీ సంస్థపై క్రిమినల్ కేసులున్నాయి. ఈ సంస్థ 2017లో కొద్దిరోజులు టోల్ నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. రోజుకు రూ.87 లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ.60 లక్షలే చెల్లిస్తుండటంతో డిపాజిట్‌గా ఉన్న రూ.25 కోట్లు సీజ్ చేసి... ఆ కంపెనీని బ్లాక్ లిస్ట్ చేశారు'అని పేర్కొన్నారు. 'ఓఆర్ఆర్ బిడ్ అవినీతిలో సూత్రధారి, పాత్రధారి అరవింద్ కుమార్. ఆయనపై స్టేట్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, కేంద్రంలోని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం. విచారణ జరిపించాలని 'కాగ్'కు కూడా ఫిర్యాదు చేస్తాం'రేవంత్‌రెడ్డి అన్నారు.

రెజ్లర్లకు ఇదేనా రివార్డ్?

సాక్షి, హైదరాబాద్: దేశ రాజధాని ఢిల్లీలో మహిళా రెజ్లర్లతో ఢిల్లీ పోలీసులు దురుసుగా ప్రవర్తించడంపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెజ్లింగ్‌లో పతకాలు తెచ్చి దేశం గర్వించేలా చేసినందుకు ప్రభుత్వం ఇచ్చే రివార్డు ఇదేనా? అంటూ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. 'మహిళా సాధికారతపై బీజేపీ బూటకపు మాటలు చెబు తుండగా, ఒక ఒలింపిక్ పతక విజేత, ఇతర రెజ్లర్లపై ఢిల్లీ పోలీసులు అర్ధరాత్రి దురుసుగా ప్రవర్తించారు. ప్రభుత్వం నిరసనకారులపై తన బలాన్ని ప్రయోగిస్తోంది. కానీ లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు!. పతకాలు తెచ్చి దేశం గర్వించేలా చేసినందుకు ఇదేనా రివార్డ్?!'అంటూ రేవంత్ ట్వీట్ చేశారు.

పొంగులేటిని బీజేపీలోకి ఆహ్వానిస్తున్నాం

- బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే దమ్మున్న ఏకైక పార్టీ బీజేపీ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్



కరీంనగర్‌టౌన్, సాక్షి, హైదరాబాద్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బీజేపీలోకి రావాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. కేసీఆర్ నియంత పాలనను వ్యతిరేకించే వాళ్లు, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలనుకునే వాళ్లంతా బీజేపీలోకి రావాలని పిలుపునిచ్చారు. ఈటల రాజేందర్‌తో విభేదాలున్నట్లు వస్తున్న వార్తలను తోసిపుచ్చారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించి బీజేపీ ఆధ్వర్యంలో రామరాజ్యాన్ని స్థాపించడమే తమ ధ్యేయమని పునరుద్ఘాటించారు. కరీంనగర్‌లో ఏడు రోజులుగా కలెక్టరేట్ ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మండుటెండలో గొడుగులు పట్టుకుని సమ్మె చేస్తున్న సమాచారం తెలుసుకున్న సంజయ్ హుటాహుటిన వారి వద్దకు వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ సహా కొందరు నేతలు పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలుస్తున్నారనే సమాచారం మీకుందా? మీలో మీకు విభేదాలున్నట్లు వార్తలొస్తున్నాయి.? అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. 'మా లక్ష్యం ఒక్కటే. మాలో విభేదాల్లేవు. అందరం కలిసి కట్టుగా ఉంటాం. బీఆర్ఎస్‌ను అడ్డు కునే దమ్ము ధైర్యమున్న పార్టీ బీజేపీ మాత్రమేనని ప్రజలు నమ్ముతున్నారు.''అని వ్యాఖ్యానించారు.

జూనియర్ కార్యదర్శులకు అండ

అసెంబ్లీ వేదికగా జూనియర్ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం అన్యాయమని సంజయ్ విమర్శించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ పక్కా టీఆర్ఎస్ తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జూనియర్ కార్యదర్శులకు బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

కర్ణాటక కాంగ్రెస్‌కు కేసీఆర్ నిధులు

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ సీఎం కేసీఆర్ నిధులు అందిస్తున్నారని సంజయ్ ఆరోపించారు. కరీంనగర్‌లోని చైతన్యపురిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్, కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా కర్ణాటకలో గెలిచేది మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వమేనని బండి ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ఆఫీసులు, నేతల ఇళ్ల ముందు నేడు హనుమాన్ చాలీసా

శుక్రవారం ఉదయం 11 గంటలకు రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు, నేతల ఇళ్ల ఎదుట శాంతియుతంగా 'హనుమాన్ చాలీసా'పఠనంతో నిరసన తెలపాలని బీజేపీ నిర్ణయించింది. కర్ణాటకలో అధికారంలోకి వస్తే భజరంగ్‌దళ్ ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ ప్రకటనపై నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చింది. గురువారం రాత్రి జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు, వివిధ మోర్చాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఈ మేరకు నిర్ణయించారు. పోలీసులు అరెస్ట్ చేస్తే అక్కడే హనుమాన్ చాలీసా పఠిస్తూ నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. భజరంగ్‌దళ్‌పై నిషేధమంటే హనుమంతుడిని చెరసాలలో బంధించడమేనని మండిపడ్డారు.

సరైన అభ్యర్థులకు కాంగ్రెస్ టికెట్లు



కార్నర్ మీటింగ్‌లో అభివాదం చేస్తున్న ఉత్తమ్‌కుమారరెడ్డి, భట్టి, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

- సరైన సమయంలో ప్రకటన
- బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ తప్పదు
- నయీమ్‌కు ఈ ప్రభుత్వానికి తేడా ఏమీలేదు
- మీడియాతో సీఎల్పీ నేత భట్టి

సాక్షి, యాదాద్రి: సరైన సమయంలో సరైన వ్యక్తులకు కాంగ్రెస్ పార్టీ టికెట్లు కేటాయిస్తుందని, నిన్న మొన్న పుట్టిన బీఆర్ఎస్ పార్టీకి వీఆర్ఎస్ తప్పదని, అందుకే అభ్యర్థులను ముందుకుగా ప్రకటించిందని సీఎల్పీ నేత భట్టివిక్రమార్క అన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా ఆయన గురువారం భువనగిరి జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. ఆరునెలల ముందు అభ్యర్థులను ప్రకటిస్తామని గతంలో ప్రకటించిన విషయాన్ని గుర్తుచేయగా భట్టివిక్రమార్క పైవిధంగా స్పందించారు. గ్యాంగ్‌స్టర్ నయీమ్ ఎన్‌కౌంటర్ తర్వాత ఆయన ఇంట్లో వేల కోట్ల రూపాయలు, భూముల పత్రాలు, బంగారం, ఆభరణాలు, వజ్రాలు దొరికినట్లు మీడియాలో ఐదారునెలలపాటు కథనాలు వచ్చినప్పటికీ ప్రభు త్వం వాటిని ఎందుకు బయట పెట్టలేదని నిలదీశారు. నయీమ్‌కు, ఈ ప్రభుత్వానికి పెద్ద తేడా ఏమీలేదని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకీ పెరిగిపోతుంటే తెలంగాణ ఎట్లా వెలిగినట్టు అవుతుందని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తిరిగి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుతో పాటు ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్, కాంతాలపల్లి, పాలమూరు–రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. ల్యాండ్ అసైన్మెంట్ కమిటీలను పునరుద్ధరణ చేసి రాష్ట్రంలో ఉన్న మిగులు భూములను పేదలకు పంచుతామని ప్రకటించారు. ధరణి వల్ల భూముల పైన హక్కులు కోల్పోయిన వారికి తిరిగి ఆ హక్కులు తీసుకురావడానికి పాత రెవెన్యూ రికార్డులో ఉన్న అన్ని కాలమ్స్‌ను తిరిగి తీసుకువస్తామని చెప్పారు.

600 కిలోమీటర్లు పూర్తి

భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 49వ రోజు గురువారం నాటికి 600 కిలోమీటర్లు పూర్తయింది. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అంతకుముందు భువనగిరి మండలం బస్వాపూర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఇందిరమ్మ కాలనీ, హుస్నాబాద్ మీదుగా భువనగిరికి చేరుకుంది. భువనగిరి వినాయక చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు.

దేశంలో కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం

రాహుల్ నాయకత్వంలో 2024లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సీఎల్పీనేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా గురువారం రాత్రి భువనగిరి వినాయక చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. నిరుద్యోగులకు భరోసా కల్పించడానికి హైదరాబాద్‌లో ఈ నెల 8న జరిగే సభకు ప్రియాంకగాంధీ హాజరవుతున్నారన్నా రు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ తరహాలో భట్టి పాదయాత్ర చేస్తున్నారని అభినందించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి విదేశాల్లో ఉన్నందున భట్టికి అభినందనలు తెలిపారని ఉత్తమ్ చెప్పారు.

'తెలంగాణ భరోసా' సక్సెస్‌కు ప్లాన్

- 7న సరూర్‌నగర్ సభకు హాజరు కానున్న బీఎస్పీ చీఫ్ మాయావతి
- జన సమీకరణపై రాష్ట్ర, జిల్లాల నాయకుల కసరత్తు
- కీలకంగా మారిన స్వేరోస్ టీంలు



సాక్షి, హైదరాబాద్: ఈసారి బీఎస్పీ నినాదంతో ముందుకు సాగుతున్న బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ భరోసా పేరుతో భారీ బహిరంగసభ నిర్వహించేందుకు సమాయత్తమవుతోంది. ఈ నెల 7వ తేదీన 'తెలంగాణ భరోసా'పేరుతో సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే ఈ సభకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరుకానున్నారు. ఐపీఎస్ అధికారిగా పదవీ విరమణ చేసిన ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ బీఎస్పీలో చేరి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి మాయావతి రాష్ట్రానికి వస్తున్నారు. సభ విజయవంతంపై ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర నేతలతో పలుమార్లు సమావేశమయ్యారు. అంతకు ముందు జిల్లాలవారీగా పర్యటనలు జరిపి మాయావతి సభను విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మాయావతి కూడా మద్దతు ఇచ్చారనే విషయాన్ని రాష్ట్ర ప్రజలకు గుర్తు చేయడంతోపాటు రాష్ట్రం ఏర్పాటైన 9 ఏళ్లలో సాధించిన ప్రగతి ఏమీ లేదని తెలియజేయడమే లక్ష్యంగా సభను భారీఎత్తున నిర్వహించాలని నిర్ణయించారు. అన్నిజిల్లాల బీఎస్పీ నాయకులతోపాటు ప్రవీణ్‌కుమార్‌ను అభిమానించే స్వేరోస్ విద్యార్థుల ఆధ్వర్యంలో సభకు పెద్దఎత్తున జనాన్ని సమీకరిస్తున్నట్లు సమాచారం.

మోసపోయిన వర్గాలకు భరోసా ఇచ్చే లక్ష్యంతోనే...

రాష్ట్రం ఏర్పాటైతే నీళ్లు, నిధులు, నియామకాలు ఉంటాయని ఆశించిన అన్నివర్గాల ప్రజలను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తన జిల్లాల పర్యటనల్లో చెబుతూ వచ్చా రు. ఉద్యోగాల కోసం ఎదురు చూసిన యువత ఎనిమిదేళ్లలో నిరాశకు గురయ్యారని, ఇటీవలి టీఎస్‌పీఎస్సీ పరీక్షల లీకేజీ వ్యవహారంతో మరింత తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. యువతతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలవారు తీవ్ర నిరాశలో ఉన్నారని, వీరందరికి భరోసా ఇవ్వడమే సభ లక్ష్యమని అన్నారు. వ్యవసాయా న్ని నమ్ముకున్న రైతులు, రైతుకూలీలు ఆగమవుతున్నారని, సరైన వ్యవసాయ విధానం లేకపోవడం వల్లే అకాల వర్షాలకు రాష్ట్రంలో పంటలు 50 శాతానికి పైగా నాశనమయ్యాయని విచారం వ్యక్తం చేశారు. అస్తవ్యస్త విధానాలతో రాష్ట్రం అప్పుల పాలవ్వడమేనా తెలంగాణ సాధించిన ప్రగతి అని ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో అన్నివర్గాలకు అండగా నిలిచే బీఎస్పీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యమని స్పష్టం చేశారు. 'ఈసారి బీఎస్పీ'అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని, మాయావతి సభ కేసీఆర్ ప్రభుత్వ పతనానికి నాంది అని పేర్కొన్నారు.



బోరిస్ గెల్ఫాండ్‌పై అర్జున్ గెలుపు

టెపి సెగెమన్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ శుభారంభం చేశాడు. స్వీడన్‌లో గురువారం మొదలైన ఈ టోర్నీలో మొత్తం ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య ఏడు రౌండ్లు జరుగుతాయి. తొలి రౌండ్‌లో 19 ఏళ్ల అర్జున్ 41 ఎత్తుల్లో ఇజ్రాయెల్ గ్రాండ్‌మాస్టర్ బోరిస్ గెల్ఫాండ్‌పై గెలుపొందాడు. 54 ఏళ్ల గెల్ఫాండ్ 2012 ప్రపంచ చాంపియన్‌షిప్ ఫైనల్లో విశ్వనాథన్ ఆనంద్ చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచాడు.



లిటన్ దాస్ స్థానంలో చార్లెస్

కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టులో వెస్టిండీస్ వికెట్ కీపర్ బ్యాటర్ జాన్సన్ చార్లెస్ చేరనున్నాడు. బంగ్లా ఆటగాడు లిటన్‌దాస్ కుటుంబసభ్యుల ఆరోగ్య అత్యవసర పరిస్థితి దృష్ట్యా స్వదేశం పయనమయ్యాడు. దీంతో మిగతా సీజన్ కోసం అతని స్థానంలో చార్లెస్‌ను రూ.50 లక్షల కనీస ధరకు కోల్‌కతా తీసుకుంది. విండీస్ తరఫున 41 అంతర్జాతీయ టి20లు ఆడిన అతను 971 పరుగులు చేశాడు. 2012, 2016 టి20 ప్రపంచకప్‌లు గెలిచిన కరీబియన్ జట్టులో చార్లెస్ సభ్యుడుగా ఉన్నాడు.

ఫైనల్లో బోపన్న జోడీ



మాడ్రిడ్: ఈ సీజన్‌లో తమ అద్భుత ప్రదర్శన కొనసాగిస్తూ రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ నాలుగో టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించింది. మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టోర్నీలో భాగంగా గురువారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 5–7, 7–6 (7/3), 10–4తో 'సూపర్ టైబ్రేక్'లో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)–రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జోడీని ఓడించింది. మాడ్రిడ్ మాస్టర్స్ టోర్నీలో బోపన్న ఫైనల్ చేరడం ఇది మూడోసారి. 2015లో ఈ టోర్నీలో టైటిల్ నెగ్గిన బోపన్న, 2016లో రన్నరప్‌గా నిలిచాడు. ఏడేళ్ల తర్వాత మరోసారి ఈ టోర్నీలో టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. ఈ సీజన్‌లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో, దోహా ఓపెన్‌లో టైటిల్ సాధించి, రోటర్‌డామ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచింది.

మళ్లీ పాక్‌దే గెలుపు

12 ఏళ్ల తర్వాత కివీస్‌పై వన్డే సిరీస్ సొంతం



కరాచీ: వరుసగా మూడో వన్డేలోనూ గెలుపొందిన పాకిస్తాన్ రెండు మ్యాచ్‌లుండగానే 3–0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. బుధవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన మూడో వన్డేలో పాక్ 26 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై నెగ్గింది. తద్వారా 12 ఏళ్ల అనంతరం కివీస్‌పై పాక్ వన్డే సిరీస్‌ను దక్కించుకుంది. మొదట పాకిస్తాన్ 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసింది. ఓపెనర్ ఇమామ్ ఉల్ హఖ్ (107 బంతుల్లో 90; 7 ఫోర్లు, 1 సిక్స్), బాబర్ అజమ్ (62 బంతుల్లో 54; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. కివీస్ బౌలర్లలో హెన్రీ 3, మిల్నే 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన న్యూజిలాండ్ 49.1 ఓవర్లలో 261 పరుగులకు కుప్పకూలింది. బ్లన్‌డేల్ (78 బంతుల్లో 65; 7 ఫోర్లు), యంగ్ (41 బంతుల్లో 33; 3 ఫోర్లు) తొలి వికెట్‌కు 83 పరుగుల శుభారంభం ఇచ్చినప్పటికీ వరుస విరామాల్లో కీలకమైన వికెట్లను కోల్పోయి లక్ష్యానికి దూరమైంది. షాహీన్ అఫ్రిది, నసీమ్ షా, వసీమ్ తలా 2 వికెట్లు తీశారు.

కోల్‌కతా ప్రతీకారం

- ఉత్కంఠ పోరును జయించిన నైట్‌రైడర్స్
- 5 పరుగులతో సన్‌రైజర్స్ ఓటమి

సన్‌రైజర్స్ విజయానికి ఒకదశలో 30 బంతుల్లో 38 పరుగులే కావాలి... చేతిలో 5 వికెట్లు ఉన్నాయి. కెప్టెన్ మార్క్‌రమ్ కూడా అప్పుడే జోరు పెంచాడు... సొంత గడ్డపై గెలుపు ఖాయమనిపించింది. కానీ అంతా తలకిందులైంది. ఓటమి దిశగా వెళుతున్న కోల్‌కతా ఒక్కసారిగా పుంజుకుంది. పదునైన బౌలింగ్‌తో పరుగులు ఇవ్వకుండా కట్టడి చేసి చివరి వరకు ఆటను తీసుకొచ్చింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వరుణ్ చక్రవర్తి వేసిన ఆఖరి ఓవర్లో 9 పరుగులు చేయాల్సి ఉండగా 3 పరుగులే వచ్చాయి. దాంతో నైట్‌రైడర్స్ ఊపిరి పీల్చుకోగా, రైజర్స్ నిరాశలో మునిగింది.



వరుణ్ చక్రవర్తి

సాక్షి, హైదరాబాద్: ఈడెన్ గార్డెన్స్‌లో ఎదురైన పరాజయానికి ఉప్పల్ స్టేడియంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ప్రతీకారం తీర్చుకుంది. గురువారం జరిగిన ఈ ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా 5 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. రింకూ సింగ్ (35 బంతుల్లో 46; 4 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ రాణా (31 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. అనంతరం హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 166 పరుగులే చేయగలిగింది. మార్క్‌రమ్ (40 బంతుల్లో 41; 4 ఫోర్లు), క్లాసెన్ (20 బంతుల్లో 36; 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించినా ఫలితం దక్కలేదు.



రింకూ సింగ్

కీలక భాగస్వామ్యం...

ఒక్కరూ విధ్వంసక ఇన్నింగ్స్ ఆడకపోయినా... కీలక ఆటగాళ్లంతా తలా ఓ చేయి వేయడంతో కోల్‌కతా చెప్పుకోదగ్గ స్కోరు సాధించగలిగింది. మార్కో జాన్సెన్ తన తొలి ఓవర్లోనే గుర్బాజ్ (0), వెంకటేశ్ అయ్యర్ (7)లను అవుట్ చేసి ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. జేసన్ రాయ్ (19 బంతుల్లో 20; 4 ఫోర్లు) కూడా ధాటిగా ఆడటంలో విఫలమయ్యాడు. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 43 పరుగులకు చేరింది. ఈ దశలో కెప్టెన్ రాణా, రింకూ కీలక భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 40 బంతుల్లో 61 పరుగులు జోడించారు. కార్తీక్ త్యాగి ఓవర్లో వరుస బంతుల్లో 4, 6, 6తో రాణా దూకుడు ప్రదర్శించాడు. అయితే మార్క్‌రమ్ అద్భుత క్యాచ్‌కు రాణా వెనుదిరగ్గా... ఆండ్రీ రసెల్ (15 బంతుల్లో 24; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కూడా ఎక్కువసేపు నిలవలేదు. సన్‌రైజర్స్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఇన్నింగ్స్ చివర్లో కూడా కేకేఆర్ ఆశించినన్ని పరుగులు చేయలేకపోయింది. ఆఖరి 5 ఓవర్లలో ఆ జట్టు 42 పరుగులే సాధించింది.

క్లాసెన్ మెరిసినా...

ఛేదనలో రైజర్స్ కూడా తడబడింది. ఓపెనర్లు మయాంక్ అగర్వాల్ (18), అభిషేక్ శర్మ (9)లతో పాటు తక్కువ వ్యవధిలో రాహుల్ త్రిపాఠి (9 బంతుల్లో 20; 3 ఫోర్లు, 1 సిక్స్), హ్యారీ బ్రూక్ (0) వికెట్లను జట్టు కోల్పోయింది. అయితే మార్క్‌రమ్, క్లాసెన్ భాగస్వామ్యం ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. చక్కటి షాట్లతో, సమన్వయంతో వీరిద్దరు పరుగులు రాబట్టారు. తన తొలి ఫోర్ కొట్టేందుకు మార్క్‌రమ్ 23 బంతులు తీసుకున్నా... అనుకూల్ రాయ్ ఓవర్లో రెండు సిక్సర్లతో క్లాసెన్ దూకుడు ప్రదర్శించాడు. ఐదో వికెట్‌కు 47 బంతుల్లో 70 పరుగులు జోడించిన అనంతరం క్లాసెన్ వెనుదిరిగాడు. అయితే మార్క్‌రమ్ క్రీజ్‌లో ఉన్నంత వరకు రైజర్స్ గెలుపుపై ధీమాగానే ఉంది. 20 బంతుల్లో 27 పరుగులు చేయాల్సిన స్థితిలో కెప్టెన్ వెనుదిరిగారు. తర్వాతి బ్యాటర్లు మిగిలిన పనిని పూర్తి చేయలేకపోయారు. సమద్ (18 బంతుల్లో 21; 3 ఫోర్లు) కొంత పోరాడినా లాభం లేకపోయింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	9	6	3	0	12	0.532
లక్నో	10	5	4	1	11	0.639
చెన్నై	10	5	4	1	11	0.329
రాజస్తాన్	9	5	4	0	10	0.800
బెంగళూరు	9	5	4	0	10	-0.030
ముంబై	9	5	4	0	10	-0.373
పంజాబ్	10	5	5	0	10	-0.472
కోల్‌కతా	10	4	6	0	8	-0.103
హైదరాబాద్	9	3	6	0	6	-0.540
ఢిల్లీ	9	3	6	0	6	-0.768

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ × గుజరాత్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జేసన్ రాయ్ (సి) మయాంక్ అగర్వాల్ (బి) కార్తీక్ త్యాగి 20; గుర్బాజ్ (సి) బ్రూక్ (బి) జాన్సెన్ 0; వెంకటేశ్ అయ్యర్ (సి) క్లాసెన్ (బి) జాన్సెన్ 7; నితీశ్ రాణా (సి అండ్ బి) మార్క్‌రమ్ 42; రింకూ సింగ్ (సి) సమద్ (బి) నటరాజన్ 46; రసెల్ (సి) నటరాజన్ (బి) మార్కండే 24; నరైన్ (సి) మయాంక్ అగర్వాల్ (బి) భువనేశ్వర్ 1; శార్దుల్ ఠాకూర్ (సి) సమద్ (బి) నటరాజన్ 8; అనుకూల్ రాయ్ (నాటౌట్) 13; హర్షిత్ (రనౌట్) 0; వైభవ్ అరోరా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1–8, 2–16, 3–35, 4–96, 5–127, 6–130, 7–151, 8–168, 9–168. **బౌలింగ్:** భువనేశ్వర్ 4–0–33–1, జాన్సెన్ 3–0–24–2, కార్తీక్ త్యాగి 2–0–30–1, మార్క్‌రమ్ 3–0–24–1, నటరాజన్ 4–0–30–2, మార్కండే 4–0–29–1.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) రసెల్ (బి) శార్దుల్ ఠాకూర్ 9; మయాంక్ అగర్వాల్ (సి) గుర్బాజ్ (బి) హర్షిత్ 18; రాహుల్ త్రిపాఠి (సి) వైభవ్ అరోరా (బి) రసెల్ 20; మార్క్‌రమ్ (సి) రింకూ సింగ్ (బి) వైభవ్ అరోరా 41; హ్యారీ బ్రూక్ (ఎల్బీ) (బి) అనుకూల్ రాయ్ 0; క్లాసెన్ (సి) రసెల్ (బి) శార్దుల్ ఠాకూర్ 36; సమద్ (సి) అనుకూల్ రాయ్ (బి) వరుణ్ చక్రవర్తి 21; జాన్సెన్ (సి) గుర్బాజ్ (బి) వైభవ్ అరోరా 1; భువనేశ్వర్ (నాటౌట్) 5; మార్కండే (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 166. వికెట్ల పతనం:** 1–29, 2–37, 3–53, 4–54, 5–124, 6–145, 7–152, 8–165. **బౌలింగ్:** హర్షిత్ 4–0–27–1, వైభవ్ 3–0–32–2, శార్దుల్ 3–0–23–2, రసెల్ 1–0–15–1, అనుకూల్ రాయ్ 3–0–26–1, నరైన్ 2–0–16–0, వరుణ్ చక్రవర్తి 4–0–20–1.

ఎఫ్‌ఐఆర్ నమోదు కావడంతో కేసు ముగిస్తున్నాం: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న రెజ్లర్ల డిమాండ్ నెరవేరడంతో కేసును ముగిస్తున్నామని సుప్రీంకోర్టు తెలిపింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఢిల్లీ పోలీసులు బ్రిజ్‌భూషణ్‌పై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. కానీ సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో ఆయనను అరెస్టు చేయలేకపోయామని తెలిపారు. సుప్రీంకోర్టు నిర్ణయం తమకు ఎదురుదెబ్బ కాదని, బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేసే వరకు తమ నిరసన కొనసాగుతుందని బజరంగ్, వినేశ్, సాక్షి స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే ఢిల్లీ హైకోర్టుకు వెళ్లాలని సుప్రీంకోర్టు సూచించిందని దీనిని కూడా పరిశీలిస్తామని వినేశ్ తెలిపింది.

నరేందర్ ముందుకు...

శివ థాపాకు చుక్కెదురు



తాష్కెంట్: ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నాలుగో రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. నరేందర్ బెర్వాల్ (ప్లస్ 92 కేజీలు), గోవింద్ సహని (48 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... దీపక్ కుమార్ (51 కేజీలు) రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. అయితే స్టార్ బాక్సర్ శివ థాపా పోరాటం రెండో రౌండ్‌లోనే ముగిసింది. తొలి రౌండ్ బౌట్‌లలో నరేందర్ 4–1తో మొహమ్మద్ అబ్రోరిదినోవ్ (తజికిస్తాన్)పై, గోవింద్ 5–0తో మెహ్రోన్ షఫియెవ్ (తజికిస్తాన్)పై, దీపక్ 5–0తో లూయిస్ డెల్గాడో (ఈక్వెడోర్)పై విజయం సాధించారు. 2015 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గిన శివ థాపా ఈసారి మాత్రం నిరాశపరిచాడు. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా రెండో రౌండ్‌లో బరిలోకి దిగిన శివ థాపా 3–4తో డోస్ రెస్ యురీ (బ్రెజిల్) చేతిలో పోరాడి ఓడిపోయాడు. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్ బౌట్‌లలో భారత బాక్సర్లు హుసాముద్దీన్ (57 కేజీలు), ఆశిష్ చౌదరీ (80 కేజీలు), నవీన్ (92 కేజీలు) పోటీపడతారు.

సినిమా





● చిరంజీవి ● సిద్ధు జొన్నలగడ్డ

కాంబినేషన్ సెట్?

హీరో చిరంజీవి, దర్శకుడు కల్యాణ్ కృష్ణ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కేందుకు రంగం సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఆల్రెడీ చిరంజీవికి కల్యాణ్ కృష్ణ ఓ కథ వినిపించారట. ఈ స్క్రిప్ట్ చిరంజీవికి నచ్చిందని, త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిసింది. అయితే ఈ సినిమా కథ రీత్యా ఓ కుర్ర హీరోకి కీలక పాత్రలో నటించేందుకు స్కోప్ ఉందట. ఈ కుర్ర హీరో పాత్రకు సిద్ధు జొన్నలగడ్డ అయితే బాగుంటుందని చిత్ర యూనిట్ భావిస్తోందని, ఆల్రెడీ సంప్రదింపులు జరిగాయని భోగట్టా. త్వరలోనే ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే.. చిరంజీవి టైటిల్ రోల్‌లో మెహర్ రమేష్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'భోళా శంకర్' ఆగస్టు 11న విడుదల కానున్న విషయం తెలిసిందే.



● రజనీకాంత్

ఆగస్ట్‌లో ఫిక్స్

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'జైలర్'. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా రిలీజ్‌కు సంబంధించిన ఓ అప్‌డేట్‌ను గురువారం చిత్ర యూనిట్ ఇచ్చింది. ఆగస్ట్ 10న 'జైలర్'ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, ఓ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. వీడియోలో కారులో నుంచి స్టైల్‌గా దిగుతున్న రజనీకాంత్ లుక్ ఆకట్టుకుంటోంది. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్‌కు పూర్తి భిన్నంగా థ్రిల్లర్ తరహాలో ఈ సినిమా తెరకెక్కుతోందని కోలీవుడ్ టాక్. శివరాజ్‌కుమార్, మోహన్ లాల్, జాకీ ష్రాఫ్, రమ్యకృష్ణ, తమన్నా, సునీల్, ప్రియాంక అరుల్ మోహన్, మిర్నా మీనన్ తదితరులు ముఖ్య పాత్రలు చేస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్.

ఉగ్రం నా కెరీర్ హయ్యస్ట్ గ్రాసర్ ఫిల్మ్ అవుతుంది

– 'అల్లరి' నరేశ్



● సాహు, విజయ్, 'అల్లరి' నరేశ్, హరీష్

"నేను పోలీసాఫీసర్‌గా చేసిన 'కత్తి కాంతారావు', 'బ్లేడ్ బాజ్జీ' చిత్రాలు విజయాలు సాధించాయి. అయితే ఇవి కామెడీ చిత్రాలు. కాగా నేను సీరియస్ పోలీస్ పాత్ర చేసిన 'ఉగ్రం' సినిమా కూడా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. 'ఉగ్రం' నా కెరీర్‌లో హయ్యస్ట్ గ్రాసర్ ఫిల్మ్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు 'అల్లరి' నరేశ్. 'నాంది' తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, దర్శకుడు విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఉగ్రం'. హరీష్ పెద్ది, సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో 'అల్లరి' నరేశ్ మాట్లాడుతూ– ''గతంలో నేను చేసిన ఫైట్స్ నవ్వించడం కోసం... ఈ సినిమాలో ఎమోషన్ కోసం యాక్షన్ సీన్స్ చేశాను'' అన్నారు. ''నాంది' సినిమాకు మూడురెట్ల వసూళ్లు 'ఉగ్రం' సినిమా రాబడుతుందనే నమ్మకం ఉంది'' ఉన్నారు విజయ్ కనకమేడల. ''భారతదేశ వ్యాప్తంగా మిస్సింగ్ కేసులు నమోదు అవుతున్నాయి. మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో మనకన్నా ఎక్కువ మిస్సింగ్స్ ఉన్నట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. పక్కా ఆధారాలతో వాస్తవ ఘటనలను బేస్ చేసుకుని 'ఉగ్రం' కథ రెడీ చేశాం'' అన్నారు రచయిత వెంకట్.

కామెడీ సినిమాలు చేయడానికి నేను సిద్ధమే. నా తర్వాతి సినిమా కామెడీ జానర్‌లోనే ఉంటుంది. అయితే కొందరు నాకు కామెడీ కథలు చెప్పేటప్పుడు వాళ్లకు వాళ్లే ఎగ్జయిట్ అయ్యి, నవ్వేసుకుంటున్నారు. నాకు నవ్వు రావడం లేదు. ఆడియన్స్ ఆర్గానిక్ కామెడీని ఇష్టపడుతున్నారు. ఇప్పుడు నేను 'కితకితలు' సినిమా చేస్తే బాడీ షేమింగ్ అని తిడతారు. కుటుంబసమేతంగా చూసే కామెడీ సినిమాలు తీయాలన్నప్పుడు అందులో అసభ్య పదజాలం, డబుల్ మీనింగ్ డైలాగ్స్ ఉండకూడదు. చెప్పాలంటే కామెడీ సినిమాల రైటర్స్ తగ్గిపోయారు.
– 'అల్లరి' నరేశ్

ఫారిన్‌లో ఫైట్



● వరుణ్ తేజ్

ఫారిన్ ఫైట్ చేయడానికి రెడీ అవుతున్నారు వరుణ్ తేజ్. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'గాండీవ ధారి అర్జున'. సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ బుడాపెస్ట్‌లో ఆరంభం కానుంది. ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఈ ఫైట్ సీక్వెన్స్ కోసం వరుణ్ తేజ్ ప్రస్తుతం ప్రిపేర్ అవుతున్నారు.

అంతం కాదిది...




● జేడీ చక్రవర్తి, సిరాజ్

ఇషాన్, ప్రణాళి, 'రాకెట్' రాఘవ, ప్రవీణ్, 'కరాటే' కళ్యాణి, గీతా సింగ్, నాగ మహేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అంతం కాదిది ఆరంభం'. ఇషాన్ దర్శకత్వంలో ప్రభు పాల్‌రాజ్, సిరాజ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ అండ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసిన జేడీ చక్రవర్తి మాట్లాడుతూ– ''టైటిల్‌ని బట్టి ఇది మంచి సినిమా అని నమ్ముతున్నాను. ఈ చిత్రం విజయం సాధించి యూనిట్‌కి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడిస్తామని యూనిట్ పేర్కొంది.

తరాలు మారినా ఎమోషన్స్ మారలేదు

– గోపీచంద్

"వందేళ్ల క్రితం అమ్మను 'అమ్మ' అనే పిలిచాం. ఇప్పుడూ అమ్మా అనే పిలుస్తాం. తరాలు మారినా ఎమోషన్స్ మారలేదు. అలాగే సినిమాల విషయంలో ఆడియన్స్ మారలేదు. సరైన కంటెంట్ ఇస్తే ఆడియన్స్ సినిమాలు చూస్తున్నారు. అయితే కథలో ఆడియన్స్‌ను మనం ఎంతవరకు ఇన్‌వాల్వ్ చేయగలుగుతున్నాం అన్నదే ముఖ్యం. వారు కనెక్ట్ అయ్యే ఏ జానర్ సినిమా తీసినా వాటిని ఆదరిస్తారు" అన్నారు హీరో గోపీచంద్. 'లక్ష్యం', 'లౌక్యం' చిత్రాల తర్వాత హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'రామబాణం'. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో గోపీచంద్ చెప్పిన విశేషాలు....



● ఈ మధ్య నేను ఎక్కువగా యాక్షన్ చిత్రాలే చేశాను. ఫ్యామిలీ ఎలిమెంట్స్ ఉన్న సినిమా చేయాలని అనుకుంటున్నప్పుడు భూపతిరాజా గారు చెప్పిన కథ, అందులోని బ్రదర్ ఎమోషన్స్ నచ్చడంతో 'రామబాణం' సినిమా చేశాం. హిట్ చిత్రాలు 'లక్ష్యం', 'లౌక్యం'ల తర్వాత శ్రీవాస్, నేను మరో సినిమా చేయాలని 'రామబాణం' చేయలేదు. కథ కుదిరింది కాబట్టి చేశాం. ● 'రామబాణం' అన్నదమ్ముల కథ. ఇద్దరి స్వభావం ఒకటే. కానీ ఎంచుకున్న దారులు వేరు. మంచి ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కమర్షియల్ హంగులు జోడించి ఈ సినిమా చేశాం. అలాగే అంతర్లీనంగా ఓ సందేశం కూడా ఉంది. ఓ సమస్యను మనం కొన్నేళ్లు పట్టించుకోకుండా ఉంటే దాని దుష్ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. అప్పుడు బాధ పడతాం. ఈ విషయాన్నే 'రామబాణం'లో చూపించాం. ● 'లక్ష్యం' సినిమాలో జగపతిబాబుగారితో స్క్రీన్ షేర్ చేసుకున్నాను. ఆ సినిమాలో అన్నదమ్ముల్లా నటించిన మేం 'రామబాణం'లోనూ అన్నదమ్ముల్లా నటించాం. ఈ సినిమాలో జగపతిబాబుగారిది కీలక పాత్ర. హీరోగా నా క్యారెక్టర్ పెంచేసి, ఆయన క్యారెక్టర్‌ను తగ్గించడం అనేది కరెక్ట్ కాదు. ఎందుకంటే సినిమాకు కథే హీరో. కథే సినిమాను నడిపించాలి. ● టీజీ విశ్వప్రసాద్ గారు మంచి నిర్మాత. ఇండస్ట్రీలో అతి మంచితనం మంచిది కాదని నేను ఆయనకు చెప్పాను. ఎందుకంటే ఆయన చాలా సినిమాలు చేస్తున్నారు. అలాంటి వారు ఇండస్ట్రీలో ఉంటే చాలా మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ● ప్రస్తుతం కన్నడ దర్శకుడు హర్షతో ఓ సినిమా చేస్తున్నాను. ఆ తర్వాత దర్శకులు శ్రీను వైట్ల, తేజగార్లతో సినిమాలు ఉంటాయి.

గతంలో నేను 'ఒక్కడున్నాడు', 'సాహసం' వంటి విభిన్నమైన సినిమాలు చేశాను. ఆ సినిమాలు ఇప్పుడు వచ్చి ఉంటే హిట్ అయ్యేవి. అయితే ఆ తరహా సినిమాల్లో నాకు నటించాలని ఉన్నా సరైన కథలు దొరకడం లేదు.

హిట్ సినిమాలు అందించాలనే ఒత్తిడి నాకే కాదు... ప్రతి హీరోకూ ఉంటుంది. ఎందుకంటే ఓ సినిమా ఫలితంపై ఎన్నో కుటుంబాలు (ముఖ్యంగా బయ్యర్లు, డిస్ట్రిబ్యూటర్స్‌ని ఉద్దేశిస్తూ..) ఆధారపడి ఉంటాయి. అయితే కొన్నిసార్లు హిట్ అవుతాయని మేం భావించిన సినిమాలు సరైన ఫలితాలను ఇవ్వకపోవచ్చు. తప్పులను విశ్లేషించుకుని అవి రిపీట్ కాకుండా చూసుకోవాలి. నాకు వచ్చిన ప్రతి రోల్‌ని డ్రీమ్ రోల్‌లా భావిస్తాను.

నా కెరీర్ స్టార్టింగ్‌లో 'జయం', 'నిజం', 'వర్షం' చిత్రాల్లో విలన్ రోల్స్ చేశాను. ఇండస్ట్రీలో ముందు నన్ను నిలబెట్టింది విలన్ రోల్సే. ప్రభాస్ సినిమాలో విలన్ పాత్ర చేయడానికి సిద్ధంగానే ఉన్నాను. అయితే కథ, అందులోని విలన్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉండాలి.

సామాజిక బాధ్యతతో...

వినోద్ హీరోగా, రిచా కర్లా, ధరణి రెడ్డి హీరోయిన్లుగా రవికుమార్ గోనుగుంట దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మహిషాసురుడు'. అనిరుధ్, అపరాజిత సమర్పణలో ప్రముఖ కార్డియాలజిస్ట్ ఎస్. గురుప్రసాద్ నిర్మించారు. సాకేత్ సాయిరామ్ సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియోను దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, డైరెక్టర్ రేలంగి నరసింహారావు, నటులు తనికెళ్ల భరణి, గౌతం రాజు విడుదల చేశారు. ఎస్. గురుప్రసాద్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో ప్రధాన పాత్ర చేశాను. కోట్లాది రూపాయలు ఖర్చయ్యే వైద్య పరికరాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బదులు మన దేశంలోనే వాటిని తయారు చేసుకుంటే తక్కువ ఖర్చుతో వైద్యం అందించవచ్చనే పాయింట్‌తో ఈ సినిమా తీశాం'' అన్నారు. ''సామాజిక బాధ్యతతో గురుప్రసాద్ ఈ సినిమా నిర్మించాలనుకున్నారు'' అన్నారు రవికుమార్ గోనుగుంట.



● రిచా, గురుప్రసాద్

గాలుల్లోన...



● సుధీర్‌బాబు, ఈషా రెబ్బా

సుధీర్ బాబు హీరోగా రూపొందిన చిత్రం 'మామా మశ్చీంద్ర'. నటుడు, దర్శకుడు హర్షవర్ధన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మృణాలినీ రవి, ఈషా రెబ్బా కథానాయికలు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించారు. చేతన్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'గాలుల్లోన...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించిన ఈ పాటను కపిల్ కపిలన్, నూతన మోహన్ పాడారు. ''ఈ చిత్రంలో మూడు పాత్రల్లో కనిపించనున్నారు సుధీర్ బాబు. 'గాలుల్లోన...' అనే పాటలో దుర్గ, డిజే పాత్రల్లో ఆకట్టుకుంటారాయన. తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మించాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సర్పంచ్‌లకు అంకితం



● శంకర్ నాయక్

రజినీ కుమార్, జీవన్ కుమార్ హీరోలుగా, సపాన్స్ హీరోయిన్‌గా కొర్ర శంకర్ నాయక్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'అయ్యో పాపం'. ప్రసాద్ రాజు ముప్పాల నిర్మాత. సంగీత దర్శకుడు భాను స్వరపరచిన ఈ చిత్రంలోని 'మా మంచి సర్పంచి మా శంకరన్న.. మాట తప్పని వాడు మన శంకరన్న..' పాటని విడుదల చేశారు. కొర్ర శంకర్ నాయక్ మాట్లాడుతూ– ''తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతోన్న చిత్రం 'అయ్యో పాపం'. తెలంగాణలో 12,000, ఆంధ్రప్రదేశ్‌లో 13,000 మంది సర్పంచ్‌ల సాధక బాధకాల ఇతివృత్తంగా రాసిన ఈ పాటని సర్పంచ్‌లకు అంకితం చేస్తున్నాం'' అన్నారు. ''సమాజంలో, కుటుంబాల్లో జరుగుతున్న ఘటనల నేపథ్యంలో రూపొందుతోన్న సందేశాత్మక చిత్రం ఇది'' అన్నారు రజినీ కుమార్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	556	61,749
నిఫ్టీ ▲	166	18,256

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తెలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,011	▽	14
డోజోన్స్	33,145	▽	269
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,703	▽	86
డాక్స్	15,134	▽	81
షాంఘై	3,350	▲	27
నికాయ్ (మంగళవారం ముగింపు)	29,158	▲	35

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో ముంబై		
బంగారం (99.9 గ్రాములు)	61,646	▲ 602
బంగారం (99.5 గ్రాములు)	61,400	▲ 600
వెండి (కిలో)	76,464	▲ 1,182

అంచనాలను మించిన హెచ్‌డీఎఫ్‌సీ

- నికర లాభంలో 20 శాతం వృద్ధి
- జూలై చివరికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో విలీనం



ముంబై: గృహ రుణాల్లో అగ్రగామి సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ మార్చి త్రైమాసికానికి బలమైన పనితీరు నమోదు చేసింది. స్టాండలోన్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 20 శాతం వృద్ధితో రూ.4,425 కోట్లకు చేరింది. ఇది విశ్లేషకుల అంచనాలను మించి నమోదైంది. విశ్లేషకులు రూ.3,900 కోట్ల స్థాయిలో ఉండొచ్చని అంచనా వేశారు. క్రితం ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.3,700 కోట్లుగా ఉంది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 16 శాతం వృద్ధితో రూ.5,321 కోట్లకు దూసుకుపోయింది. నికర వడ్డీ మార్జిన్ 3.7 శాతంగా ఉంది. అంతక్రితం ఏడాది ఇదే కాలానికి ఇది రూ.4,601 కోట్లుగా ఉంది. 2022–23 సంవత్సరానికి ఒక్కో షేరుపై రూ.44ను మధ్యంతర డివిడెండ్‌గా ఇవ్వాలని కంపెనీ నిర్ణయించింది. ఆర్‌బీఐ రేట్ల పెంపుతో నికర వడ్డీ ఆదాయంపై ప్రభావం పడినట్టు తెలిపింది. ఇక, 2022–23 ఆర్థిక సంవత్సరానికి స్టాండలోన్ నికర లాభం 18 శాతం వృద్ధితో రూ.16,239 కోట్లకు చేరింది. వసూళ్లు లేని నికర రుణాల నిష్పత్తి క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న 1.91 శాతం నుంచి 1.18 శాతానికి తగ్గింది.

దండిగా నిధులు..

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో హెచ్‌డీఎఫ్‌సీ విలీనం జూలై చివరికి పూర్తి అవుతుందని హెచ్‌డీఎఫ్‌సీ వైస్ చైర్మన్, సీఈవో కేకీ మిస్త్రీ తెలిపారు. తాము ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఉండాల్సిన దాని కంటే ఎక్కువే స్టాట్యుటరీ లిక్విడిటీ రేషియో నిర్వహిస్తున్నామని, అవసరానికంటే ప్రభుత్వ సెక్యూరిటీల్లో 128 శాతం పెట్టుబడులు ఉన్నట్టు చెప్పారు. అదనపు నిధుల విలీనం విషయంలో సానుకూలంగా పనిచేస్తాయని కేకీ మిస్త్రీ తెలిపారు.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభం రెట్టింపు

క్యూ4లో రూ. 722 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 722 కోట్లను దాటింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 304 కోట్లు ఆర్జించింది. ప్రధానంగా విమానాశ్రయాలు, రహదారుల బిజినెస్‌లు లాభాల్లో వృద్ధికి దోహదం చేశాయి. మొత్తం ఆదాయం సైతం రూ. 25,142 కోట్ల నుంచి రూ. 31,716 కోట్లకు జంప్ చేసింది. 7 ఎయిర్‌పోర్టులలో ప్రయాణికుల సంఖ్య 74 శాతం ఎగసి 21.4 మిలియన్లను తాకగా.. కార్గో 14 శాతం బలపడింది. ఈ బాటలో రహదారులు, మైనింగ్ బిజినెస్‌లు లాభదాయకతకు సహకరించినట్లు కంపెనీ పేర్కొంది. దేశీయంగానేకాకుండా, ప్రపంచ స్థాయిలో విజయవంతమైన వ్యాపారాభివృద్ధికి కంపెనీ ప్రతీకగా అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ పేర్కొన్నారు. నిర్వహణ, ఆర్థిక పటిష్టతకు గతేడాది ఫలితాలు కొలమానమని విశ్లేషించారు. పాలన, నిబంధనల అమలు, పనితీరు, నగదు ఆర్జనలపై ప్రత్యేక దృష్టి కొనసాగుతుందని తెలియజేశారు. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి సైతం అదానీ ఎంటర్‌ప్రైజెస్ నికర లాభం 218 శాతం దూసుకెళ్లి రూ. 2,473 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 96 శాతం జంప్‌చేసి రూ. 1,38,175 కోట్లను తాకింది. నిర్వహణ లాభం(ఇబిటా) రెట్టింపునకుపైగా వృద్ధితో రూ. 10,025 కోట్లయ్యింది. ఎయిర్‌పోర్ట్స్‌లో ప్రయాణికుల సంఖ్య 74.8 మిలియన్లకు చేరింది. 2023 మార్చికల్లా కంపెనీ స్థూల రుణభారం రూ. 41,024 కోట్ల నుంచి తగ్గి రూ. 38,320 కోట్లకు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 4.7 శాతం జంప్‌చేసి రూ. 1,925 వద్ద ముగిసింది.

ఈ-స్కూటర్ కస్టమర్లకు చార్జర్ డబ్బు వాపస్

తిరిగివ్వనున్న ఓలా ఎలక్ట్రిక్, ఏథర్



న్యూఢిల్లీ: విద్యుత్ వాహనాలతో పాటు చార్జర్లను విడిగా కొనుగోలు చేసిన కస్టమర్లకు సదరు చార్జర్ల డబ్బును వాపసు చేయనున్నట్లు ఓలా ఎలక్ట్రిక్, ఏథర్ ఎనర్జీ తెలిపాయి. ఎలక్ట్రిక్ వాహనాల వ్యవస్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి. స్వార్థ శక్తులు ఎన్ని అడ్డంకులు సృష్టించినప్పటికీ విద్యుత్ వాహనాల పరిశ్రమ గత కొన్నాళ్లుగా అసాధారణంగా వృద్ధి చెందినట్లు సోషల్ మీడియా సైట్ ట్విటర్‌లో ఓలా పేర్కొంది. ఈ నేపథ్యంలో కస్టమర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన కస్టమర్లందరికీ చార్జర్ల డబ్బును తిరిగి ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొంది. అయితే, ఎంత మొత్తం చెల్లించనున్నదీ మాత్రం వెల్లడించలేదు. ఇది సుమారు రూ. 130 కోట్లు ఉండొచ్చని అంచనాలు నెలకొన్నాయి. ఇక, ఈవీ స్కూటర్లతో కలిపే చార్జర్లను విక్రయించే అంశంపై భారీ పరిశ్రమల శాఖతో కొన్నాళ్లుగా చర్చలు జరుపుతున్నట్లు ఏథర్ ఎనర్జీ తెలిపింది. చట్టబద్ధంగా ఇలా చేయాల్సిన అవసరం లేనప్పటికీ వాహనాలతో పాటే చార్జరును కూడా ఇచ్చేలా తమ నిబంధనలు మార్చుకున్నట్లు వివరించింది. అలాగే 2023 ఏప్రిల్ 12కు ముందు కొనుగోలు చేసిన వాహనాల విషయంలో చార్జర్లకు వసూలు చేసిన మొత్తాన్ని రిఫండ్ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ఇదే తరహాలో టీవీఎస్ మోటార్ కంపెనీ తాము రూ. 20 కోట్లు పైచిలుకు వాపసు చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది.

సూచీలకు మళ్లీ లాభాలు

- నష్టాలు ఒకరోజుకే పరిమితం
- ఫెడ్ నుంచి సానుకూల సంకేతాలు
- ఫైనాన్స్, మెటల్ షేర్లకు డిమాండ్
- సెన్సెక్స్ లాభం 556 పాయింట్లు
- 18,250 పైకి నిఫ్టీ



ముంబై: ఒక రోజు నష్టాల ముగింపు తర్వాత దేశీయ స్టాక్ సూచీలకు గురువారం మళ్లీ లాభాలొచ్చాయి. వడ్డీ రేట్ల పెంపు ఈ దఫా చివరిది కావచ్చంటూ ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధాన కమిటీ నుంచి సంకేతాలు వెలువడ్డాయి. ఇటీవల విడుదలైన దేశీయ కార్పొరేట్ మార్చి త్రైమాసిక ఫలితాలు మెప్పించాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు, క్రూడాయిల్ ధరలు దిగిరావడం కలిసొచ్చాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 1% వరకు బలపడి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ 65 పాయింట్లు పెరిగి 61,258 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 605 పాయింట్లు ర్యాలీ చేసి 61,797 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ఆఖరికి 556 పాయింట్ల లాభంతో 61,749 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఇంట్రాడేలో 177 పాయింట్లు దూసుకెళ్లి 18,267 గరిష్టాన్ని తాకింది. చివరికి 166 పాయింట్లు బలపడి 18,256 వద్ద నిలిచింది. విస్తృత స్థాయి మార్కెట్లో ఒక్క ఎఫ్‌ఎంసీజీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.83%, 0.82% చొప్పున రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1415 కోట్లు, దేశీయ ఇన్వెస్టర్లు రూ.442 కోట్ల షేర్లను కొన్నారు. బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే కంపెనీల మొత్తం విలువ రూ.2.21 లక్షల కోట్లు పెరిగి 275.13 లక్షల కోట్లకు చేరింది. ఆసియాలో షాంఘై, హాంగ్‌కాంగ్ సూచీలు లాభపడగా., కొరియా ఇండెక్స్ నష్టపోయింది. ఈసీబీ పావుశాతం వడ్డీరేట్ల పెంపుతో యూరప్ మార్కెట్లు 0.50 – 1% క్షీణించాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్స్ సర్వీస్ 'బై' రేటింగ్‌తో ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో షేరు 3% పైగా లాభపడి రూ.65.63 వద్ద స్థిరపడింది.
- మార్చి త్రైమాసికంలో నికరలాభం 13% బజాజ్ కన్జూమర్ కేర్ షేరు నాలుగుశాతం పెరిగి రూ.172 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో పదిశాతం దూసుకెళ్లి రూ.182 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- అంచనాలకు మించి మార్చి క్వార్టర్ ఫలితాలను ప్రకటించడంతో ఏబీబీ షేరు ఐదున్నర శాతం బలపడి రూ.3,646 వద్ద స్థిరపడింది.

హీరో మోటోకార్ప్ లాభం జూమ్

షేరుకి రూ. 35 డివిడెండ్



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి (క్యూ4)లో నికర లాభం 31% జంప్‌చేసి రూ. 811 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది (2021–22) ఇదే కాలంలో రూ. 621 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,628 కోట్ల నుంచి రూ. 8,672 కోట్లకు జంప్ చేసింది. షేరుకి రూ.35 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి సైతం కంపెనీ నికర లాభం రూ. 2,329 కోట్ల నుంచి రూ.2,800 కోట్లకు ఎగసింది. ఆదాయం సైతం రూ. 30,106 కోట్ల నుంచి రూ. 34,727 కోట్లకు బలపడింది. ఈ కాలంలో 53.29 లక్షల వాహనాలు విక్రయించింది. 2021–22లో ఇవి 49.44 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో హీరో మోటో షేరు స్వల్ప లాభంతో రూ. 2,514 వద్ద ముగిసింది.

ఇక జియో ఫైనాన్షియల్ సర్వీసులు

- రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి విడదీత
- వాటాదారులకు ప్రతీ షేరుకీ 1 షేరు జారీ



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) తమ ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని ప్రత్యేక కంపెనీగా విడదీయనుంది. ఇందుకు వాటాదారులు, రుణదాతలు తాజాగా ఆమోద ముద్ర వేశారు. తొలుత రిలయన్స్ స్ట్రాటజిక్ వెంచర్స్ లిమిటెడ్(ఆర్ఎస్ఐఎల్) పేరుతో విడదీయనున్న కంపెనీని తదుపరి జియో ఫైనాన్షియల్ సర్వీసులుగా మార్పు చేయనున్నారు. వాటాదారుల సమావేశంలో ఈ ప్రతిపాదనకు 99.99 శాతం ఓట్లు లభించినట్లు ఆర్ఐఎల్ వెల్లడించింది. కాగా.. ఆర్ఐఎల్ వాటాదారులకు తమ వద్దగల ప్రతీ షేరుకీ రూ. 10 ముఖ విలువగల ఆర్ఎస్ఐఎల్ షేరును జారీ చేయనున్నారు. తదుపరి ఆర్ఎస్ఐఎల్.. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్(జేఎఫ్ఎస్ఎల్)గా ఆవిర్భవించనుంది.

సెప్టెంబర్‌కల్లా లిస్టింగ్

జెఫరీస్ రీసెర్చ్ వివరాల ప్రకారం జేఎఫ్ఎస్ఎల్ స్టాక్ ఎక్స్ఛేంజీలలో సెప్టెంబర్‌కల్లా లిస్ట్‌కానుంది. ఇందుకు అప్పటికల్లా అన్ని అనుమతులూ లభించగలవని అభిప్రాయపడింది. కంపెనీ వెనువెంటనే రుణ కార్యకలాపాలను ప్రారంభించనున్నట్లు తెలియజేసింది. అసెట్ మేనేజ్‌మెంట్, జీవిత, సాధారణ బీమా విభాగాలకు నియంత్రణ సంస్థల అనుమతులను కోరనుంది. వీటిని 12–18 నెలల్లోగా పొందే వీలున్నట్లు జెఫరీస్ పేర్కొంది. ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని విడదీసేందుకు గతేడాది అక్టోబర్‌లో ఆర్ఐఎల్ గ్రూప్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆర్ఐఎల్‌కు పూర్తి అనుబంధ సంస్థగా ఆర్ఎస్ఐఎల్ వ్యవహరిస్తోంది. ఆర్‌బీఐ వద్ద రిజిస్టరై డిపాజిట్లు సమీకరించని ప్రధాన ఎన్‌బీఎఫ్‌సీగా కొనసాగుతోంది.

ఈ వార్తల నేపథ్యంలో ఆర్ఐఎల్ షేరు 1.2 శాతం బలపడి రూ. 2,448 వద్ద ముగిసింది.

కామత్‌కు బాధ్యతలు



ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ ఎండీ, సీఈవో కేవీ కామత్‌ను జేఎఫ్ఎస్ఎల్‌కు నాన్ఎగ్జిక్యూటివ్‌గా చైర్మన్‌గా ఆర్ఐఎల్ ఎంపిక చేసింది. 2021–22లో ఈ విభాగం రూ. 1,536 కోట్ల ఆదాయం సాధించింది. రూ. 27,964 కోట్ల సంయుక్త ఆస్తులను కలిగి ఉంది. బ్రోకింగ్ సంస్థ మెక్వారీ వివరాల ప్రకారం జియో ఫైనాన్షియల్ విలువ రూ. 1.52 లక్షల కోట్లకుపైనే. దేశీయంగా ఐదో అతిపెద్ద ఫైనాన్షియల్ సర్వీసుల సంస్థగా నిలవనుంది.

యువర్స్

• సక్సెస్ స్టోరీ



అక్షయ్ మకర్

క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీలకు సంబంధించిన విషయాలపై చదువుకునే రోజుల నుంచి అక్షయ్ మకర్‌కు ఆసక్తి, అనురక్తి.

ఆ ఆసక్తి, అనురక్తులు అక్షయ్‌ని సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా రూపుదిద్దుకునేలా చేశాయి.

అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చేశాయి.

క్లీన్ ఎనర్జీ స్టార్టప్ 'క్లైమటేన్‌జా'తో పరిశ్రమలకు తక్కువ ఖర్చుతో సోలార్ థర్మల్ ఎనర్జీని అందిస్తున్నాడు అక్షయ్ మకర్...

శక్తిమంతుడు



ఢిల్లీకి చెందిన అక్షయ్ మకర్ అక్కడి ఐపీ యూనివర్శిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ చేశాడు. వాతావరణ మార్పులపై రెండు పరిశోధనాత్మక వ్యాసాలు రాశాడు.

ఒక సైన్స్ ఫిక్షన్ నవల రాయడానికి ప్లాన్ చేసుకున్నాడు.

తనకు ఇష్టమైన సబ్జెక్ట్ సోలార్ ఎనర్జీ. ఈ సబ్జెక్ట్‌కు సంబంధించిన పుస్తకాలు చదువుతున్నప్పుడు,, డాక్యుమెంటరీలు చూస్తున్నప్పుడు 'సౌరశక్తితో ఎన్నో సాధించవచ్చు' అనిపించింది.

'అంకురం' ఆలోచనకు అప్పుడే బీజం పడింది.

మొరాకోకు వెళ్లి అక్కడి ఉత్తర ప్రాంతంలో ఉన్న సోలార్ థర్మల్ పవర్ టెక్నాలజీ ప్లాంట్‌లను సందర్శించి ఎన్నో విషయాలపై అవగాహన ఏర్పర్చుకున్నాడు.

1985లోనే సోలార్ థర్మల్ పవర్ టెక్నాలజీ ఆ దేశానికి వచ్చింది. మన దేశంలో ఆలస్యంగా వచ్చింది.

కాలిఫోర్నియాలోని మోజావే ఎడారిలో ప్రపంచంలోనే అతి పెద్ద సోలార్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఉంది. ఆ తరువాత స్థానంలో స్పెయిన్‌లోని సోల్నోవా సోలార్ పవర్ ప్రాజెక్ట్, అండసోల్ సోలార్ పవర్ ప్రాజెక్ట్‌లు ఉన్నాయి.

పర్యావరణానికి సంబంధించిన ఆసక్తి, అనురక్తి, కృషికి అక్షయ్‌కు ఎన్నో అవార్డ్‌లు లభించాయి.

ఇంధనవనరులకు సంబంధించిన ఒక సదస్సుకు హాజరైన తరువాత అక్షయ్‌కు తన లక్ష్యం పట్ల స్పష్టత ఏర్పడింది. 'క్లైమటేన్‌జా' అంకురంతో తన కలలను సాకారం చేసుకున్నాడు అక్షయ్.

'క్లైమటేన్‌జా'కు సంబంధించి 80 శాతం ప్రాజెక్ట్‌లు మన దేశంలోనే ఉన్నాయి.

మన దేశం విషయానికి వస్తే టెక్స్‌టైల్, ఫుడ్‌ప్రాసెసింగ్, డైరీ, ఫార్మా...మొదలైన రంగాలకు చెందిన పరిశ్రమలతో కలిసిపనిచేస్తోంది కంపెనీ.

ఎస్‌యూ(స్పేస్ యుటిలైజేషన్), టీఈ(టెక్నికల్ ఎఫిసియెన్సీ), ఎల్‌సీ(లోయర్ కాస్ట్)పై దృష్టి పెట్టిన 'క్లైమటేన్‌జా' పోటీ కంపెనీలతో పోల్చితే 35 నుంచి 40 శాతం తక్కువ ధరకు పరిశ్రమలకు ఇంధనాన్ని అందించాలనుకుంటుంది.

ర్యాలిస్ ఇండియా, టాటా కెమికల్స్, ఎన్‌సీఎల్... మొదలైన కంపెనీలతో కలిసి పనిచేస్తున్న 'క్లైమటేన్‌జా' తాజాగా కోకాకోలా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది.

వినూత్నమైన ఆవిష్కరణలు చేస్తున్న అంకురాల వెన్నుతడుతున్న చిలీ ప్రభుత్వం అక్షయ్‌ను తమ దేశానికి ఆహ్వానించింది. సోలార్ సీఎస్‌పీ సోల్యూషన్స్‌పై ప్రభుత్వ ప్రతినిధులు అక్షయ్‌తో చర్చించారు. ఈ సాంకేతికతకు ఉత్తర చిలీ సరియైనదని చెప్పాడు అక్షయ్.

'మన లక్ష్యానికి సంబంధించి భిన్నమైన అభిప్రాయాలు వినవచ్చు. అయితే అయోమయానికి మాత్రం గురికాకూడదు. లక్ష్యంపై స్పష్టత ఉంటే ఎలాంటి గందరగోళానికి అవకాశం ఉండదు. ప్రయాణం మొదలుపెట్టినప్పుడు పూలబాటల గురించి కాదు ముళ్ళ బాటల గురించి ఆలోచించాలి. ప్రతికూల పరిస్థితులలో మనకు ధైర్యం ఇచ్చే ఆత్మీయులు ఎవరో ఒకరు ఉండాలి. ఎవరూ లేనప్పుడు మనకు మనమే ధైర్యం చెప్పుకోగలగాలి' అంటున్న 29 సంవత్సరాల అక్షయ్ మకర్ మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

• మ్యూజిక్ వరల్డ్

రచిత స్వరాలు

బాలీవుడ్‌లోని అతికొద్ది మంది ఫిమేల్ కంపోజర్‌లలో రచిత అరోరా ఒకరు. 'ముక్కాబాజ్' 'న్యూటన్' 'జడ్జిమెంటల్ హై క్యా' సినిమాలకు స్వరాలు సమకూర్చింది. ఢిల్లీకి చెందిన రచితకు హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో ప్రవేశం ఉంది. థియేటర్ ఫ్రెండ్స్ కోసం సరదాగా మ్యూజిక్ కంపోజ్ చేసేది.

అది తన ఫ్రెండ్స్‌కు బాగా నచ్చేది.

'నువ్వు ముంబై బాట పట్టాల్సిందే' అనేవారు.

అలా ముంబైకి వచ్చిన రచిత అనురాగ్ కశ్యప్ 'ముక్కాబాజ్'తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఫిల్మ్స్‌తో పాటు వెబ్‌సిరీస్‌లకు కూడా పనిచేస్తోంది రచిత. మరోవైపు పాటలకు సంబంధం లేకుండా ఎన్నో ప్రాజెక్ట్‌లకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చేస్తుంది.

'బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అనేది సవాలుతో కూడిన పని. ఆసక్తికరమైనది. రకరకాల ఎమోషన్స్‌ను ప్రేక్షకులకు కనెక్ట్ చేయాలి. ప్రతి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ నాకు ప్రత్యేక ప్రయాణం' అంటుంది రచిత.



రచిత అరోరా

మ్యూజిక్ కంపోజ్‌కు ముందు రకరకాల జానర్స్‌కు సంబంధించి రిసెర్చ్ వర్క్ తప్పకుండా చేస్తుంది. రిసెర్చ్‌కు వారాలు, నెలలు గడిచిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ సినిమాకు, వెబ్‌సిరీస్‌కు సంబంధించిన కథాప్రపంచంలోకి వెళ్లడానికి ఆ సబ్జెక్ట్‌కు సంబంధించిన పుస్తకాలు చదువుతుంది. రచితకు హిందుస్థానీ సంగీతంతో పాటు జాజ్, బ్లూస్‌లో కూడా ప్రవేశం ఉంది.

'ఓటీటీ బూమ్ అనేది న్యూకమర్స్‌కు ఎంతో ఉపయోగపడుతుంది. యువతకు రకరకాల ప్లాట్‌ఫామ్‌లలో రకరకాల అవకాశాలు ఉన్నాయి' అంటుంది రచిత అరోరా.

• టెక్... టాక్

షావోమి 13 అల్ట్రా



బాడీ: 163.2×74.6×9.1 ఎంఎం;
వోఎస్: ఆండ్రాయిడ్ 13;
డిస్‌ప్లే: 6.73 అంగుళాలు
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్;
రిజల్యూషన్: 1440×3200 పిక్సెల్స్;
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్, 512జీబి 16జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ • డస్ట్, వాటర్ రెసిస్టెంట్ • ఫింగర్ ప్రింట్ రీడర్

హానర్ ప్యాడ్ వి8 త్వరలో...



రిజల్యూషన్: 2,560×1,600 పిక్సెల్స్;
సైజ్: 11.0 అంగుళాలు;
బరువు: 485 గ్రా.
• మ్యాజిక్ పెన్సిల్
• మ్యాజిక్ కీబోర్డ్;
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
వోఎస్: ఆండ్రాయిడ్ 12;
కలర్స్: బ్లూ, గోల్డ్;
మెమోరీ: 128జీబి 8జీబి ర్యామ్
256జీబి 8జీబి ర్యామ్

చలో గూగుల్ బుక్‌స్టోర్

ఖాళీ సమయం దొరకగానే ఫోన్, ప్యాడ్‌లలో ఎంటర్‌టైన్‌మెంట్ వీడియోలు చూడడం మామూలే. దీనివల్ల తీరికదొరికినా పుస్తకాలు చదివే హాబీ దూరమైపోతుంది. అందుకే ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదవడాన్ని కూడా భాగం చేసుకోవాలి. ఇందుకు ఫోన్, ట్యాబ్... మొదలైన వాటి ద్వారా గూగుల్ బుక్ స్టోర్‌లోకి వెళ్లడం ఒక మార్గం.

ప్రపంచ సాహిత్యాన్ని పాఠకులకు పరిచయం చేయడానికి 2004లో గూగుల్ లైబ్రరీ ప్రాజెక్ట్ లాంచ్ అయింది.

- గూగుల్ లైబ్రరీ అనేది పుస్తకాలు చదవడానికి, డౌన్‌లోడ్ చేసుకోవడానికి, ప్రివ్యూ బుక్స్ కోసం ఉపయోగపడుతుంది.
- పేజీ టాప్‌లో 'సిమిలర్ బుక్స్' ఆప్షన్ ఉంటుంది. దీని ద్వారా తాము చదువుతున్న పుస్తకానికి దగ్గరగా ఉండే ఇతర పుస్తకాలను సెలెక్ట్ చేసుకోవచ్చు.
- ఏ పుస్తకాన్ని ఎప్పుడు చదవాలో ప్లాన్ చేసుకోవడానికి గూగుల్ క్యాలెండర్ యాప్‌ను ఉపయోగించుకోవచ్చు. పుస్తకం చదవాల్సిన టైమ్‌కు ఆటోమేటిక్‌గా గూగుల్ నోటిఫికెషన్ జారీ చేస్తుంది.
- ఎలాంటి అంతరాయం లేకుండా పుస్తకాలు చదువుకోవడానికి 'డోన్ట్ డిస్టర్బ్' మోడ్ ఆప్షన్ ఉంది.
- సెలెక్ట్ చేసుకున్న పుస్తకాన్ని ఎంతసేపు చదవాలి అనేదాని విషయంలో కాలపరిమితి నిర్ణయించుకోడానికి 'క్లాక్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

• ఇంగ్లిష్ ఇడియమ్స్

బాబ్స్ యువర్ అంకుల్

BOB'S YOUR UNCLE

'ఏం ఫరవాలేదు ఆ పని చాలా ఈజీగా అయిపోతుంది'

'అలా కాదు. ఇలా చేసి చూడు. పెద్దగా కష్టపడాల్సిన అవసరం ఉండదు'....ఇలాంటి సందర్భంలో ఉపయోగించే ఇడియమ్ బాబ్స్ యువర్ అంకుల్. దీని మూలాలు ఇంగ్లాండ్‌లో ఉన్నాయి. అలనాటి బ్రిటిష్ ప్రధాని రాబర్ట్ (బాబ్) తన బంధువు ఒకరిని ఐర్లాండ్ చీఫ్ సెక్రెటరీగా నియమించాడు. బాబ్ బంధుప్రీతిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న సమయంలో 'బాబ్స్ యువర్ అంకుల్' అనే మాట పుట్టిందని ఒక వెర్షన్ ఉంది. 1937లో వచ్చిన 'డిక్షనరీ ఆఫ్ స్లాంగ్'లో ఈ ఇడియమ్ కనిపించింది.

ఉదా: యూ యాడ్ 2 కప్స్ ఆఫ్ వాటర్ టు ది మిక్స్. హీట్ ఇట్ ఫర్ 5 మినిట్స్ అండ్ బాబ్స్ యువర్ అంకుల్. దీ సూప్ ఈజ్ రెడీ.

• గేమింగ్ : నేడే విడుదల



ఒక అడుగు ముందుకు వేసావో... అంతే!

యాక్షన్ రోల్-ప్లేయింగ్ గేమ్ 'హాగ్‌వార్ట్స్ లెగసీ' నేడు విడుదల అవుతుంది. విజార్డింగ్ వరల్డ్ ఫ్రాంచైజీలో భాగంగా వస్తున్న గేమ్ ఇది. 1800 నాటి కాల నేపథ్యంలో సాగే ఈ గేమ్‌లో ప్లేయర్స్ స్టూడెంట్స్‌లా మారాల్సి ఉంటుంది. ప్లేయర్స్ జర్నీలో ప్రొఫెసర్ ఎలేజర్ ఫిగ్ ముఖ్య పాత్ర పోషిస్తాడు. ఈ ప్రొఫెసర్‌ను ప్లేయర్స్ ఎలా ఎదుర్కొంటారు అనేది కీలకం. ఈ గేమ్‌లోని ఎన్విరాన్‌మెంటల్ పజిల్స్‌ను ఛేదించడానికి తమ సామర్థ్యాలకు పదును పెట్టాల్సి ఉంటుంది.

ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్ 4 జానర్స్: యాక్షన్–రోల్ ప్లేయింగ్
మోడ్స్: సింగిల్ ప్లేయర్
ప్లాట్‌ఫామ్స్: ప్లే స్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ నిన్‌టెండో స్విచ్

క్లుప్తంగా...

భద్రాద్రిలో హైకోర్టు జడ్జి


భద్రాద్రి ఆలయంలో హైకోర్టు జడ్జి జస్టిస్ రాజేశ్వరరావు, తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని గురువారం తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వర రావు దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలోని మూలమూర్తులకు ఆయన పూజలు చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఉద్యానశాఖ సంచాలకుడు హన్మంతరావు, కలెక్టర్ అనుదీప్ కూడా స్వామి వారిని దర్శించుకున్నారు.

పట్నా హైకోర్టుకు జస్టిస్ అభిషేక్‌రెడ్డి

బదిలీ సిఫారసులకు కేంద్రం ఆమోదం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అన్నిరెడ్డి అభిషేక్‌రెడ్డి పట్నా హైకోర్టుకు బదిలీ అయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసులకు అనుగుణంగా కేంద్రం ఆమోదం తెలపడంతో గురువారం బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. 5 నెలల క్రితమే హైకోర్టులోని ముగ్గురు న్యాయమూర్తుల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన విషయం తెలిసిందే. వీరిలో ఏపీ నుంచి బదిలీపై వచ్చిన కన్నెగంటి లలితను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయాలనే ప్రతిపాదన ఇంకా అమలు కాలేదు. ఆ సిఫారసుల మేరకు గత నెలలో జస్టిస్ నాగార్జున్, తాజాగా జస్టిస్ అభిషేక్‌రెడ్డి బదిలీ అయ్యారు. ప్రస్తుతం హైకోర్టులో సీజే కాకుండా 30 మంది న్యాయమూర్తులు ఉండగా, జస్టిస్ అభిషేక్‌రెడ్డి బదిలీతో వారి సంఖ్య 29కి తగ్గింది.

శరత్‌బాబుపై వదంతులు సృష్టిస్తే కేసు

సాక్షి, హైదరాబాద్: తీవ్ర అనారోగ్య సమస్యలతో గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ నటుడు శరత్‌బాబు ఆరోగ్యంపై ఇష్టారాజ్యంగా వార్తలు రాస్తున్న వారిపై ఆయన సోదరుడి కుమారుడు ఆయుష్ తేజస్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. తెలిసీ తెలియకుండా తప్పుడు వార్తలు ప్రచారం చేయడంపై కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ఆ వార్తల్ని వెంటనే సదరు యూ ట్యూబ్ చానళ్లు, సోషల్ మీడియాలో తొలగించని పక్షంలో సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం శరత్‌బాబు ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన త్వరలోనే కోలుకుంటారని వైద్యులు చెబుతున్నారని వివరించారు. శరత్‌బాబు కోలుకోవాలని ప్రార్థిస్తున్న అభిమానులు, శ్రేయోభిలాషులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

టీఎస్ఐసెట్ దరఖాస్తు గడువు రేపటి వరకే..

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు గాను 2023–24 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న టీఎస్ఐసెట్ దరఖాస్తు గడువు ఈ నెల 6తో ముగియనుంది. రూ.250 అపరాధ రుసుముతో ఈ నెల 12 వరకు, రూ.500 అపరాధ రుసుముతో 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని టీఎస్ఐసెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 12 నుంచి 15వరకు ఏమైనా సవరణలు ఉంటే సరిచూసుకోవచ్చని తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేనేత మగ్గాలను జియో ట్యాగింగ్ చేస్తూ.. కార్మికుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత, జౌళిశాఖ అధికారులు సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. కార్మికులకు సంబంధించిన పక్కా సమాచారాన్ని ఆధునిక సాంకేతికత సహకారంతో ఆన్‌లైన్‌లో భద్రపరుస్తున్నారు. ఆధార్ నంబరు, బ్యాంకు ఖాతా, లూమ్ ఫొటోలతో మగ్గం ఉన్న చోటి నుంచే అక్షాంశ, రేఖాంశాలతో సహా జియో ట్యాగింగ్ చేస్తున్నారు. చేనేత మగ్గాలతోపాటు, కండెలు చుట్టే కార్మికుల వివరాలు, ఆ మగ్గాలపై పని చేసే ఇతర అనుబంధ రంగాల కార్మికుల సమాచారాన్ని సైతం క్రోడీకరించి పొందుపరుస్తున్నారు.

సిరిసిల్ల

సంక్షేమాన్ని ట్యాగ్ చేసేలా..

- చేనేత మగ్గాలను జియో ట్యాగింగ్ చేస్తున్న జౌళిశాఖ అధికారులు
- కార్మికులు, మగ్గాల సమగ్ర డేటా నమోదు
- సంక్షేమ పథకాలను నేరుగా అందించేందుకు వీలుగా సమాచారం సేకరణ

చేనేత మగ్గాలను ఆన్‌లైన్ చేయడం ద్వారా కార్మికులు, మగ్గాల సమాచారం పక్కాగా ప్రభుత్వం వద్ద ఉంటుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న చేనేత మిత్ర పథకం కింద 40 శాతం యార్న్ (నూలు)

పక్కాగా లబ్ధి..బోగస్‌కు చెక్

సబ్సిడీ అందిస్తున్నారు.ఆన్‌లైన్ ప్రక్రియతో ఈ సబ్సిడీ నేరుగా ఎలాంటి బిల్లులు లేకుండానే అసలైన లబ్ధిదారులకు చేరే అవకాశం ఉంటుంది. నేతన్నలకు చేయూత పథకం (త్రిఫ్ట్)లో చేనేత కార్మికులు పొదుపు చేసుకునే అవకాశం ఉంటుంది. గరిష్టంగా ప్రతి నెలా రూ.1,200 పొదుపు చేస్తే.. అంతే మొత్తం అంటే మరో రూ.1,200 ప్రభుత్వం అందిస్తుంది. ఆ సొమ్ము చేనేత కార్మికుల ప్రత్యేక బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. పొదుపు చేసుకున్న సొమ్ము, దానిపై వడ్డీ కలిపి 36 నెలల తర్వాత కార్మికులు తీసుకోవచ్చు. త్రిఫ్ట్ సొమ్మును నెలనెలా నేరుగా కార్మికుల వేతనాల నుంచి తీసుకునే వెసులుబాటు ఉంటుంది. ముద్ర రుణాలను బ్యాంకుల ద్వారా అందించే అవకాశం ఉంటుంది. ఇలా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పక్కాగా లబ్ధిదారుల దరికి చేర్చవచ్చు. మరోవైపు బోగస్ చేనేత సహకార సంఘాలు, బోగస్ సభ్యుల బెడద పూర్తిగా తొలగిపోతుంది. నిజంగా శ్రమించే కార్మికులు, కండిషన్‌లో ఉన్న మగ్గాల డేటా ఆన్‌లైన్‌లో ఉంటుంది.

వివరాలు రాసుకున్నారు..

మాది సిరిసిల్ల గణేశ్‌నగర్. కిరాయి ఇంట్లో ఉంటాను. చిన్నప్పటి నుంచి గిదే పని చేస్తున్న. నా భార్య పెంటవ్వకు పక్షవాతం. ఆమెకు పెన్షన్ వస్తుంది. రోజుకు ఐదు మీటర్ల బట్ట నేస్తా. మీటరుకు రూ.28.50 ఇస్తారు. రోజంతా పని చేస్తే రూ.140 వరకు వస్తాయి. మొన్ననే నా వివరాలు రాసుకుని, ఫొటోలు తీసుకున్నారు.

- రాపెల్లి హన్మాండ్లు(89), చేనేత కార్మికుడు, సిరిసిల్ల

క్షేత్రస్థాయిలో సర్వేలు చేస్తున్నాం



క్షేత్రస్థాయిలో చేనేత మగ్గాల, కార్మికుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. చేనేత మగ్గాలున్న ప్రతి పల్లెకు వెళ్లి సర్వే నిర్వహించి వివరాలు నమోదు చేస్తున్నాం. ఇది పూర్తి అయితే సంక్షేమ పథకాలు నేరుగా అందించే వీలుంది.

-ఎం.సాగర్, జౌళిశాఖ ఏడీ, సిరిసిల్ల


వివరాలు నమోదు చేస్తున్న అధికారిణి

తగ్గిపోయిన చేనేత మగ్గాలు..

రాష్ట్రంలోని 17 జిల్లాల్లో మరమగ్గాలు ఉన్నాయి. గతంలో ఇవి కేవలం నాలుగు జిల్లాల్లోనే ఉండేవి. రాష్ట్ర వ్యాప్తంగా 36,088 మరమగ్గాలు ఉండగా, చేనేత మగ్గాలు 17,573 మాత్రమే ఉన్నాయి. కాగా మరమగ్గాలకు ఇప్పటికే జియో ట్యాగింగ్ చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో 26,494 మరమగ్గాలు ఉన్నాయి. చేనేత మగ్గాలు మాత్రం165 మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు జౌళిశాఖ చేపట్టిన ఆన్‌లైన్ నమోదు పూర్తి అయితే.. సమగ్ర వివరాలు అందుబాటులో ఉంటాయి. అయితే చేనేత మగ్గాలు, చేనేత కార్మికుల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. మారుమూల గ్రామాల్లో ఫోన్ సిగ్నల్, నెట్‌వర్క్ సరిగా లేక సమాచారాన్ని నమోదు చేయడం కష్టమవుతోంది.


యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం యాగ మండపంలో గురువారం మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదాద్రిలో ముగిసిన శ్రీస్వామివారి జయంతి ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయం, శ్రీ పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీస్వామివారి జయంతి ఉత్సవాలు గురువారం ముగిశాయి. ప్రధానాలయంలో ఆచార్యులు నిత్యహవనాలు నిర్వహించిన తర్వాత ప్రథమ ప్రాకారంలోని యాగశాలలో పూర్ణాహుతి, ముఖమండపంలో బంగారు, వెండి, రాగి కలశాలకు పూజలు చేపట్టి స్వయంభూ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావ ప్రవచనం, నివేదన, తీర్థ ప్రసాదగోష్టి, మంగళ నీరాజనం చేసి ఉత్సవాలను ముగించారు.

రోబోతో దరఖాస్తుల క్లియరెన్స్!

- వివిధ డాక్యుమెంట్లు, కార్డుల పరిశీలన కూడా..
- కృత్రిమ మేధ, ఆగ్‌మెంటెడ్ రియాలిటీతో వినూత్న ఆవిష్కరణలు
- కాప్ జెమిని సీనియర్ డైరెక్టర్ రంజన్ ప్రధాన్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: మీరు కారు నడిపే తీరు ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గిస్తే..?
కెమెరా ముందు తీసే ఒక్క గుంజీ.. మీ ఫిట్‌నెస్‌ను తెలియజేస్తే..?
ఇదేదో భలే ఉంది కదా.. ఆగ్‌మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), కృత్రిమ మేధ (ఏఐ) వంటి టెక్నాలజీలతో ఇలాంటి వినూత్న విధానాలను సాకారం చేస్తోంది హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న 'కాప్ జెమిని అప్లైడ్ ఇన్నోవేషన్ ఎక్స్ఛేంజీ (ఏఐఈ)'. అంతేకాదు మీరు ధరించే స్మార్ట్ వాచ్, డయాబెటిస్ కంట్రోలర్ల ద్వారా సేకరించే సమాచారం ఆధారంగా.. మీకు ప్రోత్సాహకాలు అందించేందుకు.. ఇంట్లో విద్యుత్ పొదుపు, నీటి లీకేజీలు వంటివి లేకుండా చూసుకోవడం ద్వారా ప్రాపర్టీ ట్యాక్స్‌లో రాయితీలు పొందేందుకు కూడా ఏఐఈ టెక్నాలజీలను రూపొందించిందని కాప్ జెమిని సీనియర్ డైరెక్టర్ రంజన్ ప్రధాన్ తెలిపారు. కృత్రిమ మేధ/మెషీన్ లెర్నింగ్, ఆగ్‌మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ వంటి ఆధునిక టెక్నాలజీ రంగాల్లో సంస్థ చేస్తున్న ప్రయోగాలు, అభివృద్ధి చేసిన టెక్నాలజీలను కాప్ జెమిని గురువారం మీడియాకు పరిచయం చేసింది. కోకాపేటలోని జీఏఆర్ ఇన్ఫోభాన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టీ-హబ్, స్టార్టప్‌లు, విద్యాసంస్థల భాగస్వామ్యంతో కాప్ జెమిని చేపట్టిన వినూత్న కార్యక్రమాల వివరాలను వెల్లడించింది.

కార్డుల పరిశీలన మొదలుకొని..

కాప్ జెమిని అభివృద్ధి చేసిన టెక్నాలజీల్లో రోబో హ్యాండ్ వినూత్నమని కంపెనీ సీనియర్ డైరెక్టర్ రంజన్ ప్రధాన్ తెలిపారు. దీని సాయంతో తక్కువ సమయంలో వందలకొద్దీ వివిధ డాక్యుమెంట్లు, డెబిట్/క్రెడిట్ కార్డుల పరిశీలన చేపట్టవచ్చని వివరించారు. ఉదాహరణకు బీమా కోసం చేసిన దరఖాస్తులను కంప్యూటర్ కెమెరా సాయంతో 'చదివి', వివరాలను పరిశీలిస్తుందని.. అవసరమైన వివరాలు లేకున్నా, తప్పులున్నా దరఖాస్తును తిరస్కరిస్తుందని తెలిపారు. ఉద్యోగులు పునఃపరిశీలన తర్వాత అవసరమైన సమాచారాన్ని తెప్పించుకోవచ్చని వివరించారు. ఇక షాపింగ్ మాల్స్‌లో దుస్తుల కోసం వర్చువల్ ట్రయల్‌రూమ్‌ను, ఆగ్‌మెంటెడ్ రియాలిటీ సాయంతో ఏదైనా కార్డు (లాయల్టీ, అడ్మిషన్, డెబిట్/క్రెడిట్)లోని వివరాలను తెలుసుకునే టెక్నాలజీని అభివృద్ధి చేశామన్నారు. ఈ టెక్నాలజీల్లో కొన్ని ఇప్పటికే వినియోగంలో ఉన్నాయన్నారు. వర్చువల్ రియాలిటీ ఆధారంగా మెటావర్స్ జోన్ ఒకదాన్ని కూడా సృష్టించామని తెలిపారు. కాప్ జెమినికి ప్రపంచవ్యాప్తంగా మొత్తం 23 ఏఐఈ కేంద్రాలున్నాయని చెప్పారు.


రంజన్ ప్రధాన్

తుది తీర్పునకు లోబడే నియామకాలు

కాంట్రాక్టు లెక్చరర్లు, ఉద్యోగుల క్రమబద్ధీకరణపై హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: కాంట్రాక్టు లెక్చరర్లు, మహిళా, శిశు సంక్షేమ శాఖలోని కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు హైకోర్టు తాత్కాలికంగా బ్రేక్ వేసింది. క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగించుకోవచ్చని.. కానీ నియామక కేటాయింపులు మాత్రం కోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 16, అలాగే మహిళా, శిశు సంక్షేమ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ జారీ అయిన జీవో నంబర్ 18ని కొట్టివేయాలని ములుగుకు చెందిన బానోతు సునీత సహా ముగ్గురు నిరుద్యోగులు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ ఎ.సంతోష్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది.

పిటిషనర్ల తరఫున న్యాయవాది సత్యంరెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. నియామక ఉత్తర్వులు ఇప్పుడే ఇవ్వవద్దని ఆదేశిస్తూ, హైకోర్టు విచారణను జూన్ 9వ తేదీ వాయిదా వేసింది.

మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సీఎస్ఈ

- కొత్తగా మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీని చేర్చే యోచన
- రాష్ట్రాలకు ఏఐసీటీఈ ముసాయిదా ప్రతిపాదన
- వచ్చే ఏడాది నుంచి అమలుకు రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్‌లో ముఖ్యమైన కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) కోర్సు స్వరూపాన్ని మార్చాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) నిర్ణయించింది. మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునిక కోర్సుల మేళవింపుతో మార్పు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే దీనిపై ముసాయిదా రూపొందించి, అన్ని రాష్ట్రాల అనుమతికి పంపింది. నూతన విద్యా విధానం-2020కి అనుగుణంగా ఈ మార్పులు చేపట్టింది. వాస్తవానికి 2023–24 విద్యా సంవత్సరం నుంచే దీన్ని అమల్లోకి తేవాలని భావించింది. ఒకవేళ ఆలస్యమైతే 2024–25 నుంచి కొత్త బోధన ప్రణాళికను అమల్లోకి తెచ్చే వీలుంది. ప్రధానంగా కంప్యూటర్ సైన్స్‌లో పాత సిలబస్‌ను తొలగించి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. దీనికోసం 2021లో దేశవ్యాప్తంగా నిపుణులతో ఓ కమిటీని కూడా వేశారు. అన్ని సబ్జెక్టుల నిపుణులు, మేధావులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఇందులో చేర్చారు. ఈ కమిటీ గత ఏడాది తుది ముసాయిదా నివేదికను ఏఐసీటీఈకి సమర్పించింది.

కొత్త సబ్జెక్టులు

ప్రపంచవ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ, మెషీన్ లెర్నింగ్ వంటి కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. మార్కెట్ వర్గాలు సైతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను కోరుతున్నాయి. కంప్యూటర్ సైన్స్ కోర్సు చేసిన విద్యార్థులు ఈ కోర్సులను మళ్లీ విడిగా నేర్చుకోవాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో ప్రస్తుతం ఉన్న కంపైలర్ డిజైన్, థియరీ ఆఫ్ కంప్యూటేషన్ సబ్జెక్టులను తొలగించాలని, దీని స్థానంలో మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీని ప్రవేశపెట్టాలని నిపుణుల కమిటీ సూచించింది. ఇప్పటివరకూ ఈ కోర్సులను ఎంటెక్‌లో లేదా ఇంజనీరింగ్‌లో ప్రత్యేక కోర్సులుగా అందిస్తున్నారు. ఇలాకాకుండా వీటిని సీఎస్ఈలో తప్పనిసరిగా చదవాల్సిన సబ్జెక్టులుగా చేయాలని కమిటీ సూచించింది. కమిటీ సిఫార్సులను ఏఐసీటీఈ అన్ని రాష్ట్రాల అనుమతితో అమలు చేయాలని చూస్తోంది.

పటాయా పార్టీతో సంబంధం లేదు

- అలా ఉంటే వెంటనే ఇక్కడికి రాలేను
- మీడియాకు వీడియో విడుదల చేసిన చీకోటి ప్రవీణ్

సాక్షి, హైదరాబాద్, కొండపాక(గజ్వేల్): మొన్నటికి మొన్న ఈడీ మనీలాండరింగ్ కేసు... నిన్నటికి నిన్న థాయ్‌లాండ్‌లో గుట్టురట్టయిన అక్రమ కెసినో వ్యవహారం... ఈ రెండింటిలోనూ ప్రధానంగా వినిపించిన పేరు చీకోటి ప్రవీణ్ కుమార్. నగరానికి చేరుకున్న ప్రవీణ్ పటాయా కెసినో వ్యవహారంపై స్పందిస్తూ మీడియాకు ఓ వీడియో విడుదల చేశారు. తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారం వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని ఆరోపించారు. ఆ వీడియోలో ప్రవీణ్ మాట్లాడుతూ... 'థాయ్‌లాండ్‌లో నేను ఎలాంటి ఈవెంట్ నిర్వహించలేదు. ఆ ఈవెంట్ దేవ్, సీత అనే వాళ్లు నిర్వహించారు. పోకర్ టోర్నమెంట్ 4 రోజులు పాటు జరుగుతోందని నాకు ఆహ్వానం పంపారు. నేను అక్కడకు వెళ్లిన నాలుగో రోజు సదరు హోటల్‌లోని కాన్ఫరెన్స్ రూమ్‌ను సందర్శించా. అందులో అడుగుపెట్టిన 15 నుంచి 20 నిమిషాల్లోనే పోలీసులు దాడి చేశారు. అప్పుడే నాకు వాళ్లు పంపింది నకిలీ ఆహ్వానపత్రిక అని తెలిసింది. ఆ అక్రమ కెసినో నిర్వహించింది నేనే అయితే ఇంత తేలిగ్గా తిరిగి రాలేను. అలాంటి వాటికి అక్కడ కఠినమైన శిక్షలు ఉన్నాయి. థాయ్‌లాండ్‌లో అక్రమంగా పేకాట శిబిరాలు నిర్వహిస్తే ఆరు నెలల నుంచి ఏడాది వరకు జైలు శిక్షపడుతుంది. నా పాస్‌పోర్టు కూడా బ్లాక్‌లిస్ట్ చేసేవాళ్లు. పోలీసులు దాడి చేసిన రోజు అక్కడి న్యాయస్థానానికి సెలవు. మరుసటి రోజు కోర్టులో స్వల్ప జరిమానాతో విడిచిపెట్టారు' అని వివరించారు.


చీకోటి ప్రవీణ్

నామీద చాలా కుట్రలు

'నా చుట్టూ చాలా కుట్రలు జరుగుతున్నాయి. నేను రాజకీయ పార్టీలోకి వస్తున్నానని కొందరు అనుకుంటున్నారేమో..! ఇంకా దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. పటాయాలో అక్రమ కెసినోతో నాకు ఎలాంటి సంబంధం లేదని నిర్వాహకులు దేవ్, సీత కూడా అక్కడి పోలీసుల వద్ద అంగీకరించారు. ఆ కేసు నుంచి తప్పించుకోవడానికి నేను అక్కడ రూ.50 లక్షలు లంచం ఇచ్చానని జరుగుతున్న ప్రచారం సత్యదూరం. ఆ ఈవెంట్‌కు నాకు ఎలాంటి సంబంధం లేదు'అని ప్రవీణ్ అన్నారు.

నాకేం సంబంధం లేదు: దేవేందర్‌రెడ్డి

థాయ్‌లాండ్‌లోని పటాయాలో జరిగిన గ్యాంబ్లింగ్ డెన్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కొండపాకలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విహార యాత్రకు వెళ్లగా.. అక్కడి హోటల్‌లో ఇండియన్ ఫుడ్ తయారు చేయించామంటూ స్నేహితులు చెప్పడంతో ఆ హోటల్‌కు వెళ్లామన్నారు. 10 నిమిషాల్లోనే పోలీసులు వచ్చి పట్టుకున్నారని చెప్పారు. అక్కడ పోకర్ గేమ్ మాత్రమే పెట్టారని తెలిపారు. తమపై పెట్టిన కేసు నిరాధారమంటూ కోర్టు కొట్టివేసిందన్నారు. కొందరు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.

కల్తీ కల్లు అమ్మినోళ్లకే మళ్లీ లైసెన్సులు ఎలా?

'మద్యం వ్యాపారం' ప్రాథమిక హక్కుకాదని హైకోర్టు వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: కల్లు, మద్యం వ్యాపారం నిర్వహించడం ప్రాథమిక హక్కు కాదని హైకోర్టు స్పష్టం చేసింది. 'అప్పీలుదారులు వర్తకం చేసే కల్లులో డైజోపామ్‌తో కల్తీ అయినట్లు సంబంధిత నిపుణుడు గుర్తించిన తర్వాతే.. రాష్ట్ర ప్రభుత్వం వారి లైసెన్స్‌లు రద్దు చేసింది. అధికారులకు వాటిని పునరుద్ధరించమని చెప్పే ప్రశ్నే లేదు. ఏదేమైనా మద్యం వ్యాపారాన్ని ప్రాథమిక హక్కుగా భావించి కొనసాగించడం చట్టవిరుద్ధం'అని తేల్చిచెప్పింది. నిజామాబాద్‌లోని కల్లు దుకాణాల్లో డైజోపామ్ కల్తీ చేసినట్లు నిర్ధారణ కావడంతో 12 దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తూ 2022, మార్చి 14న అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తర్వాత వారు ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేయడంతో 2022, డిసెంబర్ 31న లైసెన్స్‌లను పునరుద్ధరించారు. దీన్ని సవాల్ చేస్తూ నిజామాబాద్‌కు చెందిన రాజాగౌడ్, రాధాకృష్ణగౌడ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి పిటిషనర్ల వాదనలతో ఏకీభవిస్తూ.. తీర్పునిచ్చారు. సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర సస్పెన్షన్‌ను సవాల్ చేస్తూ వై.జయవర్ధన్ గౌడ్, మరో 11 మంది హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్. తుకారాంజీ ధర్మాసనం తాజాగా విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున రేసు మహేందర్‌రెడ్డి, ప్రభుత్వం తరఫున డీఎల్ పాండు వాదనలు వినిపించారు. ధర్మాసనం.. సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. అప్పీల్‌ను కొట్టివేసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.